అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 08-5-2024

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 10 సంచిక : 128

Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar

16 పేజీలు వెల : 6.50




50 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలి

పీఆర్సీ చైర్మెన్‌కు పీఆర్టీయూటీఎస్ ప్రతిపాదనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 50 శాతం ఫిట్‌మెంట్‌తో రెండో పీఆర్సీని ప్రకటించాలని పీఆర్టీయూటీఎస్ కోరింది. పీఆర్సీ చైర్మెన్ ఎన్ శివశంకర్, సభ్యులు బి రామయ్యకు మంగళవారం హైదరాబాద్‌లో వేతన సవరణ ప్రతిపాదనలను ఆ సంఘం అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు నేతృత్వంలో సమర్పించారు. కనీస వేతనం రూ.35 వేలు ఉండాలని సూచించారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలిపారు. వృత్తి విద్యా ఉపాధ్యాయులకు కోర్టు ఉత్తర్వులను అనుసరించి మొదటి నియామక తేదీ నుంచి సర్వీసును పరిగణిస్తూ పాత పెన్షన్‌ను వర్తింపచేయాలని పేర్కొన్నారు.



గత పీఆర్సీ ప్రతిపాదనల మేరకు నూతన ఆరోగ్య పథకాన్ని రూపొందించి అమలు చేయాలని సూచించారు. అప్రయత్న పదోన్నతులు 5/10/15/20/25 ఏండ్లుగా నిర్ణయించాలని కోరారు. హెచ్‌ఆర్‌ఏ శ్లాబులు 15 శాతం, 17 శాతం, 24 శాతంగా ఉండాలని తెలిపారు. ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులందరికీ మినిమం టైంస్కేల్ వర్తింపచేయాలనీ, సమయానుగుణంగా రెగ్యులర్ చేయాలని పేర్కొన్నారు. ఎయిడెడ్ స్కూల్, మోడల్ స్కూల్, అన్ని సొసైటీల పరిధిలోని గురుకుల విద్యాలయాల అధ్యాపకులకు 010 పద్దు ద్వారా వేతనాలు అందించాలనీ, ఆరోగ్యకార్డులివ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు బి మోహన్‌రెడ్డి, పూల రవీందర్, పీఆర్టీయూ మాజీ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మారుమూల ప్రాంతాలకు వైద్యులు రారు..

దాక్టర్ కిరణ్ మాదాల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హత్యా ప్రయత్నంతో బాధిత వైద్యుడు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటే ఆ వైద్యున్నే సస్పెండ్ చేయడం పట్ల తెలంగాణ బోధనా ప్రభుత్వ వైద్యుల సంఘం (టీటీజీడీఏ) రాష్ట్ర కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. టీటీజీడీఏ రాష్ట్ర సెక్రెటరీ జనరల్ డాక్టర్ కిరణ్ మాదాల మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇలాంటి చర్యలతో మారుమూల ప్రాంతాలకు సేవలందించేందుకు వైద్యులు భయపడే పరిస్థితులు నెలకొంటాయని తెలిపారు.

పునరావృతం కాకుండా చూడాలి -హెచ్‌ఆర్ డీఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కోరుట్ల ఏరియా ఆస్పత్రి డ్యూటీ డాక్టర్ శ్రవణ్ కుమార్ సామూహిక దాడిని హెల్త్ కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్‌ఆర్‌డీఏ) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు మంగళవారం హెచ్‌ఆర్‌డీఏ అడ్‌హక్ కమిటీ డాక్టర్ కె.బ్రహ్మేశ్వర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రులు డాక్టర్లు వారం రోజుల పాటు నల్లబ్యాడ్జీలు ధరించాలని పిలుపునిచ్చారు. జరిగిన ఘటనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలనీ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని

అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
బుధవారం 08-05-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 128
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
16 పేజీలు వెల : 6.50

పోలింగ్ రోజు వేతనంతో కూడిన సెలవు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో మే 13న వేతనంతో కూడిన సెలవును రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ ప్రయివేటు కార్యాలయాలతో పాటు, విద్యాసంస్థలు, ఫ్యాక్టరీలు విధిగా సర్కార్ ఉత్తర్వులను అమలు చేయాలని సీఎస్ శాంతి కుమారి ఆదేశించారు. అన్ని జిల్లాల ...15లో

రైతు భరోసాకు ఈసీ బ్రేక్

- మే 13 పోలింగ్ తర్వాతే పంపిణీ చేయాలని ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
రైతు భరోసా నిధుల పంపిణీపై కేంద్ర ఎన్నికల సంఘం ఆంక్షలు విధించింది. రాష్ట్రంలో లోక్‌సభ పోలింగ్ ముగిసిన తర్వాతే నిధులు విడుదల చేయాలంటూ ఆదేశించింది. ఈ మేరకు మంగళవారం ఈసీ ఉత్తర్వులు జారీ చేసింది. మే 13న పోలింగ్ ముగిసిన తర్వాతే రైతుల ఖాతాల్లో ...15లో



కవితకు కస్టడీ పొడిగింపు

- ఈడీ కేసులో 14, సీబీఐ కేసులో 20 వరకు రిమాండ్
- రేవణ్ణను దేశం దాటించి, నాలాంటి వాళ్లను అరెస్ట్ చేస్తారా?: కవిత
- బెయిల్ పై నేడు ఢిల్లీ హైకోర్టు ముందుకు..

5లో



కేజ్రీవాల్ బెయిల్ పై విచారణ

- సుప్రీంకోర్టు షరతులు
- 20 వరకు పొడిగించిన జ్యుడీషియల్ కస్టడీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో
ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టై ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బెయిల్ పై అత్యున్నత న్యాయ స్థానం విచారణ జరిపింది. అయితే బెయిల్ పై సుప్రీంకోర్టు షరతులు విధించి, తీర్పును రిజర్వ్ చేసింది. మధ్యంతర బెయిల్ ...15లో



కష్టమే..

ప్రజా సమస్యలు ముందుకు.. వెనక్కి పోయిన హిందూత్వ

- కాలం చెల్లిన మెజారిటీవాద రాజకీయాలు
- మసకబారుతున్న మోడీ ప్రాభవం

దేశంలో సార్వత్రిక ఎన్నికల పోరు కీలక దశకు చేరుకుంది. ఇప్పటికే మూడు దశల పోలింగ్ ముగిసింది. మరో నాలుగు విడతల పోలింగ్ జరగాల్సి ఉంది. ఎన్డీఏ నేతలు కలలు కంటున్నట్లు 400కు పైగా స్థానాలు వచ్చే అవకాశాలు ఏ కోశానా కన్పించడం లేదు. మోడీ మానియా క్రమేపీ అదృశ్యమవుతోంది. అనేక రాష్ట్రాల్లో ప్రభుత్వ వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. మోడీ ఛరిష్మాకు కాలం చెల్లిందని రాజకీయ పండితులు తేల్చేశారు.

న్యూఢిల్లీ : బీజేపీ, దాని మిత్రపక్షాలకు 400కు పైగా లోక్‌సభ స్థానాలు వస్తాయని మోడీ గతంలో చెప్పే వారు. 2014, 2019 ఎన్నికల్లో మోడీ ప్రభంజనం స్పష్టంగా కన్పించింది. అయితే ఇప్పుడది ఎక్కడా కానరావడం లేదు. ఓటర్లను ప్రభావితం చేసే ఏకైక అంశం కూడా ఏదీ లేదు. తాను అన్నింటికీ అతీతుడినని మోడీ భావిస్తారు. తనకు ఎదురే లేదని అనుకుంటారు. దేశాన్ని అమృతకాలంలోకి నడిపిస్తానని చెబుతారు. హిందూ మత పెద్దల అభీష్టానికి వ్యతిరేకంగా అసంపూర్తిగా నిర్మితమైన రామమందిరాన్ని అయోధ్యలో అట్టహాసంగా ప్రారంభించారు. తను ఏం చేసినా ప్రజల మద్దతు ఉంటుందని విశ్వసిస్తారు. బీజేపీ కూడా తదుపరి ప్రధాని మోడీయేననే ధీమాతో ఉంది. 'మోడీకీ గ్యారంటీ' పేరుతో ప్రధాని ప్రజలపై హామీల వర్షం కురిపిస్తున్నారు. ఉచితంగా ఆహారం, గృహవసతి, వంటగ్యాస్, కుళాయి నీరు వంటివి వాటిలో కొన్ని. అయితే క్రమంగా మోడీ, ఇతర బీజేపీ నేతల్లో ఆత్మవిశ్వాసం సన్నగిల్లిపోతోంది. రెండో దశ పోలింగ్ ప్రచారం సందర్భంగా ప్రధానిలో అసహనం కన్పించింది. ఆయన తన ఎన్నికల ప్రసంగాల్లో ముస్లింలను లక్ష్యంగా చేసుకొని దాడి చేస్తున్నారు. మైనారిటీలకు కాంగ్రెస్ కొమ్ము కాస్తోందని, హిందువుల సంపదను గుంజుకొని వారికి ధారాదత్తం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపిస్తున్నారు. ఓటర్ల మనోగతాన్ని పసిగట్టేందుకు పలువురు విశ్లేషకులు హిందీ రాష్ట్రాల్లో పర్యటించారు. 2019తో పోలిస్తే బీజేపీ బలం తగ్గుతుందని వారు తేల్చి చెప్పారు. 2019లో హిందీ బెల్ట్‌లో బీజేపీ గరిష్ట సంఖ్యలో స్థానాలు సాధించింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, జార్ఖండ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో మెజారిటీవాద రాజకీయాలు నడిపి ఓట్లు దండుకుంది. అయితే ఇప్పుడు ఆ వాతావరణం కన్పించడం లేదు. ఆయా రాష్ట్రాల్లో మోడీ ప్రాభవం ఇప్పుడు మసకబారింది. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి ప్రజా సమస్యలు ఒక్కసారిగా ముందుకు వచ్చాయి. ఈ నేపథ్యంలో హిందూత్వ వాదం వెనక్కి పోయింది. మోడీకి కంచుకోటలుగా ఉన్న హిందీ రాష్ట్రాల్లో బీజేపీ ఎన్ని స్థానాలు కోల్పోతుందో చూడాల్సి ఉన్నదని రాజకీయ విశ్లేషకుడు యోగేంద్ర యాదవ్ చెప్పారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే మెజారిటీకి అవసరమైన 272 స్థానాలు గెలుచుకోవడం కూడా మోడీకి సవాలేనని ఆయన తెలిపారు.

తప్పుడు వాదనలు
ప్రధాని బీజేపీ బహిరంగ సభల్లో తప్పుడు వాదనలు వినిపిస్తూనే ఉన్నారు. మే 1న గుజరాత్‌లోని బనస్కాంతలో నిర్వహించిన బహిరంగ సభలో .. "ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే కనీసం 272 సీట్లు గెలవడం అవసరం. బీజేపీ తప్ప మిగిలిన దేశంలోని ఏ రాజకీయ పార్టీ 272 స్థానాల్లో పోటీ చేయడం లేదు. అయినా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామంటున్నారు." అని చెప్పుకొచ్చారు. అయితే కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు 327 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడం గమనార్హం.

మూడో దశలో 63 శాతం పోలింగ్

- గుజరాత్‌లో 56.76, ఉత్తరప్రదేశ్‌లో 57.34 శాతమే
- కమళంలో కలవరం

వివరాలు 7లో



ఏమిచ్చినవో చెప్పి వరంగల్‌కు రా..

ఎయిర్‌పోర్ట్, ఓఆర్ఆర్ ఏమైనయ్..?

- కడియం కావ్యను లక్ష మెజారిటీతో గెలిపించాలి : హన్మకొండ, వరంగల్‌లో రోడ్‌షోలు




నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి
ఏం అభివృద్ధి చేసినవో చెప్పినంకనే వరంగల్‌కు రావాలని ప్రధాని మోడీకి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. వరంగల్‌లో విమానాశ్రయాన్ని పునరుద్ధరించలే.. అవుటర్ రింగ్ రోడ్డు నిర్మించలే.. కాజీపేటకు మంజూరైన రైల్వే కోచ్ ఫ్యాక్టరీని లాతూర్‌కు తరలించి చివరకు కాజీపేట రైల్వే జంక్షన్‌ను రద్దు చేసే పరిస్థితికి తీసుకొచ్చిండు.. వీటిపై సమాధానం చెప్పినంకనే వరంగల్‌కు రావాలని అన్నారు. మంగళవారం సాయంత్రం హన్మకొండ చౌరస్తాలో హన్మకొండ డీసీసీ అధ్యక్షులు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన రోడ్డుషోలో సీఎం ప్రసంగించారు. ప్రధాని మోడీ వరంగల్‌కు ఎన్ని కోట్ల ...15లో

తక్షణమే సహాయక చర్యలు చేపట్టండి

- జీహెచ్ఎంసీ, ట్రాన్స్‌కో, పోలీసు అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం
- లోతట్టు కాలనీలు, ట్రాఫిక్, విద్యుత్ సమస్యపై సమీక్ష
- సహాయక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపు

వివరాలు 5లో



అధికారంలోకి రాగానే అగ్నివీర్ రద్దు

అమరవీరుల విభజన సరికాదు

- గిరిజనంపై బీజేపీ అరాచకాలెన్నో
- పేదమహిళలకు రూ.లక్ష సాయం : రాహుల్ గాంధీ

గుమ్లా (జార్ఖండ్) : లోక్‌సభ ఎన్నికల తరువాత ఇండియా వేదిక అధికారంలోకి వస్తే అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తామని కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ మంగళవారం ప్రకటించారు. అగ్నివీర్ పథకాన్ని ...15లో

పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండానే..

మతోన్మాద బీజేపీని ఓడించండి

- సీపీఐ(ఎం) అభ్యర్థి ఎమ్‌డి.జహంగీర్‌ను గెలిపించండి : రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య





నవతెలంగాణ-చౌటుప్పల్
ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించి.. నిత్యం పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడే సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండి.జహంగీర్‌ను గెలిపించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ఎండి.జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ రోడ్డుషో నిర్వహించారు. అనంతరం బహిరంగ సభలో వీరయ్య మాట్లాడారు. మతోన్మాద, నియంతృత్వ, ప్రజా వ్యతిరేక బీజేపీని ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. దేశంలో మోడీ ప్రభుత్వం మతం, కులం పేరుతో ఓట్ల రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం, రోజు కూలి అందించడంలో విఫలమైందని, రోజుకు రూ.178 కూలి సరిపోతుందని చెప్పడం దుర్మార్గమని అన్నారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర ఇవ్వడం లేదన్నారు. రైతులే కూలీలుగా మారారని ఆందోళన వ్యక్తం చేశారు. ధరలు పెంచి పేద ప్రజల నడ్డి విరిచిందన్నారు. బీజేపీ మళ్లీ గెలిస్తే కార్మికులు, రైతులు, ప్రజల మధ్య కూడా చిచ్చుపెడ్తారని అన్నారు.

అభివృద్ధి శూన్యం
సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి.జహంగీర్
భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో రెండు సార్లు కాంగ్రెస్, ఒకసారి బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచినా అభివృద్ధి చేయలేదని ...15లో



నన్ను నమ్మండి..ప్లీజ్

నేను ముస్లింలకు వ్యతిరేకం కాదు : ప్రధాని నరేంద్ర మోడీ

- ఇదంతా ఓటు రాజకీయమే : ప్రతిపక్షాలు

న్యూఢిల్లీ: నేను ఇస్లాంను, ముస్లింలను వ్యతిరేకించనని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. సార్వత్రిక ఎన్నికల సమరం జరుగుతోన్న తరుణంలో ఓ జాతీయ మీడియాతో మాట్లాడిన ఆయన ఈవిధంగా స్పందించారు.
"అది మా విధానం కాదు. నెహ్రూ కాలం నుంచే వారు (విపక్షాలను ఉద్దేశించి) ఈ కథనాలు ప్రచారం చేస్తున్నారు. ముస్లిం వ్యతిరేకులు అంటూ మాపై ఆరోపణలు చేస్తున్నారు. దానినుంచి లబ్ది పొందాలని చూస్తున్నారు. మమ్మల్ని వ్యతిరేకులుగా చూపించి.. తాము వారికి ...15లో

స్కూటీలు రాలే.. లూటీలు షురూ

పాత పథకాలే అమలు చేస్తలే..

- ఒట్టు పెట్టుడు.. కేసీఆర్‌ను తిట్టుడే రేవంత్ పని
- బీజేపీ.. దోపిడీదారులు, పెట్టుబడిదారుల పార్టీ
- మత విద్వేషం, ప్రజల మధ్య చిచ్చు పెట్టడమే ఆ పార్టీ పని
- మోడీ మళ్లీ వస్తే పెట్రోల్, డీజిల్ ధరలు '400 పార్'
- తెలంగాణ ఆత్మగౌరవం, అస్తిత్వం కాపాడేది బీఆర్ఎస్సే.. : కామారెడ్డిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



నవతెలంగాణ-కామారెడ్డి
'అరచేతిలో వైకుంఠం చూపించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కేసీఆర్ కల్యాణలక్ష్మి కింద లక్ష రూపాయలు ఇస్తే దానికి అదనంగా తులం బంగారం ఇస్తామన్నారు. ఎవరికైనా తులం బంగారం వచ్చిందా..? చదువుకునే ఆడపిల్లలకు స్కూటీలు కొనిస్తమన్నారు. స్కూటీలు రాలే కానీ లూటీలు మొదలైయ్యాయి' అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో మంగళవారం రోడ్‌షో, సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. '9వ తేదీ లోగా రైతుబంధు వేస్తాం అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆయనే కుట్ర చేసి, ...5లో



భారీ వర్షం.. నీళ్లపాలైన ధాన్యం

ఈదురుగాలుల బీభత్సం

- పలుచోట్ల వడగండ్లు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- సిద్దిపేట జిల్లాలో పిడుగుపాటుకు రైతు మృతి
- హైదరాబాద్‌ను ముంచెత్తిన వాన

నవతెలంగాణ- విలేకరులు
ఎండ, వడగాడ్పులతో మధ్యాహ్నం వరకు ఉక్కిరిబిక్కిరి చేయగా.. ఆ తర్వాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. మంగళవారం మధ్యాహ్నం నుంచి పలు జిల్లాల్లో ఈదురు గాలులు.. ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అక్కడక్కడ వడగండ్లు, పిడుగులు పడ్డాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు ...6లో

మేడిగడ్డకు మరమ్మతులు వృథానే !

ఎన్‌డీఎస్‌ఏ నివేదిక స్పష్టీకరణ

- దెబ్బతినకుండా ఉంటుందని చెప్పలేం
- 2019 జూన్‌లోనే బ్యారేజీకి నష్టం
- వానాకాలంలో బ్యారేజీల గేట్లన్నీ తెరిచే ఉంచాలి
- పరీక్షలు చేసి, మరమ్మత్తులకు పూనుకోవాలి
- దీనికి బాధ్యత డ్యామ్ ఓనర్ (సీఈ రామగుండం)దే: బ్యారేజీల మరమ్మతులపై బాంబు పేల్చిన ఎన్‌డీఎస్‌ఏ
- రూ.లక్ష కోట్ల ప్రజాధనం గంగపాలేనా ?



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్
మేడిగడ్డ బ్యారేజీని మరమ్మతులు చేసినా దెబ్బతినకుండా ఉంటుందనే నమ్మకం లేదనీ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ) బాంబు పేల్చింది. యథాతథస్థితిని కొనసాగించడానికి మాత్రమే మరమ్మత్తులు ఉపకరిస్తాయనీ, బ్యారేజీ మరింత దెబ్బతినకుండా మరమ్మతులు తప్పనిసరి అని తేల్చిచెప్పింది. లోక్‌సభ ఎన్నికలకు కేవలం ఐదు రోజుల ముందు ఎన్‌డీఎస్ఏ మధ్యంతర నివేదిక రావడం బీఆర్ఎస్‌కు శాపం కానుంది. తాజా ఎన్నికల్లో ఆ పార్టీపై ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. దాదాపు రూ. లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఇక గత చరిత్ర కానుందా ? అనే అనుమానాలు ఈ నివేదికతో స్పష్టమవుతున్నది. ఈ నివేదికను బీఆర్ఎస్‌కు ఖేదాన్ని మిగిల్చగా, కాంగ్రెస్ ఇతర పార్టీలకు మోదాన్ని అందించనుంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన ఎలక్ట్రో రెసిస్టివిటీ టెస్ట్(ఈఆర్టీ), గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్(జీపీఆర్) పరీక్షలతోపాటు బ్యారేజీ స్థితిగతులు, నిర్మాణ ఏజెన్సీలు, అధికారుల నివేదికలు, డిజైన్లు, డ్రాయింగులు పరిశీలించి, నిర్మాణ ప్రక్రియలో భాగస్వాములైన అధికారులందరినీ ...15లో

సంపాదకీయం

ద్వేషపు నోళ్లు!



సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ముస్లింలపైకి హిందువులను ఉసిగొలిపే పూర్తి మతతత్వంతో కూడిన వ్యాఖ్యలు చోటు చేసుకుంటున్నాయి. మోడీ పరివార ప్రచారమంతా విద్వేషం చిందిస్తూనే సాగుతోంది. ఎందుకంటే ఈసారి ఎన్నికల్లో తమని కాపాడే మంత్ర దండం అదేనని మన విశ్వగురువు నమ్ముతున్నాడు. అందుకే మొదటి నుంచి ప్రజల మధ్య విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. మొన్నటి ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణకు వచ్చిన బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా 'ముస్లింల రిజర్వేషన్లు రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కల్పిస్తాం' అన్న మాటలే దీనికి తాజా ఉదహరణ. 'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశ సంపద మొత్తం ముస్లింలకు దోచిపెడతారు' అన్న మాటలు రెండు వారాల కిందట స్వయానా మోడీ నోటి నుంచే విన్నాం. అప్పుడు ఆయన అబద్దాల అక్రమ ప్రచారం అలా... ఇప్పుడు ఈయన ఇలా... విడతల వారీగా సాగుతున్న ఎన్ని కల పోలింగ్ కమలం గుండెల్లో గుబులు రేపుతున్నది. అందుకే తమ విద్వేష ప్రసంగాలను మరింత తీవ్రతరం చేస్తున్నారు.

ఇక దేశంలో హిందూరాజ్యమే మా ధ్యేయమని చెప్పుకుంటున్న బీజేపీ వల్ల హిందూ ప్రజలకు ఏమైనా మేలు జరిగిందా అంటే అదీ లేదు. మోడీ పదేండ్ల పాలనలో నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి, ప్రజలు ఉన్న ఉపాధిని కోల్పోయారు, కొత్త ఉద్యోగాలు రాలేదు, జీఎస్టీ పేరుతో పన్నుల భారం పెంచారు. దళితులపై, మహిళలపై దాడులు పెరిగిపోయాయి. ఇలా బీజేపీ పాలనలో బాధపడుతున్న వారిలో హిందువులే అధికంగా ఉన్నారనే నిజాన్ని గుర్తించాలి.

అసలు రిజర్వేషన్లకే వ్యతిరేకమైన బీజేపీ, ఇప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్ల గురించి తెగ మాట్లాడుతుంటే నవ్వు తెప్పిస్తోంది. వినేటోళ్లు ఉంటే హరికథను ఇంగ్లీష్‌లో చెప్తారనే ఓ నానుడి ఉంది. ఇప్పుడు బీజేపీ నాయకుల మాటలు కూడా అలాగే ఉన్నాయి. 'మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్దం' అని కూడా నడ్డా వారు సెలవిచ్చారు. అయితే రాజ్యాంగం, దాని విలువ, దానిని గౌరవించాలనే విషయం బీజేపీకి ఇప్పుడే గుర్తొచ్చిందనుకుంటే మనం తప్పులో కాలేసినట్టే. మతాలను, రాజ్యాంగాన్ని, రాముడిని, సనాతన ధర్మాన్ని ఎప్పుడు ఎలా వాడుకోవాలో కమల నాథులకు తెలిసినంత బాగా బహుశా మరెవ్వరికీ తెలియదనుకుంటా!

ఆనాడు రాజ్యాంగ రచనను, అమలును తీవ్రంగా వ్యతిరేకించిన ఆరెస్సెస్ తానులోని గుడ్డే కదా ఈ బీజేపీ. అందుకే దేశంలో మతాలతో సంబంధం లేకుండా అట్టడుగు, వెనకబడిన వారి అభ్యున్నతిని కోరుతూ అంబేద్కర్ నాయకత్వాన లిఖించిన రాజ్యాంగాన్ని 'తిరగ రాస్తాం, సమూలంగా మార్చేస్తాం' అంటూ రాజ్యాంగ విలువల్ని ధ్వంసం చేస్తున్న వాళ్లు ఇప్పుడు రాజ్యాంగం, దాని విలువల గురించి మాట్లాడడం విడ్డూరం! దేశంలో వెనకబడిన, అట్టడుగు జనాభాలో ముస్లింలు కూడా ఉన్నారనే విషయం బీజేపీకి తెలియనిది కాదు. ఇవన్నీ వారి ఓటు రాజకీయాల్లో భాగంగా చేస్తున్నదని దేశంలోని హిందువులు తెలుసుకోవాల్సిన కీలకమైన సమయమిది.

మిగిలిన పార్టీలన్నీ ముస్లింలకు అనుకూలమైన వనీ, తామొక్కరమే హిందువులను ఉద్ధరించేందుకు పుట్టినట్టు ప్రతి సభలో ఢంకా బజాయించి మరీ చెప్పుకుం టున్నారు బీజేపీ నాయకులు. మైనార్టీలైన ముస్లింలకు కేటాయించిన నాలుగు శాతం రిజర్వేషన్ల వల్లనే దేశంలోని మెజార్టీ హిందువులకు తీవ్రమైన నష్టం కలిగినట్టు ఇప్పుడు చిత్రీకరిస్తున్నారు. ముస్లింల పట్ల తీవ్ర వ్యతిరేకతను సృష్టిస్తున్నారు. దేశ ప్రజల్లో మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారు. ఇలా బహిరంగ సభల్లో రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచే విధంగా మాట్లాడుతున్నా ఎలక్షన్ కమిషన్ చూసీ చూడనట్టు వ్యవహరించడం అత్యంత దారుణం.

ఇక దేశంలో హిందూరాజ్యమే మా ధ్యేయమని చెప్పుకుంటున్న బీజేపీ వల్ల హిందూ ప్రజలకు ఏమైనా మేలు జరిగిందా అంటే అదీ లేదు. మోడీ పదేండ్ల పాలనలో నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి, ప్రజలు ఉన్న ఉపాధిని కోల్పోయారు, కొత్త ఉద్యోగాలు రాలేదు, జీఎస్టీ పేరుతో పన్నుల భారం పెంచారు. దళితులపై, మహిళలపై దాడులు పెరిగిపోయాయి. ఇలా బీజేపీ పాలనలో బాధపడుతున్న వారిలో హిందువులే అధికంగా ఉన్నారనే నిజాన్ని గుర్తించాలి.

దేశంలోని ఆదివాసీలు, గిరిజనుల కంటే కూడా ముస్లింలు అత్యంత దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్నారు. సచార్ కమిటి ఈ విషయాన్ని స్పష్టంగా వివరించింది. ఎన్నో పోరాటాల ఫలితంగా చివరకు ముస్లింలకు ఆ మాత్రమైనా రిజర్వేషన్‌లు అమల్లోకి వచ్చాయి. కనీసం వీటిపై కూడా అవగాహనలేని ముస్లిం జనాభా మన దేశంలో నేటికీ ఉన్నారంటే అతిశయోక్తి కాదు. వీటన్నింటినీ పక్కన పెట్టి కేవలం తమ అధికార పీఠాన్ని కాపాడుకోవడం కోసం ప్రజలను తమ ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారు కమల నాథులు. కార్పొరేట్ల భజన తప్ప సామాన్యుల సమస్యల గురించి పట్టించుకోని కాషాయ దళం ఇంతకు మించి గొప్పగా ఆలోచిస్తారను కుంటే అత్యాశే అవుతుంది.

కొన్ని రోజులు కష్టపడితే చాలు, మరో ఐదేండ్లు దేశాన్ని దర్జాగా దోచుకోవచ్చని కమల దళం ఉవ్విళ్లూరుతోంది. దేశం ఏమైనా మత ఉన్మాదాన్ని రెచ్చగొట్టి తమ పబ్బం గడుపుకోవాలని చూస్తోంది. మళ్లీ అందలమెక్కాలని తహతహలాడుతోంది. దేశంలో ప్రమాద ఘంటికలు మారు మోగుతున్న నేపథ్యంలో బీజేపీ అబద్ధాల, మత విద్వేష ప్రచారం పట్ల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి. కాలే కడుపులు, ఆకలి మంటలు మరిచి తమ మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే పాలకులను ప్రజలు ఎన్నటికీ సహించరని నిరూపించాల్సిన సమయమిదే.

మెయిల్ @ నవతెంగాణ

డ్రెయినేజీ సమస్య పరిష్కరించండి సారూ...

నగరంలోని ఉప్పల్ నుంచి బోడుప్పల్ వెళ్లే రోడ్డుపై ఉన్న డ్రెయినేజీ నీరు వారానికి ఓసారి పొంగి పొర్లుతోంది. ఈ నీరంతా కూడా కాలనీల్లోకి ప్రవేశించడంతో రోడ్ల మీద పాదచారులకు నడవం ఇబ్బంది అవుతున్నది. అలాగే డ్రెయినేజీ కంపుతో దుర్వాసన వస్తున్నది. దీనికి శాశ్వత పరిష్కారం కోసం స్థానిక కార్పొరేటర్‌కు కాలనీవాసులు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. మున్సిపల్ అధికారులకు ఆన్‌లైన్ ద్వారా కంప్లయింట్ ఇస్తే వచ్చి క్లియర్ చేస్తారు. కానీ రోడ్లపైనున్న డ్రెయినేజీ చెత్తను తొలగించడం లేదు. దీంతో మరల కంప్లయింట్ ఇస్తే వచ్చి క్లియర్ చేసేసరికి మళ్లీ రోడ్డు మీద డ్రెయినేజీ పొంగుతున్నది. ఇది రోజూ షరామామూలైంది. ఈ సమస్యపై దాదాపు ఏడాది కాలంగా కార్పొరేటర్‌కు విన్నవిస్తే పట్టించుకోవడం లేదని కాలనీవాసులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఒక్క డ్రెయినేజీనే కాదు రోడ్ల పరిస్థితి కూడా అధ్వానంగా ఉన్నది. చిన్నపాటి వర్షానికి పూర్తిగా గుంతలు, రాళ్లు పైకి లేచి వస్తున్నాయి. చిన్నచిన్న యాక్సిడెంట్స్ కూడా అవుతున్నాయి. ఉదయం, సాయంత్రం అనేక స్కూల్ బస్సులు, ఆటో లు ఈ రోడ్డున వెళుతుంటాయి. అయినా కూడా అధికారులు రోడ్డును బాగు చేద్దామనే ఆలోచనకు రావడం లేదు. కనీసం కార్పొరేటర్ అయినా పట్టించుకుంటారనే ఈ సమస్యలను గాలికొదిలేశారు. వాస్తవానికి ఈ డ్రెయినేజీ సమస్య చాలా చిన్నది. పైనుంచి వస్తున్న దురేనేజ్ లైన్‌ను స్ట్రెయిట్‌గా కలిపేస్తే ఆ వాటర్ ఇరు పక్కలకు పొంగకుండా ఉంటుంది. కానీ ఆ దిశగా చర్యలు చేపట్టడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా ఉన్నది. ఇప్పటికైనా ఈ డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

- ఎస్ఎస్ఆర్ఎ ప్రసాద్,
9490300867

ఆపితే నెతన్యాహు, కొనసాగిస్తే జోబైడెన్ పతనం!



ఎం కోటేశ్వరరావు
8331013288

పాలస్తీయునులపై ఇజ్రాయిల్ మారణకాండ రోజురోజుకూ పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. ఓవైపు హమాస్‌తో చర్చలు అంటూనే మరోవైపు ఎడతెగని దాడులకు పాల్పడుతున్నది. బహిరంగంగా యుద్ధం ఆపాలని చెబుతున్నవారే, మళ్లీ వెనుకనుంచి ఆపొద్దని నెతన్యాహును హెచ్చరిస్తున్నారు. ఇది ఇలా కొనసాగుతుండగానే పాలస్తీనాపై ఇజ్రాయిల్ దమనకాండ పట్ల అమెరికాలో పెల్లుబికుతున్న నిరసనలు జోబైడెన్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ యుద్ధం అమెరికాలో జరగబోయే ఎన్నికల మీద ప్రభావం చూపే అవకాశమున్నది. అందుకే నెతన్యాహు, జోబైడెన్ ఇప్పుడు ఇరకాటంలో పడ్డారు.

పాలస్తీనాలోని గాజా ప్రాంతంపై ఇజ్రాయిల్ మారణకాండ మంగళవారం నాటికి 214వ రోజుకు చేరుకుంది. కాల్పుల విరమణ ఒప్పందం గురించి చర్చలు సాగుతున్నాయి. తమకు అంగీకారమే అని హమాస్ చెప్పింది. ఎటూ తేల్చకపోగా రఫా నగరం మీద సైనికచర్యకు ముందుకు పోవాలని ఇజ్రాయిల్ యుద్ధ మంత్రివర్గం ఏకగ్రీవంగా నిర్ణయించింది. మరొకవైపు చర్చలకు తమ ప్రతినిధులను పంపుతామని చెబుతూనే సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారే వరకు వైమానిక దాడులు జరుపుతూ రాఫా-ఈజిప్టు సరిహద్దు ద్వారం దగ్గర పాలస్తీనా వైపు ప్రాంతాన్ని ఇజ్రాయిల్ దళాలు స్వాధీనం చేసుకున్నాయి. గాజాలోని పౌరులకు ఐరాస అందిస్తున్న సహాయాన్ని కూడా అడ్డుకుంటున్నాయి.దాడుల్లో అనేకమంది మరణించారు. మధ్యవర్తులు ముందుకు తెచ్చిన ప్రతిపాదనలను హమాస్ ఆమోదించినప్పటికీ తమకు అంగీకారం కాదని, తమ డిమాండ్లకు చాలా దూరంగా ఉందని నెతన్యాహు కార్యాలయం చెప్పింది. సోమవారం నాటికి గాజాలో 34,735 మందిని ఇజ్రాయిల్ చంపివేసినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. గాయపడిన వారు 78,108 మంది, గత 24 గంటల్లో మరణాలు 52, క్షతగాత్రులు 90 మంది అని వెల్లడించింది. రాఫాను ఖాళీ చేయాలని పౌరులను ఇజ్రాయిల్ ఆదేశించింది. ఇతర దేశాలకు ప్రత్యేకించి పక్కనే ఉన్న ఈజిప్టుకు వెళ్లకుండా దిగ్బంధనం గావించింది.ఇది రాసిన సమయానికి ఏం జరగనుందో తెలియని స్థితి.జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే ఒకటి స్పష్టం.ఏదో ఒక ఒప్పందం చేసుకొని హమాస్ వద్ద బందీలుగా ఉన్న వారిని విడిపించాలని నెతన్యాహు మీద రోజురోజుకూ ఒత్తిడి పెరుగుతోంది.మరోవైపు హమాస్‌ను తుడిచిపెట్టకుండా వెనుదిరిగితే మీ సంగతి చూస్తామనే దురహం కారులు, మారణకాండకు మద్దతు ఇవ్వటాన్ని ఏమాత్రం సహించం అంటున్న విద్యార్థులపై జో బైడెన్ సర్కార్ కాల్పులకూ పాల్పడింది. గాజా దక్షిణ ప్రాంతంలోని రాఫా నగరం మీద దాడులకు దిగితే అక్కడ ఉన్న పిల్లలు పెద్ద సంఖ్యలో మరణించే అవకాశం ఉన్నందున హమాస్ ఒక అడుగు వెనక్కు తగ్గేందుకు నిర్ణయించినట్లు కనిపిస్తోంది. ఒక్కముక్కలో చెప్పాలంటే మారణకాండను కొనసాగించకపోతే నెతన్యాహు, ముందుకు పోతే ఎన్నికల్లో జో బైడెన్ పతనం ఖాయంగా కనిపిస్తోందన్న వ్యాఖ్యలు వెలువడుతున్నాయి. మారణకాండను అంతర్జాతీయ న్యాయ స్థానం కూడా అడ్డుకోలేకపోయింది. తన ఆదేశాన్ని ధిక్కరించిన ఇజ్రాయిల్‌ను ఏమీచేయలేని అశక్తురాలిగా మారింది.పాలస్తీనా పౌరులకు సంఘీభావం తెలుపుతున్న విద్యార్థులు యూదు వ్యతిరేకులంటూ అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ నిందించి మరింతగా రెచ్చగొట్టారు.

గాజాలో మారణకాండను ఖండిస్తూ అమెరికా విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసనలకు దిగటంతో ఎన్నికలలో పోటీ చేస్తున్న అధ్యక్షుడు జో బైడెన్ ఇరకాటంలో పడ్డాడు. ఉద్యమాన్ని అణచివేసేందుకు పూనుకోవటంతో పాటు ప్రపంచాన్ని నమ్మించేందుకు ఇజ్రాయిల్ మీద ఒత్తిడి తెస్తున్నట్లు నాటకం ప్రారంభించాడు.రాఫాపై దాడులను వ్యతిరేకిస్తున్నట్లు బైడెన్ స్పష్టం చేసినట్లు జాతీయ భద్రతా మీడియా సలహాదారు జాన్ కిర్బీ చెప్పాడు. అర్ధగంటపాటు నెతన్యాహు-జో బైడెన్ ప్రయివేటుగా నిర్మాణాత్మకంగా మాట్లాడుకున్నారని అన్నాడు. నెతన్యాహుతో మాట్లాడిన తరువాత జో బైడెన్ వైట్‌హౌస్‌లో జోర్డాన్ రాజు రెండవ అబ్దుల్లాకు అనధికారిక మధ్యాహ్న విందు ఏర్పాటు చేశాడు. ఇజ్రాయిల్ గనుక రాఫాపై దాడులకు దిగితే పెద్ద ఎత్తున మారణకాండ జరిగే అవకాశముందని అబ్దుల్లా హెచ్చరించినట్లు వార్తలు వచ్చాయి.

మంగళవారం తెల్లవారుజామున ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో అనేక మంది మరణించినట్లు వార్తలు. వైమానిక దళం జరిపిన దాడుల్లో అనేక భవనాలు నేలమట్టం కాగా అనేక మంది శిధిలాల్లో చిక్కుకుపోయారు. ఎందరు గాయపడింది, మరణించిందీ ఇంకా స్పష్టం కాలేదు. తమ ఆసుపత్రికి పదకొండు మృతదేహాలు వచ్చినట్లు రాఫాలోని కువాయిట్ ఆసుపత్రి వెల్లడించింది. హమాస్ వద్ద ఉన్న తమ బందీలను విడిపించే వరకు దాడులు కొనసాగిస్తూనే ఉంటామని, మరోవైపు చర్చలకు తమ ప్రతినిధి బృందాన్ని పంపు తామని ఇజ్రాయిల్ ప్రకటించింది. ఇరవైలక్షల మందికి పైగా పాలస్తీనియన్లు గాజాలో వున్నారు. వారి ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ఇజ్రాయిల్ మిలిటరీ తరలిస్తున్నది. ఈ క్రమంలో 64చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న రాఫా నగరం, పరిసరాల్లో లక్షల మంది తలదాచుకుంటున్నారు. హమాస్ సాయుధులు జనంలో కలిసిపోయినందున వారిని పట్టుకోవాలంటే పెద్ద ఎత్తున దాడులు చేయకతప్పదని ఇజ్రాయిల్ చెబుతున్నది. అసలు ఆ సాకుతోనే ఏడు నెలలుగా దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే.రాఫా నుంచి వెళ్లిపోవాలని ఆదేశించటం ఏ మాత్రం సహించరాదని ఐరాస ప్రధాన కార్యదర్శి చెప్పారు. ఈ దాడులను వ్యతిరేకిస్తున్నట్లు అమెరికా కబుర్లు చెబుతున్నది. బందీల విడుదలకు తాత్కాలిక కాల్పుల విరమణ అని ఇజ్రాయిల్ చెబుతుండగా పూర్తిగా గాజా నుంచి వైదొలగాని హమాస్ పట్టుబట్టటంతో ఈజిప్టు రాజధాని కైరోలో జరుగుతున్న చర్చలు నిలిచిపోయాయి. సంప్రదింపుల ప్రక్రియ వెంటిలేటర్ మీద ఉంది, అందుకే ఒక మధ్యవర్తిగా ఉన్న కతార్‌తో చర్చలు జరిపేందుకు సిఐఏ డైరెక్టర్ బిల్ బరన్స్ వెళ్లినట్లు ఇజ్రాయిల్ మీడియా పేర్కొన్నది. మూడు దశల్లో ఒప్పందం అమలు జరుగుతుందని, తన వద్ద బందీలుగా ఉన్న 132 మందిలో 33 మందిని 42 రోజుల వ్యవధిలో విడుదల చేస్తుందని దీనికి ఇరు పక్షాలూ అంగీకరించినప్పటికీ తరుపరి రెండు దశల గురించి వివాదం ఏర్పడిందని తొలుత వార్తలు వచ్చాయి. కొత్త ప్రతిపాదనలను అంగీకరిస్తున్నట్లు సోమవారం హమాస్ ప్రతినిధి ఈజిప్టు, కతార్ మంత్రులకు ఫోన్ ద్వారా తెలిపినట్లు వార్తలు. ఇజ్రాయిల్ వైపు నుంచి ఎలాంటి స్పందన లేకపోగా రాఫా ప్రాంతం నుంచి పాలస్తీనియన్లు వెళ్లిపోవాలని విమానాల నుంచి వెదజల్లిన కరపత్రాల్లో ఆదేశించటమేగాక, రాత్రి నుంచి దాడులను కూడా ప్రారంభించింది. ఒప్పందం కుదిరినా, కుదరకున్నా దాడులు చేసి తీరుతామని నెతన్యాహు చెబుతున్నాడు.

కైరో చర్చలు సఫలమౌతాయని, తక్షణ, శాశ్వత కాల్పుల విరణమకు దారితీస్తాయని కతార్ విదేశాంగశాఖ ప్రతినిధి మహమ్మద్ అల్ అన్సారీ చెప్పారు.వ్యవధి కోసం హమాస్ నాటకమాడుతున్నదని, దాడులను నిలిపివేసేందుకు, చర్చల వైఫల్య నెపం తమపై నెట్టేందుకు చూస్తున్నదని ఇజ్రాయిల్ ఆరోపిస్తున్నది. రాఫా ఇప్పుడు బాలల నగరంగా మారిందని, దాడులు జరిగితే పెద్ద ఎత్తున ప్రాణనష్టం ఉంటుందని యూనిసెఫ్ ఆందోళన వ్యక్తం చేసిందని, రక్షణ కోసం పిల్లలు ఎక్కడకు వెళ్లాలో




రాఫా ఇప్పుడు బాలల నగరంగా మారిందని, దాడులు జరిగితే పెద్ద ఎత్తున ప్రాణనష్టం ఉంటుందని యూనిసెఫ్ ఆందోళన వ్యక్తం చేసిందని, రక్షణ కోసం పిల్లలు ఎక్కడకు వెళ్లాలో తెలియని స్థితిలో ఉన్నారని సంస్థ డైరెక్టర్ కాథరీన్ రసెల్ చెప్పారు. ఇప్పటికే అక్కడి పిల్లలు భౌతికంగా, మానసికంగా ఎంతో బలహీనపడ్డారని, పిల్లలతో పాటు మొత్తం జనాన్ని రక్షించాల్సి ఉందన్నారు. ఇజ్రాయిల్ దాడులకు ముందు నగరం, పరిసరాల జనాభా రెండున్నరలక్షలు కాగా ప్రస్తుతం అక్కడ పన్నెండు లక్షల మంది తలదాచుకుంటున్నారని, వారిలో దాదాపు ఆరులక్షల మంది పిల్లలే ఉంటారని చెబుతున్నారు. హమాస్ ఒక మెట్టు దిగిరావటానికి ఇది కూడా ఒక కారణం అని చెప్పవచ్చు. దాడుల ప్రభావం పెద్దల మీద కంటే పిల్లల మీద ఎక్కువగా ఉంటుందని యూనిసెఫ్ హెచ్చరించింది.

తెలియని స్థితిలో ఉన్నారని సంస్థ డైరెక్టర్ కాథరీన్ రసెల్ చెప్పారు. ఇప్పటికే అక్కడి పిల్లలు భౌతికంగా, మానసికంగా ఎంతో బలహీనపడ్డారని, పిల్లలతో పాటు మొత్తం జనాన్ని రక్షించాల్సి ఉందన్నారు. ఇజ్రాయిల్ దాడులకు ముందు నగరం, పరిసరాల జనాభా రెండున్నరలక్షలు కాగా ప్రస్తుతం అక్కడ పన్నెండు లక్షల మంది తలదాచుకుంటున్నారని, వారిలో దాదాపు ఆరులక్షల మంది పిల్లలే ఉంటారని చెబుతున్నారు. హమాస్ ఒక మెట్టు దిగిరావటానికి ఇది కూడా ఒక కారణం అని చెప్పవచ్చు. దాడుల ప్రభావం పెద్దల మీద కంటే పిల్లల మీద ఎక్కువగా ఉంటుందని యూనిసెఫ్ హెచ్చరించింది. రాఫా మీద దాడి అంటే ఏదో విహారయాత్ర అని భావిస్తే పొరపాటు తమ వారిని రక్షించేందుకు పూర్తి సన్నద్ధంగా ఉన్నామని హమాస్ ప్రకటించింది. దాడులకు పాల్పడవద్దని సౌదీ అరేబియా విదేశాంగశాఖ ఇజ్రాయిల్‌ను హెచ్చరించింది.

తమ నేత జో బైడెన్‌కు గాజా మరో వియత్నాంగా మారుతున్నదని, అయితే డోనాల్డ్ ట్రంప్‌ను వెనక్కు కొట్టేందుకు తాను బైడెన్‌కు మద్దతు ఇస్తున్నట్లు డెమోక్రటిక్ సోషలిస్టు నేత బెర్నీ శాండర్స్ ప్రకటించాడు. గాజాలో మారణకాండను ఖండిస్తూ అమెరికా విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసనలకు దిగటంతో ఎన్నికలలో పోటీ చేస్తున్న అధ్యక్షుడు జో బైడెన్ ఇరకాటంలో పడ్డాడు. ఉద్యమాన్ని అణచివేసేందుకు పూనుకోవటంతో పాటు ప్రపంచాన్ని నమ్మించేందుకు ఇజ్రాయిల్ మీద ఒత్తిడి తెస్తున్నట్లు నాటకం ప్రారంభించాడు.రాఫాపై దాడులను వ్యతిరేకిస్తున్నట్లు బైడెన్ స్పష్టం చేసినట్లు జాతీయ భద్రతా మీడియా సలహాదారు జాన్ కిర్బీ చెప్పాడు. అర్ధగంటపాటు నెతన్యాహు-జో బైడెన్ ప్రయివేటుగా నిర్మాణాత్మకంగా మాట్లాడుకున్నారని అన్నాడు. నెతన్యాహుతో మాట్లాడిన తరువాత జో బైడెన్ వైట్‌హౌస్‌లో జోర్డాన్ రాజు రెండవ అబ్దుల్లాకు అనధికారిక మధ్యాహ్న విందు ఏర్పాటు చేశాడు. ఇజ్రాయిల్ గనుక రాఫాపై దాడులకు దిగితే పెద్ద ఎత్తున మారణకాండ జరిగే అవకాశముందని అబ్దుల్లా హెచ్చరించినట్లు వార్తలు వచ్చాయి. ఏడు నెలల దాడుల తరువాత గాజాలో తీవ్రమైన కరవు పరిస్థితి ఏర్పడిందని ఐరాస ప్రపంచ ఆహార కార్యక్రమ అధిపతి సిండీ మెకెయిన్ చెప్పాడు.తన మీద ప్రపంచ నేతలెవరూ ఏమాత్రం ఒత్తిడి తేలేరని, ఏ అంతర్జాతీయ సంస్థా ఇజ్రాయిల్ తనను తాను కాపాడుకోవటాన్ని అడ్డుకోజాలదని నెతన్యాహు ఆదివారం నాడు చెప్పాడు.

కొలంబియా విశ్వవిద్యాలయాన్ని అదుపులోకి తీసుకున్న న్యూయార్క్ పోలీసుల్లో ఒకడు విద్యార్థుల మీద కాల్పులు జరిపినట్లు వార్తలు వచ్చాయి. వారి వెనుక బయటి శక్తుల హస్తం ఉందనే సాకుతో ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తున్నది.దీనికి కార్పొరేట్ మీడియా మరింతగా ఆజ్యం పోస్తున్నది.ప్రభుత్వ యంత్రాంగం ఎంతగా రెచ్చగొడుతుంటే అంత ఎక్కువగా విద్యార్థులు ఆందోళనలకు దిగుతున్నారు. గుడారాలను పీకివేస్తే వెంటనే కొత్త వాటిని ఏర్పాటు చేస్తున్నారు. దొంగే దొంగని అరచినట్లుగా విద్యార్థుల నిరసనలను తప్పుదారి పట్టించేందుకు ఇజ్రాయిల్ అనుకూలురను రెచ్చగొట్టి పోటీ ప్రదర్శనలను చేయించటం, ఆ ముసుగులో పౌరదుస్తుల్లో ఉన్న పోలీసులు, బయటివారిని రప్పిస్తున్నట్లు అనేక చోట్ల స్పష్టమైంది. వారు విద్యా ప్రాంగణాల్లో ప్రవేశించి దాడులు చేస్తున్నారు. యూదు వ్యతిరేక నినాదాలు చేస్తూ విద్యార్థుల ఆందోళనను తప్పుదారి పట్టించేందుకు చూస్తున్నారు. ఇలాంటి వారి చర్యలను చూపి మీడియా దాడులకు దిగుతున్నది. మీడియాకు జరుగుతున్నదేమిటో తెలిసినప్పటికీ ప్రభుత్వం వ్యతిరేకిస్తున్నది కనుక దాని ప్రాపకం కోసం కట్టుకథలు రాస్తున్నది, పిట్టకథలు చెబుతున్నది. పార్లమెంటు సభ్యుల కమిటీల పేరుతో విద్యాసంస్థల చాన్సలర్లు, అధ్యక్షులు, ఇతర అధికారులతో సమావేశాలను ఏర్పాటు చేసి ఆందోళనను అదుపు చేసేందుకు తీసుకుంటున్న చర్యలేమిటని అడ్డదిడ్డంగా ప్రశ్నిస్తున్నారు. గట్టిగా వ్యవహరించక పోతే రాజీనామా చేసి ఇంటికిపోండని ఒత్తిడి తెస్తున్నారు. విద్యార్థుల ఆందోళనలను అణచి వేయకపోతే తాము ఇచ్చిన విరాళాలను స్తంభింపచేస్తామని బెదిరించేందుకు దాతలను రంగంలోకి దించారు. నిజానికి వీరంతా బయటివారు తప్ప ఆందోళన చేస్తున్న వారు లేదా వారికి మద్దతు ఇస్తున్నవారు కాదు. ఇలాంటి వారిని చూసి ఆందోళనలకు దూరంగా ఉన్నవారు తొలిరోజుల్లో పొరపాటు పడినా అనేకమంది ఇప్పుడు తోటి విద్యార్థులతో చేతులు కలుపుతున్నారు. అమెరికా పాలకుల నైజాన్ని బయటపెడుతున్నారు. ■

నోటాతో మోడీ పోటీ!



భరత్ చౌహాన్
9030666999

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా గొప్పలు చెప్పుకునే దేశంలో అసలు ప్రతిపక్షం అనేది ఉండకూడదా? ప్రతిపక్షాలు ఆందోళన పడుతున్నట్టుగా నిజంగానే మోడీ మరోసారి అధికారం చేపడితే భారత దేశంలో ఇవే చివరి ఎన్నికలా? ఇన్నాళ్లుగా తన అధికారం కోసం కుల, మతాల మధ్య వైషమ్యాలు పెట్టి అధికార ప్రతిపక్ష పార్టీల నేతలను ఈడి పేరుతో జైల్లో పెట్టించాడు. కానీ ఇప్పుడు ఏకంగా కుర్చీ కోసం ఎన్నికల్లో పోటీ చేస్తున్నా ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులనే ట్యాంపర్ చేస్తూ తనకు ప్రత్యర్థులు లేకుండా చేసుకుంటు న్నాడు. అంటే ఇదో రకంగా మోడీ నోటాతో పోటీ పడుతున్నట్టే. ఎందుకంటే ఏ స్థానాలైతే అసంబద్ధంగా కైవసం చేసుకోవాలని చూస్తున్నాడో, ఆ పార్లమెంటు నియోజకవర్గాల ప్రజల పరిస్థితి ఏంటి? వారికి ఓటు హక్కు వినియోగించుకోనే అవకాశం ఎక్కడుంటుంది?

లోక్‌సభ ఎన్నికలలో ఎన్నో దారుణాలు చోటుచేసుకుంటున్నాయి. గుజరాత్‌లోని సూరత్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి నీలేష్ కుంభాని నామినేషన్ రద్దుకావడం, ఇతర ఇండిపెండెంట్లు బరిలోనుంచి తప్పుకోవడంతో బీజేపీ అభ్యర్థి ముకేష్ దలాల్ పోటీ లేకుండా అసంబద్ధంగా ఏకగ్రీవమయ్యారు. అక్కడ దాదాపు 18 లక్షల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుని, తమకు నచ్చిన ప్రజా ప్రతినిధి ఎన్నుకునే అవకాశం లేకుండా పోయింది. తాజాగా మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి అక్షయ్ కాంతి బమ్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకుని బీజేపీలో చేరడం రాజకీయం మరింత రాజుకుంది. మే 13న మధ్యప్రదేశ్‌లో ఎన్నికలు జరగనున్నాయి ఇండోర్ లోక్‌సభా స్థానానికి మొత్తం 22 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు నామినేషన్ల ఉపసంహరణకు సరిగ్గా చివరి రోజు వెళ్లి తాను పోటీ నుంచి తప్పుకుంటున్నాని అందరూ చూస్తుండగానే మీడియా ముఖంగా తన నామినేషన్ ఉపసంహరించు కున్నారు."ప్రధాని మోడీ మార్గదర్శ కత్వంలోని బీజేపీ ప్రగతిశీల ఆలోచనలు నచ్చి మా సహచరుడు కైలాస్ విజయ వర్గీయ, ఎమ్మెల్యే రమేష్ మెండోలాతో కలిసి, లోక్‌సభ అభ్యర్థిత్వం నుంచి వైదొలిగి బీజేపీలో చేరుతున్న అక్షయ్ కాంతి బమ్‌కు సాదర స్వాగతం పలుకుతున్నా" అని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ప్రకటించారు. దీన్నిబట్టి చూస్తే ఇదంతా ఒక ప్రణాళిక ప్రకారం జరిగిందని తెలుస్తోంది.



ఇండోర్‌లో అక్షర కాంతి బామ్ నామినేషన్ ఉపసంహరించుకోవడంలో ఉన్న ఆంతర్యమేమిటి? నిజంగానే మోడీ సిద్ధాంతాలకు ఆకర్షితుడయ్యా డా? కానీ వాస్తవంగా పరిశీలిస్తే దీనికి వెనుక పెద్ద రాజకీయ కుట్రకోణం దాగుందనిపిస్తోంది. సరిగ్గా అభ్యర్థి తన నామినేషన్ ఉపసంహరించుకొనే మూడు రోజుల ముందు 17 ఏండ్ల కిందటి స్థల వివాదం కేసును బయటకు తీశారు. ఓ వ్యక్తిని బెదిరించాడని సెక్షన్ 307 కింద కోర్టుకు హాజరు కావాలని నోటీసులు అందాయి. ఆ తర్వాత బీజేపీ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన పార్టీలో చేరాడు. ఇదంతా యాదృచ్ఛికంగా జరిగిందనుకుంటే పొరపాటే! నాగపూర్ తర్వాత ఇండోర్ ఆరెస్సెస్‌కు అత్యంత ముఖ్యమైన స్థావరం. అలాంటి ఇండోర్‌లో గత 40 ఏండ్లుగా అంటే 2019 వరకు అక్కడ సుమిత్ర మహజన్ వరుసగా గెలుస్తూ వస్తున్నారు. ఆయితే 2019లో శంకర్ లల్వానీకి టికెట్టిచ్చి ఐదు లక్షల భారీ మెజార్టీతో గెలిపించింది బీజేపీ. అంత మెజార్టీ స్థాయిలో గెలిచిన పార్లమెంటు సెగ్మెంట్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నామినేషన్‌ని ఎందుకు విత్‌డ్రా చేయించింది? దీన్ని బట్టి చూస్తే ఓటమి భయం బీజేపీని వెంటాడుతుందా? అంటే దీన్నిబట్టి చూస్తే అదే అర్థమవుతున్నది. అందుకే బీజేపీ అరుణాచల్‌ప్రదేశ్ నుంచి ఇండోర్ వరకు ఇలాంటి ప్రయత్నాలు చేస్తుందా? అన్న వాదనలకు బలం చేకూరుస్తున్నది.

మొన్న ఖజురహోలో సమాజ్ వాదీ పార్టీ అభ్యర్థి మీరా యాదవ్ నామినేషన్ తిరస్కరణకు గురైంది. దీనికి కారణాలు బయటకు పొక్కకున్నా ఇందులో బీజేపీ పాత్ర ఉందనేది ప్రతిపక్షాల ఆరోపణ. ఇండోర్‌లో కేవలం ఒకే ఒక్క జాతీయ పార్టీ బీజేపీ మాత్రమే పోటీలో ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రజల చేత, ప్రజల కొరకు, ఎన్నుకోబడిన వారే ప్రజాప్రతినిదులు కావాలి కానీ బీజేపీ ఎవరు పోటీలో ఉండాలో, ఉండకూడదో నిర్ణయిస్తున్నది. ఇది ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తి వ్యతిరేకం. ఇలా పోటీలో ప్రతిపక్షం అనేది ఉండకూడదు అనుకున్నపుడు ఇంకా ఎన్నికలు నిర్వహించడం ఎందుకు? ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరగాలి. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ధైర్యంగా ముందుకు వచ్చి పౌరుడు తనకు నచ్చిన వ్యక్తిని ఎన్నుకునే స్వేచ్ఛని ఉండాలి. ప్రజల్లో ఓటు గొప్పతనాన్ని చాటి చెప్పి ఓటింగ్ శాతం పెంచే విధంగా కృషి చేయాలి. కానీ ఓటు హక్కును వినియోగించుకోకుండా ఏకపక్షంగా ప్రతిపక్షం లేకుండా ఏకగ్రీవం చేయడం, వారికి పోటీ అనుకున్నవారిని బలవంతంగా తప్పించడం బీజేపీ నిజస్వరూపాన్ని బయటపెడుతున్నాయి.

ఇప్పటికే తన అధికారానికి అడ్డుగా ఉన్నారని కేజ్రీవాల్, లొంగడం లేదని హేమంత్ సోరెన్ లాంటి ముఖ్యమంత్రుల మీద కేసులు పెట్టించి ఈడి పేరుతో జైల్లో పెట్టడం చూశాం. అది చాలదంటూ ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేస్తున్న నాయకులన సామ, దాన, భేద, దండో పాయాలు ఉపయోగించి లొంగదీసుకుంటున్నాడు. ప్రతిపక్ష నాయకులు 'ఉంటే మోడీ జేబులో ఉండాలి.. లేదంటే జైల్లో ఉండాలి' అనే విధంగా తయారైంది బీజేపీ రాజకీయ వ్యవహారం. మొన్న ఖజురహో! నిన్న సూరత్! నేడు ఇండోర్, మరి రేపు ఎక్కడో? మోడీ అధికార దాహానికి ఎన్ని స్థానాల్లో ఓటర్లు ఓటేయకుండా బలికావాలి? బీజేపీ ఇంత అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నా కూడా ఎన్నికల కమిషన్ చూసీ చూడనట్లు వ్యవహరించడం శోచనీయం.

ఇప్పటికే తన అధికారానికి అడ్డుగా ఉన్నారని కేజ్రీవాల్, లొంగడం లేదని హేమంత్ సోరెన్ లాంటి ముఖ్యమంత్రుల మీద కేసులు పెట్టించి ఈడి పేరుతో జైల్లో పెట్టడం చూశాం. అది చాలదంటూ ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేస్తున్న నాయకులన సామ, దాన, భేద, దండో పాయాలు ఉపయోగించి లొంగదీసుకుంటున్నాడు. ప్రతిపక్ష నాయకులు 'ఉంటే మోడీ జేబులో ఉండాలి.. లేదంటే జైల్లో ఉండాలి' అనే విధంగా తయారైంది బీజేపీ రాజకీయ వ్యవహారం.

మొన్న ఖజురహో! నిన్న సూరత్! నేడు ఇండోర్, మరి రేపు ఎక్కడో? మోడీ అధికార దాహానికి ఎన్ని స్థానాల్లో ఓటర్లు ఓటేయకుండా బలికావాలి? బీజేపీ ఇంత అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నా కూడా ఎన్నికల కమిషన్ చూసీ చూడనట్లు వ్యవహరించడం శోచనీయం. ఇదంతా చూస్తూ ఉంటే వామపక్షాలు చెబుతున్నట్టు 2024లో మళ్లీ మోడీ అధికారంలోకి వస్తే ఇవే చివరి ఎన్నికలవుతాయి అనేది నిజం కాబో తుందా? ప్రజాస్వామ్య మనుగడ అనేది ఇక ప్రశ్నార్థక మేనా? ప్రజలు ఆలోచించాల్సిన సమయమిది. ■

ఓటు విలువ తెలుసుకో..



ఓటంటే ఒట్టి మాటల కోట కాదు
ఓటంటే ప్రజాస్వామ్య బాట
ఓటంటే ఇంకు చుక్క కాదు
ఓటంటే వ్యవస్థనే
మార్చుకునే వెలుగు చుక్క

ఓటంటే చిత్తుకాగితం కాదు
ఓటంటే ప్రజా చైతన్యగీతం
ఓటంటే కీర్తి కిరీటం కాదు
ఓటంటే స్ఫూర్తి పోరాటం

ఓటంటే అసామాన్య స్వరబాణి కాదు
ఓటంటే సామాన్య జనవాణి
ఓటంటే అమ్ముకునే సరుకు కాదు
ఓటంటే నీ అంబులపొదిలో శరము

ఓటంటే అపరిచిత పదం కాదు
ఓటంటే ఆత్మశుద్ధి వాక్యం
ఓటంటే స్వార్థాల వ్యవహారం కాదు
ఓటంటే నిస్వార్థాల సమహారం

ఓటంటే నిన్ను ఎత్తుకునే సంపతి కాదు
ఓటంటే నుస్ను హత్తుకునే సోపతి
ఓటంటే రాచరికపు పీఠం కాదు
ఓటంటే రాజ్యాంగపు పాఠం

ఓటంటే వాగ్దానాల వర్షం కాదు
ఓటంటే వమ్ముకాని హర్షం
ప్రజాస్వామ్య పరిరక్షణకే ఈ యుద్ధం
బాధ్యతగా వేసే ఓటే ప్రగతికి అద్దం..!

డా.కటుకోర్ఖ్వల రమేష్
సెల్: 9949083327

మేడిగడ్డను సందర్శించిన..
జ్యుడీషియల్ కమిషన్ చైర్మెన్

- ఇరిగేషన్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన



నవతెలంగాణ-భూపాలపల్లి/మహాదేవపూర్

జయశంకర్-భూపాలపల్లి జిల్లా పరిధి కాళేశ్వరం ప్రాజెక్టుపై చేపట్టిన న్యాయ విచారణలో భాగంగా జ్యుడీషియల్ కమిషన్ చైర్మెన్ రిటైర్డ్ జస్టిస్ పినాకి చంద్ర గోష్, ఇరిగేషన్ కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో కలిసి మంగళవారం మేడిగడ్డ బ్యారేజీని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎస్పీ కిరణ్ ఖరే ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. మేడిగడ్డ బ్యారేజ్‌లో మేజర్‌గా దెబ్బతిన్న 20వ నంబర్ పిల్లర్‌ను, పాక్షికంగా దెబ్బతిన్న 19, 21 పిల్లర్లను కమిషన్‌కు సంబంధించిన అధికారులు, నిపుణుల బృందం సభ్యులు పరిశీలించారు. బ్యారేజీపై ఏడో బ్లాకులో వంతెనపై కాలినడకన సాగుతూ అణువణువూ పరిశీలించారు. ఏడవ బ్లాక్‌లో 20 పిల్లర్ దెబ్బతిన్న ప్రాంతాన్ని చూసి అధికారుల నుంచి వివరాలను సేకరించారు. బ్యారేజీ దిగువకు చేరుకొని 19, 20, 21 పిల్లర్ల కింది భాగంలో వచ్చిన పగుళ్లను పరిశీలించారు. మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతిన్న పరిస్థితులు, పిల్లర్ల కుంగుబాటు తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా జ్యుడీషియల్ కమిషన్ చైర్మెన్ రిటైర్డ్ జస్టిస్ పినాకి చంద్ర గోష్ మాట్లాడుతూ.. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన విషయంపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పర్యటన చేస్తున్నట్టు చెప్పారు. ఇరిగేషన్ శాఖ నిపుణులతో కలిసి మేడిగడ్డ బ్యారేజి పరిశీలించామన్నారు. పరిశీలనలో వెలుగులోకి వచ్చిన విషయాలపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓఅండ్ఎం జనరల్ అనిల్ కుమార్, ఓఅండ్ఎం ఈఎన్సీ నాగేందర్‌రావు, సీఈ సుధాకర్ రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ సీఈ వెంకటకృష్ణ, ఈఈ తిరుపతిరావు, ఎల్అండ్‌టీ ప్రాజెక్టు మేనేజర్ రజనీష్ తదితరులు పాల్గొన్నారు.

స్కూటీలు రాలే.. లూటీలు షురూ

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల కమిషన్‌కు చెప్పి బంద్ చేయించిండు' అని ఆరోపించారు. "కరెంటు వస్తుందా..? పొలాలు ఎండుతున్నాయి.. కేసీఆర్ ఉన్నప్పుడు ఉన్న కరెంటు ఇప్పుడు ఎక్కడికి పోయింది. మంచినీళ్లు వస్తున్నాయా..? భగీరథతో బ్రహ్మాండంగా నీళ్లు ఇచ్చాం. మరి ఇప్పుడు ఏమైంది. ధాన్యం కొంటున్నారా..? వరికి బోనస్ బోగస్ అయింది. ఊర్లకు పోవుడు.. ఒట్లు పెట్టుడు కేసీఆర్‌ను తిట్టుడే రేవంత్‌రెడ్డి పని అయింది. పని చేసే సిపాయి ఎక్కడైనా ఒట్టు పెడతాడా..?" అని ప్రశ్నించారు.

అబ్‌కి బార్.. పెట్రోల్ డీజిల్ '400 పార్'

'దేశ ప్రధానిగా మోడీ పదేండ్లుగా పని చేసిండు. 150 హామీలు ఇచ్చిండు. ఒక్క హామీ నెరవేరిందా..? సబ్‌కా వికాస్ అంటూ సబ్‌కా సత్యనాశ్ చేసిండు. ఎక్స్‌పోర్ట్స్ బంద్ అయ్యాయి. ఇన్‌పోర్ట్స్‌లు పెరిగాయి. మేకిన్ ఇండియా.. డిజిటల్ ఇండియా అన్నాడు. ఏమైనా జరిగిందా..?' అని ప్రశ్నించారు. రైతుల ఆదాయం రెట్టింపు జరగలేదని, రూపాయి విలువ పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇక్కడి కృష్ణా, గోదావరి నదుల నీళ్లను ఇతర రాష్ట్రాలకు తరలించుకోవాలని చూస్తోందని చెప్పారు. 'అబ్‌కి బార్ 400 పార్ అని మోడీ అంటున్నాడు. ఈసారి మోడీ వస్తే పెట్రోల్, డీజిల్ 400 పార్ అవుతాయి' అని అన్నారు. బీజేపీ ఎప్పుడైనా దోపిడీదారులు, పెట్టుబడిదారుల పార్టీయే తప్ప.. అది పేదల పార్టీ కాదని అన్నారు. తెలంగాణకు ఏనాడూ ఒక్క మంచి పని నరేంద్ర మోడీ చేయలేదని విమర్శించారు. పైగా తెలంగాణ ముచ్చట ఎప్పుడు వచ్చినా తల్లిని చంపి.. బిడ్డను బతికించారని ఓ దిక్కుమాలిన మాట మాట్లాడుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతసేపూ మతవిద్వేషం.. ప్రజల మధ్య చిచ్చుపెట్టడం, గందరగోళం చేసుడే తప్ప.. ఏ ఒక్క మంచి పని ప్రజలకు చేసింది లేదని విమర్శించారు. అందువల్ల బీజేపీకి ఓటు వేసినా వేస్ట్ అని, ప్రజలకు ఏం లాభం జరగదని అన్నారు. దేశంలో సంకీర్ణ ప్రభుత్వమే రానుందని, బీఆర్ఎస్‌కు 10 నుంచి 12 సీట్లు ఇస్తే కేంద్రంలో కీలకం అవుతామని చెప్పారు. తెలంగాణ ఆత్మగౌరవం, అస్తిత్వం కాపాడేది బీఆర్ఎస్సేనని, కాంగ్రెస్ ఇచ్చిన పథకాలు మెడలు వంచి అమలు చేసే బాధ్యత బీఆర్ఎస్ తీసుకుంటుందని అన్నారు. కావునా లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గంపగోవర్ధన్, జాజాల సురేందర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ముజిబుద్దీన్ తదితరులున్నారు.

తక్షణమే సహాయక చర్యలు చేపట్టండి

- జీహెచ్ఎంసీ, ట్రాన్స్‌కో, పోలీసు అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం
- లోతట్టు కాలనీలు, ట్రాఫిక్, విద్యుత్ సమస్యపై సమీక్ష
- సహాయక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

భారీ వర్షం, ఈదురుగాలులతో ఇబ్బంది పడుతున్న వారికి తక్షణమే సహాయ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమవడం, ట్రాఫిక్ సమస్యలు, విద్యుత్ అంతరాయాలపై వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులతో సీఎం సమీక్షించారు. వరంగల్ పర్యటనలో ఉన్న సీఎం అక్కడి నుంచే జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, సిటీ పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాసరెడ్డి, ట్రాన్స్‌కో సీఎండీ ఎస్.ఏ.ఎం రిజ్వీ, ఇతర ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. భారీ వర్షాలు, ఈదురుగాలులతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సమస్యను పరిష్కరించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో జలమయమైన కాలనీల్లో ప్రజలకు అవసరమైన చేయూతను అందించాలని సూచించారు. నగరంలో ట్రాఫిక్ సమస్యను సాధ్యమైనంత త్వరగా క్లియర్ చేసి వాహనదారులు త్వరగా ఇండ్లకు చేరుకునేలా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది చేపట్టే సహాయక చర్యల్లో భాగస్వాములు కావాలనీ, సమస్య తీవ్రత ఎక్కువగా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలకు సూచించారు.

ఆందోళన వద్దు...
తడిచిన ధాన్యాన్నీ కొనుగోలు చేస్తాం

- సివిల్ సప్లైస్ కమిషనర్ డీఎస్ చౌహాన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అకాల వర్షాల నేపథ్యంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని సివిల్ సప్లైస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ కోరారు. అకాల వర్షాల నేపథ్యంలో తడిచిన ధాన్యాన్నీ కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. వర్షం కారణంగా ధాన్యం తడిసిపోయిందన్న సమాచారంతో మంగళవారం ఆయన సిద్దిపేట జిల్లా కొమురవెల్లి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. వడగండ్ల వానలతో వరి ధాన్యంతో పాటు ఇతర పంటలకూ నష్టం జరిగిందని తెలిపారు. చివరి గింజ వరకూ కనీస మద్దతు ధరకు ప్రభుత్వం కొంటుందని భరోసా కల్పించారు. సొంత స్థలంలో కాకుండా అద్దెకు నడుపుతున్న కేంద్రాల అద్దెలను రైతుల నుంచి వసూలు చేయకుండా సొసైటీలు, ఐకేపీ భరిస్తాయని వివరించారు. ఇకపైన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్లను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు.

మండుటేసవిలో భారీ వర్షం

- చిగురుటాకులా వణికిన భాగ్యనగరం
- ఈదురుగాలులకు తోడుగా భారీ వర్షం
- మియాపూర్‌లో అత్యధికంగా 13.35 సెంటీమీటర్లు నమోదు
- రోడ్లన్నీ అస్తవ్యస్తం.. స్తంభించిన జనజీవనం
- రాష్ట్రంలోనూ పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వాన
- రాత్రి 10 గంటల వరకు 609 ప్రాంతాల్లో వర్షపాతం నమోదు
- రెండు, మూడు డిగ్రీల మేర తగ్గిన ఉష్ణోగ్రతలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మండుటేసవిలో 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, మెరుపులతో కూడిన భారీ వర్షం భాగ్యనగరాన్ని చిగురుటాకులా వణికించింది. పలు జిల్లాల్లో ఈదురుగాలుల వానతో పంటలు నేలకొరిగాయి. మంగళవారం రాత్రి పది గంటల వరకు రాష్ట్రంలో చాలా చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మొత్తంగా 609 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి పరిధిలోని మియాపూర్‌లో అత్యధికంగా 13.35 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయింది. రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్, సంగారెడ్డి, నల్లగొండ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మెదక్ జిల్లాల్లో పలుచోట్ల భారీ వాన పడింది. 25 ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదైంది. అందులో గ్రేటర్ హైదరాబాద్‌లోని ప్రాంతాలే ఎక్కువగా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఒకటెండ్రు చోట్ల వడగండ్ల వాన పడింది. బుధ, గురువారం కూడా రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాల్లో 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో కూడిన ఈదురుగాలుల వర్షం పడే సూచనలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రాబోయే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే సూచనలున్నాయి. సాయంత్రం, రాత్రి సమయాల్లో ఈదురుగాలులతో కూడిన జల్లులు పడే అవకాశముంది. గరిష్ఠ ఉష్ణోగ్రత 39 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 27 డిగ్రీలుగా ఉండొచ్చు. వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో ఉష్ణోగ్రతలు భారీగా తగ్గాయి. నిన్నటితో పోలిస్తే మూడునాలుగు డిగ్రీల మేర పడిపోయాయి. వచ్చే రెండ్రోజులు కూడా రెండు, మూడు డిగ్రీల మేర తగ్గే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది. ఉష్ణోగ్రతలు తగ్గినప్పటికీ ఉక్కపోత మాత్రం తీవ్రంగా ఉంది.

అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు

నిజామాబాద్	44.7 డిగ్రీలు
బిచ్కుంద(కామారెడ్డి)	44.7 డిగ్రీలు
నర్సాపూర్(నిర్మల్)	44.3 డిగ్రీలు
తానూర్(నిర్మల్)	44.1 డిగ్రీలు
మగ్దుంపూర్(కామారెడ్డి)	44.0 డిగ్రీలు

అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలివే

మియాపూర్ (రంగారెడ్డి)	13.35 సెం.మీ.
కూకట్‌పల్లి (మేడ్చల్ మల్కాజిగిరి)	11.78 సెం.మీ.
చందానగర్(రంగారెడ్డి)	10.75 సెం.మీ.
జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం	10.50 సెం.మీ.
బాచ్‌పల్లి (మేడ్చల్ మల్కాజిగిరి)	10.45 సెం.మీ.
ఎమ్ఎమ్‌టీఎస్ లింగంపల్లి(రంగారెడ్డి)	10.08 సెం.మీ.

రాజ్యాంగ రక్షణకు కార్మికవర్గం నడుం బిగించాలి

- సీఐటీయూ అఖిల భారత కోశాధికారి సాయిబాబు
- ఘనంగా మేడే వారోత్సవాల ముగింపు సభ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భారత రాజ్యాంగ రక్షణకు, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ కోసం కార్మికవర్గం నడుం బిగించాలని సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం.సాయిబాబు అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓస్ గార్డెన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. అంతకుముందు సీఐటీయూ కార్యాలయం నుంచి సభ వేదిక వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సభలో సాయిబాబు మాట్లాడుతూ.. కార్మికులు హక్కులు, ఎనిమిది గంటల పని దినం కోసం ప్రాణాలర్పించి చట్టాలు సాధించుకున్నారని గుర్తు చేశారు. 1886 మే 1న అమెరికాలోని చికాగోలో పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా కార్మికవర్గం ఎనిమిది గంటల పని దినం కోసం ఉద్యమించిందన్నారు. ఆ క్రమంలో అక్కడి ప్రభుత్వం వారిపై పోలీసులతో కాల్పులు జరిపించడంతో అనేక మంది కార్మికులు అమరుల య్యారని చెప్పారు. వారి త్యాగాల కారణంగా నేడు ప్రపంచ వ్యాప్తంగా ఎనిమిది గంటల పని దినాలు అమలవుతున్నాయన్నారు. కార్మికులు చిందించిన రక్తపు మడుగులోనే ఎర్రజెండా పుట్టిందన్నారు. అనంతరం కార్మికుల హక్కుల కోసం సీఐటీయూ అనేక ఉద్యమాలు చేసి సాధించిందని గుర్తు చేశారు. నేడు దేశంలో రాజ్యాంగం, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రమాదంలో ఉన్నాయని, వాటి రక్షణ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజ్యాంగం మౌలిక సూత్రాలపై దాడి చేస్తోందని విమర్శించారు. కార్మిక హక్కులను కాలరాస్తూ చట్టాల సవరణ చేసి లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నదని, దేశ కార్మిక, కర్షక వర్గం నిర్మించిన ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు చౌకగా అమ్మేస్తుందని వివరించారు. లౌకిక ప్రజాతంత్ర భారత రాజ్యాంగం బీజేపీ పాలనలో ప్రమాదంలో పడిందన్నారు. కార్మిక వర్గం అనేక త్యాగాలు చేసి, పోరాటాల ద్వారా సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని సవరించి, 12 గంటలకు పెంచి శ్రమ దోపిడీకి గురి చేసేలా విధానాలు రూపొందిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు కృషి చేయాలని, పార్లమెంటు ఎన్నికల్లో మతోన్మాద, కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. అభ్యుదయ, వామపక్ష, లౌకిక శక్తులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్ కుమార్, కోశాధికారి కె.సునీత, ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, లింగాల చిన్నన్న, నైతం శోభ, డి.వెంకటమ్మ, సహాయ కార్యదర్శులు ఎం.సుజాత, జితేందర్, పెర్క దేవిదాస్, అగ్గిమల్ల స్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లంక రాఘవులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బండి దత్తాత్రి పాల్గొన్నారు.



మూడో నెంబర్
"గుర్తుం"దా...!

- సింగిల్ హ్యాండ్‌కి ఓటు వేయండి
- ఆర్ఆర్ఆర్‌ని గెలిపించండి : సినీ హీరో దగ్గుబాటి వెంకటేష్

నవతెలంగాణ-ఖమ్మం

"అమ్మా.. అక్క.. బాబూ.. తాతా.. చెల్లి.. తమ్ముడూ ఈవీఎంలో మూడో నెంబర్ "గుర్తుం"దా..! అదేనండి మన హస్తం గుర్తు. ఈ నెల 13వ తేదీ జరిగే ఎన్నికల్లో మన ఆర్ఆర్ఆర్‌కి ఓటు వేసి గెలిపించండి" అంటూ సినీ హీరో దగ్గుబాటి వెంకటేష్ ప్రచారం నిర్వహించారు. ఖమ్మం నగరంలోని మయూరి సెంటర్ నుంచి పాత బస్టాండ్, జెడ్పీసెంటర్, పాత కలెక్టరేట్ మీదుగా ఇల్లందు క్రాస్ రోడ్ వరకు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, తన వియ్యంకుడు రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం రోడ్ షో నిర్వహించారు. మంత్రి పొంగులేటి, ఎంపీ రేణుకా చౌదరి, అభ్యర్థి ఆర్ఆర్ఆర్ పాల్గొన్న ఈ రోడ్ షోలో ప్రసంగించారు. అక్కడ భద్రాచలంలో శ్రీరాముడు.. ఇక్కడ ఖమ్మంలో రఘురాముడు.. ఈ రఘురాముడికి ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలి అన్నారు. అందరికీ "గుర్తుం"ది...! కదా... ఈనెల 13..! ఆ రోజు ఈవీఎంలో మూడో నెంబర్ హస్తం గుర్తుకు వేయండి. ఓటు వేయడం మన బాధ్యత... మన హక్కు.... అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

ఎనీ టైం... ఎనీ సెంటర్ అంటూ సందడి

ఎనీ టైం .. ఎనీ సెంటర్.. సింగిల్ హ్యాండ్ రఘురాముడు.. ఖమ్మం.. ఖమ్మం.. ఖమ్మం.. కమాన్ అంటూ సినీ హీరో వెంకి నగరంలో సందడి చేశారు. ఖమ్మం ప్రజానీకం వెంకటేష్‌ను చూసేందుకు ఉత్సాహం చూపారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ రోడ్ షోకు నీరా'జనం' పలికారు. అభివాదం చేస్తూ.. హస్తం గుర్తుకు ఓటు వేసి ఆర్ఆర్ఆర్‌ను గెలిపించాలని కోరుతూ ఆయన ముందుకు సాగారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్ర శ్రీకాంత్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రం, నాయకులు నవీన్ రెడ్డి, బషీర్, భుక్యా శ్రీను, తిరుపతిరావు, బి.సుదర్శన్, కాంగ్రెస్ జిల్లా నగర అధ్యక్షులు దుర్గాప్రసాద్, జావిద్, మంత్రి తుమ్మల తనయుడు తుమ్మల యుగంధర్, కార్పొరేటర్ కమర్తపు మురళి, బాలసాని లక్ష్మీనారాయణ, సీపీఐ నాయకులు జానీమియా, పోటు కళావతి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు దొబ్బల సౌజన్య పాల్గొన్నారు.

కవితకు కస్టడీ పొడిగింపు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు రౌస్ ఎవెన్యూ కోర్టు మరోసారి జ్యుడీషియల్ కస్టడీ పొడిగించింది. మనీలాండరింగ్ కేసుకు సంబంధించిన ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసులో 14 వరకు కస్టడీని పొడిగించిన కోర్టు, సీబీఐ కేసులో 20 వరకు కస్టడీ పొడిగిస్తున్నట్టు స్పష్టం చేసింది. ఈడీ, సీబీఐ కేసులో గతంలో కవితకు విధించిన జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో... మంగళవారం మధ్యాహ్నం కవితను జైలు సిబ్బంది స్పెషల్ జడ్జ్ కావేరి బవేజా ముందు హాజరుపర్చారు. తొలుత ఈడీ కేసులో వాదనలు జరగగా... కేసు దర్యాప్తు పురోగతిని ఈడీ తరపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్ కె మట్ట కోర్టుకు వివరించారు. ప్రస్తుతం దర్యాప్తు కీలక దశలో ఉన్నందున కవిత కస్టడీని పొడిగించాలని కోరారు. అంతకు ముందు కవిత న్యాయవాదులు నితేశ్ రాణా, మోహిత్ రావులు మూడు విజ్ఞప్తులను కోర్టు ముందుకు తెచ్చారు. కవితను కలిసేందుకు హైదరాబాద్ నుంచి తమ కుటుంబ సభ్యులు వచ్చారని, కవితతో 15 నిమిషాలు మాట్లాడేందుకు వారిని అనుమతించాలని కోరారు. అలాగే జైలులో కవితకు మరో 10 పుస్తకాలు అనుమతించాలని కోరారు. కోర్టు లాకప్ లో కవితకు తన భర్త తెచ్చిన ఆహారం తినేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే జైలులో కవితకు ఇంటి భోజనం అందించేందుకు మార్చి 26 ఆదేశాల్లో కోర్టు అనుమతించిందని, అయితే ఈ భోజనాన్ని 10, 15 మంది జైలు సిబ్బంది చెక్ చేయడంతో కలుషితం (కాంటామినేషన్) అవుతోందని కోర్టు దృష్టికి తెచ్చారు. అందువల్ల హోం ఫుడ్ ఇవ్వడం ఆపేసామని, అలా కాకుండా జైలు డాక్టర్ చెక్ చేసి కవితకు ఫుడ్ అందించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన జడ్జి, ఇంటి భోజనం ఆపేసిన తరువాత మళ్లీ ఎందుకు అడుగుతున్నారని ప్రశ్నించారు. కవితకు ఇంటి భోజనం అందించే అంశంపై జైలు సూపరింటెండెంట్ వివరణ కోరతామని చెప్పారు. అనంతరం ఈడీ వాదనలను పరిగణలోకి తీసుకొని కవిత జ్యుడీషియల్ కస్టడీని 14 వరకు పొడిగిస్తున్నట్టు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే కోర్టు లాకప్‌లో కవితను కలిసేందుకు అనుమతించడంతో పాటు, జైల్లో చదువుకునేందుకు వీలుగా మరో 10 పుస్తకాలకు అనుమతి ఇచ్చారు. అనంతరం ఆమెను కోర్టుకు తరలించారు.

సీబీఐ కేసులో 20 వరకు కస్టడీ..

సీబీఐ కేసులో కస్టడీపై అరగంట వ్యవధిలోనే వాదనలు జరిగాయి. సీబీఐ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పంకజ్ గుప్తా వాదనలు వినిపించారు. కేసు వ్యవహారంలో మరింత మందిని విచారించాల్సి ఉందని, కీలక అంశాలు రాబట్టాల్సి ఉందని అన్నారు. దర్యాప్తు సజావుగా సాగేందుకు కవిత కస్టడీని పొడిగించాలని కోరారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకొన్న ధర్మాసనం సీబీఐ కేసులో కవిత జ్యుడీషియల్ కస్టడీని 20 వరకు పొడిగిస్తున్నట్టు వెల్లడించింది. తదుపరి విచారణ మే 20న చేపడతామని స్పష్టం చేసింది.

వారం రోజుల్లో కవితపై చార్జ్ షీట్ దాఖలు : ఈడీ

ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవిత పాత్రపై వచ్చే వారం రోజుల్లో చార్జ్ షీట్ దాఖలు చేయనున్నట్టు ఈడీ తరపు న్యాయవాది ఎస్ కె మట్ట కోర్టుకు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫైలింగ్ తుది దశకు చేరినట్టు ఆయన మీడియాకు తెలిపారు. ఒకటి, రెండు రోజుల్లో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని యోచిస్తున్నట్టు చెప్పారు.

రేవణ్ణను దేశం దాటించి, నాలాంటి వాళ్లను అరెస్ట్ చేస్తారా? : కవిత


ప్రజ్వల్ రేవణ్ణ లాంటి వారిని దేశం దాటించి, తనలాంటి వాళ్లను అరెస్ట్ చేయడం అన్యాయమని కవిత అన్నారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించాలని ఆమె కోరారు. కోర్టు హాల్లోకి వెళ్లే ముందు కేవలం జై తెలంగాణ, జై భారత్ అనే నినాదాలు చేశారు. అయితే సీబీఐ కేసులో విచారణ తరువాత బయటకు వచ్చిన కవిత, రేవణ్ణ అంశాన్ని ముడిపెడుతూ కేంద్రంలోని బీజేపీపై పరోక్షంగా విమర్శలు చేశారు.

బెయిల్‌పై నేడు హైకోర్టుకు కవిత

ఈడీ, సీబీఐ కేసుల్లో రౌస్ ఎవెన్యూ కోర్టు బెయిల్ నిరాకరించడంతో నేడు (బుధవారం) కవిత ఢిల్లీ హై కోర్టును ఆశ్రయించనున్నారు. ఈ మేరకు కవిత అరెస్టును చాలెంజ్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయ నున్నట్టు ఆమె భర్త అనిల్ తెలిపారు. పీఎంఎల్ఏ చట్టం లోని నిబంధనలకు విరుద్ధం, అక్రమంగా కవితను అరెస్ట్ చేశారని పిటిషన్ లో పేర్కొననున్నట్టు తెలిసింది. అలాగే సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ కు ముందు రోజు ఆమెను అరెస్ట్ చేయడాన్ని సవాల్ చేయనున్నట్టు సమాచారం.

ప్రచారానికి.. నాలుగు రోజులే..!

- పీక్ స్టేజ్‌లో ప్రచారం
- ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో అభ్యర్థులు
- బస్తీల్లో ఊపందుకున్న ప్రచార హోరు
- ఈ వారంలో నగరానికి రాహుల్, ప్రియాంక, మోడీ రాక





(ఫైల్)

నవతెలంగాణ-సిటీబ్యూరో

లోక్‌సభ ఎన్నికల ప్రచార పర్వానికి ఇంకా నాలుగు రోజులే గడువుంది. ఈ నెల 13న పోలింగ్ జరగాల్సి ఉండగా.. రెండ్రోజుల ముందుగా 11వ తేదీ సాయంత్రానికే ప్రచారానికి తెరపడనుంది. ఇప్పటికే ప్రధాన పార్టీలు సభలు, రోడ్డు షోలు, కార్నర్ మీటింగ్‌లతో హోరెత్తిస్తున్నాయి. ఆయా పార్టీల నాయకులు రోజులో రెండు మూడు నియోజకవర్గాలను చుట్టేస్తున్నారు. ముఖ్యంగా తటస్థ ఓటర్లు, మహిళాసంఘాలు, కుల, కాలనీ సంఘాలతో పాటు ఇతర బలమైన వర్గాలే లక్ష్యంగా హామీలు గుప్పిస్తున్నారు. గ్రేటర్‌లోని సికింద్రాబాద్, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, చేవేళ్ల పార్లమెంట్ నియోజకవర్గాల బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ ప్రసంగాల్లో ఘాటైన వ్యాఖ్యలతో రాజకీయ వేడి పుట్టిస్తున్నారు. మరోపక్క గడువులోగా అధిష్టాన పెద్దలతో బహిరంగ సభల నిర్వహణ ద్వారా ఓటర్లను తమ వైపు తిప్పుకొనే వ్యూహాలు సిద్ధం చేసుకున్నారు. ఈ మిగిలిన కొద్ది సమయాన్ని సద్వినియోగం చేసుకునే కార్యాచరణతో ముందుకెళ్తున్నారు.

ఎండల ఎఫెక్ట్.. రాత్రి వేళల్లోనూ ప్రచారం!

ఎండలు మండిపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో పెరుగుతున్న వేడి వాతావరణంతో సభలు, ప్రచార కార్యక్రమాలకు ఇబ్బందిగా మారిందని నగరానికి చెందిన పలువురు ముఖ్య నేతలు చెబుతున్నారు. సభలు, సమావేశాలకు జనసమీకరణ, నిర్వహణ కష్టతరంగానే ఉందని అంటున్నారు. ఉదయం వేళల్లో బస్తీలు, అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, పార్కులు, జనసంచారం ఉండేచోట నాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. సాయంత్రం కార్నర్ మీటింగ్‌లు, రోడ్డు షోలు నిర్వహిస్తున్నారు. చీకటి పడ్డాక ప్రచార సమయం ముగిసే వరకూ బస్తీలు, కాలనీల్లో పర్యటిస్తున్నారు. గడువు దగ్గరపడే కొద్దీ ఎండను దృష్టిలో పెట్టుకొని ఉదయాన్నే ఆ రోజు ప్రణాళిక మేరకు అసెంబ్లీ సెగ్మెంట్‌లోని ఆయా డివిజన్ల వారీగా వెళుతూ.. ప్రజలతో మమేకమవుతూ.. బిజీబిజీగా గడుపుతున్నారు. బస్తీలు, కాలనీల్లో స్థానిక సమస్యలను.. అక్కడ జరగాల్సిన అభివృద్ధి గురించి ప్రస్తావిస్తున్నారు.

నగరానికి అగ్రనేతల రాక..

లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు గడువు దగ్గరపడటంతో మూడు ప్రధాన రాజకీయ పార్టీల అగ్రనేతలు డజను మందికిపైగా రాజధానికి రానున్నారు. దాంతో ప్రచారం పీక్ స్టేజీకి చేరనుంది. పీసీసీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రేటర్‌లోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రచారం నిర్వహించారు. రానున్న రోజుల్లో మరిన్ని రోడ్డు షోలు, కార్నర్ మీటింగ్‌లు జరపనున్నారు. ఈనెల 9న సరూర్‌నగర్‌లో జరిగే జన జాతర సభకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రానుండగా.. 10న ప్రియాంకా గాంధీ తాండూరు జనజాతర సభలో.. అనంతరం పలు అసెంబ్లీ సెగ్మెంట్లలో రోడ్ షో, కార్నర్ మీటింగ్‌లలో పాల్గొననున్నారు. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సైతం ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ బస్సు యాత్ర సాగిస్తున్నారు. దాదాపు 14 రోజులుగా చేస్తున్న బస్సు యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. యాత్ర సందర్భంగా కాంగ్రెస్, బీజేపీలవి మోసపూరిత హామీలంటూ ప్రజలకు తెలియజేస్తూ ప్రచారాన్ని సాగిస్తున్నారు.

బస్సుయాత్ర ముగిసిన వెంటనే.. 11వ తేదీన నాలుగు పార్లమెంట్ స్థానాలను కవర్ చేసేలా.. నగరంలో భారీ సభ నిర్వహించడంపై పార్టీ నేతలు కసరత్తు చేస్తున్నారు. ఈలోగా కేటీఆర్‌తో రోడ్ షో, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నారు. ఇక బీజేపీ తరపున ఇప్పటికే కేంద్ర హోం శాఖమంత్రి అమిత్‌షా, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రోడ్డుషోలు నిర్వహించారు. ప్రధాని మోడీ 10వ తేదీన ఎల్బీ స్టేడియంలో సభకు రానున్నారు. ఇతర రాష్ట్రాల సీఎంలు, కీలక నేతలు బుధవారం నుంచి శనివారం వరకు ఇక్కడే ఉండి ప్రచారంలో పాల్గొననున్నారు.

అసంతృప్తులకు

ఎన్నికల ప్రచారం కొనసాగిస్తూనే పార్టీలు తమ బలాన్ని పెంచుకొనేందుకు ఇతర పార్టీల్లో అసంతృప్తులకు గాలం వేస్తూ చేరికలను ప్రోత్సహిస్తున్నాయి. అయితే కొత్తగా వస్తున్నవారికి.. పాత నాయకులకు సమన్వయం చేయటం.. ప్రచారంలో భాగస్వాములను చేయడం లేదని తెలుస్తోంది. మూడు పార్టీల అభ్యర్థులు బలమైన సామాజిక తరగతుల్లో పెద్ద మనుషులను కలుస్తూ అంతర్గత సమావేశాలు నిర్వహిస్తున్నారు.

ఎవరైనా సమాన బాధ్యత వహించాల్సిందే



న్యూఢిల్లీ : తప్పుదారి పట్టించే ప్రకటనల విషయంలో సెలబ్రిటీలైనా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయన్సర్స్ అయినా సమాన బాధ్యత వహించాల్సిందేనని సుప్రీంకోర్టు మంగళవారం పేర్కొంది. పతంజలి ఆయుర్వేద తప్పుదారి పట్టించే ప్రకటనల కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ జారీ చేసిన ప్రివెన్షన్ ఆఫ్ మిస్‌లీడింగ్ అడ్వర్టైజ్ మెంట్స్ యాక్ట్ -2022 ప్రమాణాలను పాటించాల్సి వుందని జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ అమానుల్లాలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. మార్గదర్శకాలు 13 ప్రకారం సదరు వ్యక్తి అతను/ఆమె ఆమోదించే ఉత్పత్తి లేదా సేవపై తగినంత సమాచారం కలిగి ఉండాలని, అది మోసపూరితం కాదని నిర్ధారించుకోవాలని సూచించింది. వినియోగదారుల సేవ కోసం ఈ నిబంధనలు ఉద్దేశించబడ్డాయని, మార్కెట్ నుండి కొనుగోలు చేసిన ఉత్పత్తి గురించి, ముఖ్యంగా ఆహారం విషయంలో వినియోగదారులకు అవగాహన కల్పిస్తాయని పేర్కొంది. తప్పుదారి పట్టించే ప్రకటనల విషయంలో సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయన్సర్స్ సమానంగా బాధ్యత వహిస్తారని తీర్పునిచ్చింది. వాణిజ్య ప్ర కటనలు సంబంధిత నియమాలు, కోడ్‌లకు అనుగుణంగా ఉన్నాయని పేర్కొంటూ, స్వీయ-ధృవీకరణ పత్రాన్ని దాఖలు చేయాలని ప్రసారకర్తలను (మీడియా, న్యూస్‌పేపర్) ఆదేశించింది.

ఉపాధి హామీచట్టానికి తూట్లు



ఎన్నికల్లో ఓడించి బుద్ధి చెప్పాలి

- ప్రజానేత సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించండి : కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య
- ప్రమాదంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం: మల్లు లక్ష్మి

నవతెలంగాణ-కట్టంగూర్/ అర్వపల్లి

వామపక్ష పోరాటాల ఫలితంగా వచ్చిన ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించి నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య అన్నారు. ఉపాధి హామీ చట్టం రక్షణకు ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ప్రజానేతగా, నిత్యం ప్రజాసమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి.జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ మంగళవారం నల్లగొండ జిల్లాలో పలుచోట్ల నాగయ్యతోపాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

కట్టంగూరు మండలం పిట్టంపల్లి గ్రామంలో నాగయ్య ఉపాధి కూలీలను కలిసి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాడు యూపీఏ ప్రభుత్వంతో కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని రూపొందించి జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని తెచ్చింది సీపీఐ(ఎం) అని గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో మంచి అభ్యర్థికి ఓటు వేయాలని, ప్రజలను ముంచే అభ్యర్థులను ఓడించాలని కోరారు. పూటకో పార్టీ మార్చే అవకాశవాదులకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం, సమాచార హక్కు చట్టం కమ్యూనిస్టుల పోరాట ఫలాలని వివరించారు. అవి కమ్యూనిస్టుల త్యాగాల ఫలితంగా వచ్చాయన్నారు. 2000లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో ముగ్గురు కార్యకర్తల ప్రాణత్యాగం, సీపీఐ(ఎం) సుదీర్ఘ ఉద్యమ ఫలితమే నేటి ఉచిత కరెంట్ సరఫరా అని చెప్పారు. బీజేపీ విధానాలు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా.. పేదలకు పెనుభారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోటీశ్వరులకు పన్ను రాయితీలిస్తూ పేద ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. వీటన్నింటిపై చట్టసభల్లో కొట్లాడేందుకు నీతి, నిజాయితీకి మారుపేరుగా నిలిచిన సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రచార కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చినపాక లక్ష్మీనారాయణ, నాయకులు గంజి మురళీధర్, దండెంపల్లి సత్తయ్య, పెంజర్ల సైదులు, జాల రమేశ్, ముస్కు మారయ్య, ఎన్న నర్సిరెడ్డి, కారింగ్ రమణ పాల్గొన్నారు.

భీంరెడ్డి, మల్లు స్వరాజ్యం పోరాట ఫలితమే శ్రీరాంసాగర్ నీళ్లు

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మీ



భీంరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం పోరాట ఫలితంగానే శ్రీరాంసాగర్ నీళ్లు వచ్చాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మీ అన్నారు. వారి వారసుడిగా నిత్యం ప్రజాసమస్యలపై పోరాడుతున్న సీపీఐ(ఎం) భువనగిరి ఎంపీ అభ్యర్థి జహంగీర్‌ని గెలిపించాలని కోరారు. అర్వపల్లి మండలం జాజిరెడ్డిగూడెంలో జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీ, అవినీతికర కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్ సుత్తికొడవలి నక్షత్రం గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో లౌకికవాద, ప్రజాస్వామ్య, భారత రిపబ్లిక్ ఉనికే ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం దేశంలో కార్మికుల హక్కులను నాశనం చేసేందుకు, ప్రజలను మతపరంగా విభజించేందుకు యత్నిస్తోందన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీని, దాని మిత్రపక్షాలను ఓడించడమే ప్రతి దేశభక్తుని కర్తవ్యంగా భావించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చెరుకు ఏకలక్ష్మి, నాయకులు జె.నర్సింహారావు, వీరబోయిన రవి, వజ్జె శ్రీనివాస్, వజ్జె సైదులు, సిగ వెంకన్న, శ్రీను, రవి, శ్రీకాంత్, విజయ్‌కుమార్, నిమ్మలగుంటి అబ్బులు, బుచ్చిరాములు, సీనియర్ నాయకులు అరిగె వీరస్వామి, నర్సయ్య పాల్గొన్నారు.

30 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలి



- కనీస వేతనం రూ.30 వేలుండాలి
- జీఎస్‌డీపీ అభివృద్ధికి అనుగుణంగా వేతనాలు నిర్ణయించాలి
- పీఆర్సీ చైర్మెన్‌తో టీఎస్‌యూటీఎఫ్ చర్చలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రెండో పీఆర్సీలో 30 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) కోరింది. కనీస వేతనం రూ.30 వేలుండాలని సూచించింది. గతేడాది జులై ఒకటో తేదీ నుంచి ఆర్థిక లాభం ఉండేలా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర జీఎస్‌డీపీ అభివృద్ధికి అనుగుణంగా వేతనాలుండాలని కోరింది. రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు గౌరవ ప్రదంగా జీవించటానికి అవసరమైన వేతనాలను నిర్ణయించాలని తెలిపింది. పీఆర్సీ చైర్మెన్ ఎన్ శివశంకర్, సభ్యులు బి రామయ్యతో మంగళవారం హైదరాబాద్‌లో వేతన సవరణ ప్రతిపాదనలపై టీఎస్‌యూటీఎఫ్ ఆఫీసు బేరర్లు చర్చలు జరిపారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి మీడియాతో మాట్లాడుతూ డాక్టర్ అక్రాయిడ్ ఫార్ములా, ప్రపంచ కార్మిక సదస్సు నిర్ణయించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉద్యోగి కుటుంబం ఆరోగ్యంగా జీవించటానికి అవసరమైన కనీస వేతనాన్ని నిర్ణయించాలని చెప్పారు. ఐదేండ్లలో రాష్ట్ర జీఎస్‌డీపీ జాతీయ సగటుకన్నా 60.3 శాతం అభివృద్ధి సాధించిందన్నారు. ఆ మేరకు ఉద్యోగుల వేతనాలు కూడా పెరగాల్సిన అవసరముందని సూచించారు. గత పీఆర్సీ నివేదిక 30 నెలలు ఆలస్యంగా ఇవ్వడం వల్ల ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పీఆర్సీలో అలాంటి నష్టం జరగకుండా సకాలంలో నివేదికను ప్రభుత్వానికి అందజేసి, గతేడాది జులై ఒకటి నుంచి ఆర్థిక ప్రయోజనం వర్తింప జేయాలని కోరారు. వేతన సవరణ కమిటీ సిఫారసులు అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు, సొసైటీలకు వర్తింపజేయాలనీ, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, తాత్కాలిక ఉద్యోగుల సంక్షేమానికి కూడా తగిన సూచనలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ కోశాధికారి టి లక్ష్మారెడ్డి, కార్యదర్శులు ఎ వెంకట్, ఎం. రాజశేఖర్‌రెడ్డి, పి మాణిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ ప్రతిపాదనల్లోని ముఖ్యాంశాలు

- కనీస వేతనం రూ.30 వేలు, గరిష్ట వేతనం రూ.2,48,150
- మాస్టర్ స్కేలును కొనసాగించాలి.
- ఫిట్‌మెంట్ 30 శాతం తగ్గకుండా ఉండాలి.
- ప్రస్తుత మూల వేతనానికి 2023, జులై ఒకటి నాటికి రావాల్సిన డీఏ (33.67 శాతం) ఫిట్‌మెంట్ కలిపి మాస్టర్ స్కేల్‌లో తదుపరి స్టేజీలో వేతనం నిర్ణయించాలి.
- ఉపాధ్యాయుల వివిధ క్యాడర్ల వేతన స్కేళ్ల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాలి.
- ఆటోమాటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీంను 5/10/15/20/25/30 ఆరు దశలుగా నిర్ణయించాలి.
- ఇంటి అద్దె అలవెన్సు (హెచ్‌ఆర్‌ఏ) గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అంతరం తగ్గించాలి. గ్రామీణ ప్రాంతాల్లో 15 శాతం అన్ని మున్సిపాల్టీల్లో 17 శాతం, జిల్లా కేంద్రాలు, కార్పొరేషన్లలో 20 శాతం, జీహెచ్ఎంసీలో 24 శాతం హెచ్‌ఆర్‌ఏ ఉండాలి.
- గ్రామీణ ప్రాంత ఉద్యోగులను ప్రోత్సహించేందుకు 10 శాతం రిమోట్ రూరల్ ఏరియా అలవెన్సు ఇవ్వాలి. గరిష్టంగా రూ.5 వేలుండాలి.
- ఈహెచ్ఎస్ పథకంలో భాగంగా నగదు రహిత వైద్యం అందించాలి. మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలి. అన్ని విద్యా సంస్థల్లోని ఉద్యోగులందరికీ హెల్త్‌కార్డులు ఇవ్వాలి.
- కనీస పెన్షన్ రూ.30 వేలుండాలి. గ్రాట్యుటీ కనీసం రూ.5 లక్షలు, గరిష్టంగా రూ.25 లక్షలుండాలి.
- సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి.

ఇలా అయితే...పని చేయలేం

- దాడికి పాల్పడ్డ వారిని అరెస్ట్ చేయాలి
- భద్రత కల్పిస్తేనే సేవలందించగలం : కోరుట్ల ఘటనపై తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం నిరసన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బందిపై తరచూ దాడులు జరిగే పరిస్థితుల నేపథ్యంలో పని చేయలేమని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్ కోఠిలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కార్యాలయం ముందు ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు డాక్టర్ బొంగు రమేష్, డాక్టర్ పల్లం ప్రవీణ్, డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్, డాక్టర్ నరహరి తదితరులు మాట్లాడారు. తగినంత మంది వైద్యులు, వైద్య సిబ్బంది లేకుండానే గత బీఆర్ఎస్ సర్కార్ ఆస్పత్రులను ఉన్నతీకరించిందని విమర్శించారు. కోరుట్లలో పేరుకు ఏరియా ఆస్పత్రి అయినప్పటికీ అక్కడ ఉండాల్సినంత మంది డాక్టర్లు, ఇతర సౌకర్యాలు లేవని తెలిపారు. మరోవైపు కార్పొరేట్, ప్రయివేటు ఆస్పత్రుల్లో అధిక మొత్తంలో జీతాలు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నా... తాము పేదలకు వైద్య సేవలందించేందుకు ప్రభుత్వాస్పత్రుల్లో పని చేస్తున్నామని తెలిపారు. పేద రోగులకు సేవలందిస్తున్న తమకు భద్రత కల్పించాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో కోరుట్ల ఘటనకు బాధ్యులైన వారిని అరెస్ట్ చేయించడంతో పాటు మిగిలిన ఆస్పత్రుల్లో సిబ్బందికి భద్రత కల్పించాలని వారు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడ్డ నిందితులను అరెస్ట్ చేయకపోతే విధులను నిర్వర్తించలేమని హెచ్చరించారు. దాడికి పాల్పడ్డవారిని వదిలేసి ఆ ఆస్పత్రి డాక్టర్ శ్రవణ్‌ను సస్పెండ్ చేస్తూ టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్ తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపట్టారు. ఆ సస్పెన్షన్‌ను వెనక్కి తీసుకోవాలని తాము చేసిన డిమాండ్‌కు అజయ్ కుమార్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. డిమాండ్లు నెరవేర్చకుంటే తదుపరి కార్యాచరణ ఉంటుందని చెప్పారు.

ఐసీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో కల్ప స్కూల్ విద్యార్థుల సత్తా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఐసీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో కల్ప స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి సత్తాచాటారు. ఈ మేరకు ఆ పాఠశాల యాజమాన్యం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. తమ పాఠశాల నుంచి 57 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారని వివరించింది. 19 మంది విద్యార్థులు 90 శాతానికిపైగా మార్కులు సాధించారని తెలిపింది. 49 మంది విద్యార్థులు 86 శాతం మార్కులతో డిస్టింక్షన్ సాధించారని పేర్కొంది. 500కు 496 (99.2 శాతం) మార్కులతో మహేక్ గుప్తా టాపర్‌గా నిలిచారని తెలిపింది. ఆమె కంప్యూటర్ అప్లికేషన్లలో 100 మార్కులు, ఇతర నాలుగు సబ్జెక్టుల్లో 99 మార్కులు సాధించారని వివరించింది. ఎస్ స్వర, చైత్ర వెంకట నాగసాయి ఇద్దరూ 492 (98.3 శాతం) మార్కులు సాధించారని పేర్కొంది. వారిద్దరూ హిస్టరీ, సివిక్స్, జాగ్రఫీ, కంప్యూటర్ అప్లికేషన్లలో వంద మార్కులు పొందారని తెలిపింది. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యనందిస్తున్నామనీ, అందుకే ఉత్తమ ఫలితాలు సాధించడం సాధ్యమైందని పేర్కొంది. ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందించింది.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

- 40 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలి
- పీఆర్సీ చైర్మెన్‌కు ఎస్టీయూటీఎస్ ప్రతిపాదనలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 40 శాతం ఫిట్‌మెంట్‌తో రెండో పీఆర్సీని ప్రకటించాలనీ, గతేడాది జులై ఒకటి నుంచి అమలు చేయాలని ఎస్టీయూటీఎస్ కోరింది. పీఆర్సీ చైర్మెన్ ఎన్ శివశంకర్, సభ్యులు బి రామయ్యకు మంగళవారం హైదరాబాద్‌లో వేతన సవరణ ప్రతిపాదనలను ఆ సంఘం అధ్యక్షులసెం పర్వత్‌రెడ్డి, జి సదానందంగౌడ్ నేతృత్వంలో సమర్పించారు. కనిష్ట వేతనం రూ.32 వేలు, గరిష్ట వేతనం రూ.3,41,300 ఉండాలని సూచించారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపచేయాలని తెలిపారు. రిటైర్‌మెంట్ గ్రాట్యుటీని రూ.16 లక్షల నుంచి రూ.24 లక్షల వరకు పెంచాలని పేర్కొన్నారు. ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీం 6/12/18/24 స్కేళ్లకు బదులుగా 5/10/15/20/25/30 ఏండ్లుగా సవరించాలని సూచించారు. హెచ్‌ఆర్‌ఏకు సంబంధించి జీహెచ్ఎంసీలో 35 శాతం, మున్సిపల్ కార్పొరేషన్లలో 30 శాతం, జిల్లా కేంద్రాల్లో 25 శాతం, మున్సిపాల్టీల్లో 20 శాతం, గ్రామ పంచాయతీల్లో 15 శాతం అమలు చేయాలని కోరారు. మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఇన్సెంటివ్ అలవెన్సును కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూటీఎస్ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఎ సదయ్య, అసోసియేట్ అధ్యక్షులు జె గజేందర్, పీఆర్సీ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కందుకూరి దయానంద్, హెడ్‌క్వార్టర్ సెక్రెటరీ టి పోల్‌రెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇఫ్తాకారుద్దీన్, పి రామసుబ్బారావు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పి ప్రవీణ్‌కుమార్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు బి వెంకటేశ్వర్లు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సయ్యద్ సాబేర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

భారత్‌లో చైనా కొత్త రాయబారి షూ ఫెయిహాంగ్

బీజింగ్ : సీనియర్ దౌత్యవేత్త షూ ఫెయిహాంగ్‌ను భారత్‌కు కొత్త రాయబారిగా చైనా అధ్యక్షులు జిన్‌పింగ్ నియమించారు. తూర్పు లడఖ్‌పై ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో ఇరు దేశాల మధ్య సంబంధాలు స్తంభించడంతో దాదాపు 18 మాసాల సుదీర్ఘ జాప్యం అనంతరం ఈ చర్య తీసుకున్నారు. చైనా విదేశాంగ శాఖ పిటిఐకి ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఫెయిహాంగ్ గతంలో ఆఫ్ఘనిస్తాన్, రొమేనియాలకు రాయబారిగా పనిచేశారు. తన కొత్త పోస్టింగ్ బాధ్యతలు స్వీకరించడానికి ఆయన త్వరలో ఢిల్లీ వెళతారని భావిస్తున్నారు. 2022 అక్టోబరులో తన పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న చైనా దౌత్యవత్తే సున్ వెడాంగ్ స్థానంలో ఈయన బాధ్యతలు చేపడతారు. సైనిక ప్రతిష్టంభన పరిష్కరించుకోవడానికి ఇరు దేశాల మధ్య సుదీర్ఘంగా సాగుతున్న సైనిక, దౌత్య చర్చలు, సంప్రదింపుల నేపథ్యంలో ఈ నియామకం జరిగింది.

భారీ వర్షం.. నీళ్లపాలైన ధాన్యం



(మొదటిపేజీ తరువాయి)

విరిగి పడ్డాయి. సిద్దిపేటలో పిడుగుపాటుకు రైతు మృతిచెందాడు. కల్లాల్లోని ధాన్యం తడిసి రైతులకు తీవ్ర నష్టం జరిగింది. వర్షం వల్ల సాయంత్రం జరగాల్సిన రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచార సభలు రద్దయ్యాయి. హైదరాబాద్ నగరాన్ని భారీ వర్షం ముంచెత్తింది.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఈదురు గాలులతో కూడిన వర్షంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. వడగండ్ల వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నీళ్లపాలైంది. రాయికల్, కథలాపూర్, మేడిపల్లి మండలాల్లో మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. సిరిసిల్ల జిల్లా కొనరావుపేట మండలంలో పిడుగుపాటుకు గేదె మృత్యువాత పడింది. వేములవాడ, జూలపల్లి గన్నేరువరంలో భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సుల్తానాబాద్, చొప్పదండిలో భారీ వర్షానికి వ్యవసాయ మార్కెట్‌లోని వందల క్వింటాళ్ల ధాన్యం కొట్టుకుపోయింది. కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ కళాశాలలో జరగాల్సిన కాంగ్రెస్ జనజాతర సభ రద్దయింది.

ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. దహెగాం మండల కేంద్రంలో తాటిచెట్టుపై పిడుగుపడి పూర్తిగా కాలిపోయింది. ఐనం, బీబ్రా, బోర్లకుంట తదితర గ్రామాల్లో గాలి వానతో పాటు వడగండ్లు పడ్డాయి. బీబ్రా గ్రామంలో విద్యుత్ తీగలపై చెట్లు విరిగిపడగా.. తీగలు ఇండ్లపై పడ్డాయి. బోర్లకుంట గ్రామంలో బొందుగుల స్వామి ఇల్లు కూలింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిముద్దయింది. పెంచికల్‌పేట్ మండల వ్యాప్తంగా కల్లాల్లో ఉన్న వరిధాన్యం తడిచింది. బెజ్జూర్ మండలంలోని కుకుడ, ముంజంపెల్లి గ్రామాల్లో వడగండ్ల వర్షం కురిసింది. కౌటాల మండలంలో నాగెపెల్లి గ్రామంలో పిడుగు పడి రైతు మోర్లె దస్రుకు చెందిన ఎద్దు మృత్యువాత చెందింది. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని పల్లి(కె), పల్లి(బి) గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. మంచిర్యాల జిల్లా జైపూర్, మందమర్రి మండలాల్లో అకాల వర్షం బీభత్సం సృష్టించింది. వరి ధాన్యం తడిసి పోయింది. వడగళ్ల వానకు కోత దశకు వచ్చిన వరిపైరు నేలకొరిగింది. మామిడి పంట నేలరాలింది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి, చింతలమానేపల్లి, పెంచికల్‌పేట, కాగజ్‌నగర్, కౌటాలా, సిర్పూర్(టీ) భారీ వర్షం కురిసింది.

తడిసి ముద్దాయిన ధాన్యం కుప్పలు

భూపాలపల్లి జిల్లా మహాముత్తారం, గణపురం మండలాల్లో మోస్తరు వర్షాలు కురిసాయి. ధాన్యం గింజలు నేల రాలిపోయాయి. మామిడి కాయలు నేలరాలాయి. పలుచోట్ల ధాన్యం తడిసి ముద్దవగా, కొన్నిచోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. ములుగు జిల్లా గోవిందరావుపేట మండల వ్యాప్తంగా ఉదయం నుండి సాయంత్రం వరకు ఈదురు గాలులతో కూడిన చిరుజల్లులు పడ్డాయి. మల్హర్‌రావు మండలంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయింది. ప్రధాన రహదారులకు ఇరువైపులా చెట్లు విరిగి కరెంట్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వరంగల్ జిల్లా సంగెం మండలం కాట్రపల్లి గ్రామంలో ఈదురు గాలులకు మొక్కజొన్న పంటకు నిప్పు అంటుకొని దాదాపు 20 ఎకరాల వరకు పంట బూడిదైపోయింది. 10 ఎకరాలలో డ్రిప్ పైపులు పనికిరాకుండా కాలిపోయాయి. పంట విలువ దాదాపు రూ.10లక్షలు ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నర్సంపేట డివిజన్ పరిధిలో వర్షానికి పంటల నష్టం జరిగింది. వరంగల్ కాశీబుగ్గ సర్కిల్ పరిసర ప్రాంతంలో వర్షపు నీరు మోకాలు లోతు వరకు నిలవడంతో చెరువును తలపించింది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఖానాపూర్, చెన్నారావుపేట, పర్వతగిరి, రాయపర్తి, గీసుగొండలో ఉరుములు, మెరుపులు, గాలి దుమారంతో భారీగా వర్షం కురిసింది. రైతులు ఆరబోసిన వరి ధాన్యం తడిసి ముద్దయింది. పొలాల్లో ఉన్న పశుగ్రాసం ఈదురు గాలులకు కొట్టుకుపోయింది. మామిడి కాయలు నేలరాలాయి.

హైదరాబాద్‌లో భారీగా ట్రాఫిక్ జామ్..!

జంటనగరాలైన హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నాలాలు, డ్రెయినేజీలు పొంగి పొర్లాయి. పలు బస్తీలు, కాలనీలలో ఇండ్లలోకి వర్షం నీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. వాహనాదారులు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. సికింద్రాబాద్, చిలకలగూడ, మారేడుపల్లి, బోయిన్‌పల్లి, ప్యారడైజ్, ప్యాట్నీ, మలక్‌పేట, ఎర్రగడ్డ, అమీర్‌పేట, యూసఫ్‌గూడ, అల్వాల్, ఎల్బీనగర్, కాప్రా, సుచిత్ర జీడిమెట్ల, ముషీరాబాద్, చిక్కడపల్లి తదితర ప్రాంతాల్లో రోడ్లపైకి వరదనీరు చేరగా.. మియాపూర్, చందానగర్, గచ్చిబౌలి, రాయదుర్గం, కొండాపూర్‌లో రోడ్లపై భారీగా వర్షం నీరు చేరడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. రాయదుర్గం బయోడైవర్సిటీ నుంచి ఐకియా వరకు, ఖాజాగూడ చౌరస్తా నుంచి డీపీఎస్ వరకు వాహనాల రాకపోకలు స్తంభించాయి. పలుచోట్ల చెట్లు విరిగి పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షంతో పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షం, ఈదురుగాలులతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బంద్ అయింది. ఇదిలా ఉండగా నగరంలో కురిసిన భారీ వర్షంపై జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ సమీక్షించారు.

పిడుగుపడి వ్యక్తి మృతి

సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి మండల కేంద్రంలో పిడుగుపడి వ్యక్తి మృతిచెందాడు. చెందిన సంఘటన కుకునూర్‌పల్లి మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. కుమ్మరి మల్లేశం(33) బర్రెల పాల పితకడం కోసం వ్యవసాయ బావి దగ్గరకి వేళ్లగా అకస్మాత్తుగా ఉరుములు మెరుపులతో వర్షం పడింది. దాంతో మల్లేశం చెట్టుకిందకు వెళ్లాడు. చెట్టుపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆరుగాలం కష్టపడిన రైతులు వర్షం వల్ల ఆగమయ్యారు. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయింది.

రైతుల నోట్లో మట్టికొట్టాయి

బీజేపీ, బీఆర్ఎస్‌లపై కోమటిరెడ్డి ఆగ్రహం



(ఫైల్)

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్‌ల దుష్ట రాజకీయ పన్నాగాలకు రైతులు బలవుతున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. అసలే వర్షాలు లేకపోవడంతో రైతులు తీవ్రమైన బాధలో ఉన్నారని తెలిపారు. స్వార్థరాజకీయాల కోసం ఆ పార్టీలు రైతుల నోటికాడ బుక్కను లాక్కున్నాయని విమర్శించారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఖజానాలో రూపాయి లేకుండా చేసిందని విమర్శించారు. రూపాయి రూపాయి కూడబెట్టి తమ ప్రభుత్వం రైతుభరోసా (రైతుబంధు) వేస్తే, బీజేపీ కుటిల రాజకీయం చేసి అడ్డుకున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన సమయానికి రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసిందని గుర్తు చేశారు. రైతులంతా తమ అకౌంట్లలో డబ్బులు పడుతున్నాయని సంతోషపడే లోపే... ఈసీని అస్త్రంగా చేసుకుని నిధులను ఆపేలా కుట్ర చేసిందని పేర్కొన్నారు. మొదటి నుంచి బీజేపీకి అన్నదాతలు అంటే అక్కసు, ఆగ్రహం... అందుకే నల్ల చట్టాలు తెచ్చి రైతులను నట్టేట ముంచే ప్రయత్నం చేసిందని గుర్తు చేశారు. ఆ చటాలకు వ్యతిరేకంగా పోరాడిన వందలాది రైతులను పొట్టన పెట్టుకుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పుడు బీజేపీ తన గుప్పిట్లో ఉన్న ఈసీని అడ్డం పెట్టుకొని బ్యాంక్ ఖాతాలో పడ్డ రైతుభరోసా సొమ్ములను కూడా నిలిపి వేసిందని పేర్కొన్నారు. ఇంత కంటే దారుణం ఎక్కడా ఉండబోదని తెలిపారు. రెండు పార్టీలకు రైతులే తగిన గుణపాఠం చెప్పాలని విజ్ఞప్తి చేశారు.

మైనార్టీలో హర్యానా సర్కార్

- ముగ్గురు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేల మద్దతు వాపసు
- సీఎం సైనీ రాజీనామాకు కాంగ్రెస్ డిమాండ్

ఛండీగఢ్ : ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాలను 'ఆపరేషన్ లోటస్' ద్వారా కూల్చే బిజెపికి హర్యానాలో షాక్ తగిలింది. బిజెపి ప్రభుత్వానికి తమ మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు మంగళవారం ప్రకటించారు. దీంతో నయాబ్ సింగ్ సైనీ ప్రభుత్వం మైనార్టీలో పడింది. మరో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు మద్దతు తెలుపుతున్నా మెజార్టీకి ఇంకా రెండు స్థానాలు తక్కువగా ఉండడం తో సైనీ ప్రభుత్వం అధికారంలో కొనసాగే అర్హతను కోల్పోయింది. మార్చిలో జననాయక్ జనతా పార్టీ (జెజెపి) సంకీర్ణ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్నా ఆ పార్టీలోని కొంతమంది మద్దతు తెలుపుతుండటం తో బిజెపి ప్రభుత్వం ఇన్నాళ్లూ నెట్టుకొచ్చింది. తాజాగా ముగ్గురు ఎమ్మెల్యేలు సోంబిర్ సంగ్వాన్ (దాద్రీ), రణధీర్ సింగ్ గొల్లెన్ (పుండ్రి), ధరంపాల్ గోండర్ (నీలోఖేరి) ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు.ఈ మేరకు గవర్నర్‌కు లేఖ పంపినట్లు తెలిపారు. మైనార్టీలో పడిన సైనీ ప్రభుత్వం తక్షణమే రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. రాష్ట్రపతిపాలన విధించి అసెంబ్లీకి తిరిగి ఎన్నికలు నిర్వహించాలని కోరింది. హర్యానా అసెంబ్లీలో 90 స్థానాలు ఉండగా, ప్రస్తుతం 88 మంది సభ్యులు ఉన్నారు.. బిజెపికి 40, కాంగ్రెస్‌కు 30, జెజెపికి 10 మంది ఉన్నారు. మిగతావారు ఇండిపెం డెంట్లు. ఈ ఏడాది అక్టోబర్‌లో హర్యానా అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.



మూడో దశలో 63 శాతం పోలింగ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికలకు మూడో విడత పోలింగ్ 63 శాతం జరిగింది. మంగళవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకూ జరిగింది. 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 93 స్థానాలకు పోలింగ్ జరిగింది. అత్యధికంగా అసోం(4)లో 75.26 శాతం, గోవా(2)లో 74.27 శాతం, పశ్చిమ బెంగాల్(4)లో 73.93 శాతం పోలింగ్ జరిగింది. కర్నాటక (14)లో 67.76 శాతం, ఛత్తీస్‌గఢ్ (7)లో 66.99 శాతం, దాద్రా నగర్ హవేలీ, డామాన్ డయ్యూ (2)లో 65.23 శాతం, మధ్యప్రదేశ్ (9)లో 63.09 శాతం, ఉత్తరప్రదేశ్ (10)లో 57.34 శాతం, గుజరాత్ (25)లో 56.76 శాతం, బీహార్ (5)లో 56.55 శాతం, మహారాష్ట్ర (11)లో 54.77 శాతం పోలింగ్ జరిగింది.

బూత్‌లోకి రానీయకుండా..

మరోవైపు పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో టీఎంసీ కార్యకర్తలు ఓటర్లను బూత్‌లోకి రాకుండా అడ్డుకున్నారని సీపీఐ(ఎం) అభ్యర్థి, రాష్ట్ర కార్యదర్శి ఎండి సలీం ఆరోపించారు. రాణినగర్ ప్రాంతంలోని బూత్‌లోకి ప్రవేశించకుండా టీఎంసీ కార్యకర్తలు ఓటర్లను అడ్డుకున్నారని పేర్కొంటూ ఎన్నికల కమిషన్‌కు సలీం ఫిర్యాదు చేశారు. ఒక బూత్‌లో, నకిలీ టీఎంసీ ఏజెంట్‌ను సలీం గుర్తించారు. తరువాత ఏజెంటును పోలీసులు అరెస్టు చేశారు."నాకు రాష్ట్ర పోలీసులపై నమ్మకం లేదు. ఓటర్లకు సహాయం చేయడానికి నేను అదనపు ఎస్పీకి ఫిర్యాదు చేశా. ఓటర్లను పోలింగ్ బూత్‌లలోకి రాకుండా అడ్డుకునే అవాంఛనీయ వ్యక్తులను పట్టుకుంటా" అని ఆయన విలేకరులతో అన్నారు. టీఎంసీ కార్యకర్తలు ఓటర్లను బెదిరిస్తున్నారని ఆయన అన్నారు. అలాగే ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురి లోక్‌సభ నియోజకవర్గంలో



బూత్‌లను దోచుకునేందుకు బీజేపీ కార్యకర్తలు ప్రయత్నించారని, ప్రతిపక్ష పార్టీలకు చెందిన వ్యక్తులను పోలీసు స్టేషన్‌లలో నిర్బంధించారని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. తన భార్య, సిట్టింగ్ ఎంపీ డింపుల్ యాదవ్ పోటీలో ఉన్న మెయిన్‌పురి నియోజకవర్గానికి సైఫాయ్ (ఇటావా)లో ఓటు వేసిన యాదవ్, కొన్ని చోట్ల ఓట్లు రిగ్గింగ్ జరిగినట్లు ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లో ఎన్నికలు నిష్పాక్షికంగా జరిగేందుకు తాము ప్రయత్నిస్తున్నామని కాంగ్రెస్ నేత దిగ్విజయ్ సింగ్ అన్నారు. ఎక్కడైతే బోగస్ ఓటింగ్ జరిగిందో అక్కడ తమ కార్యకర్తలు అడ్డుకుంటారని చెప్పారు. మెషీన్ (ఈవీఎం) ఏదైనా మెషీన్ అని, తానెప్పుడూ ఈవీఎంలకు వ్యతిరేకమని స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌లోని రాజ్‌ఘఢ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈవీఎంలో మీ ఓటు ఎటు వెళ్లిందో మీరు చూడలేరని అన్నారు. వీవీప్యాట్ మెషీన్‌లో సాఫ్ట్‌వేర్ ఉంటుందని, అసలు ఏం జరగాలనేది ఆ సాఫ్ట్‌వేర్ నిర్ణయిస్తుందని దిగ్విజయ్ పేర్కొన్నారు. మనం ఏం చేసినా సాఫ్ట్‌వేర్ తాను కోరుకున్నదే ప్రింట్ చేస్తుంది..దాన్నే ఎన్నికల అధికారులు కౌంట్ చేస్తారని దిగ్విజయ్ సింగ్ వ్యాఖ్యానించారు.

మూడో విడత పోలింగ్ సందర్భంగా ప్రధాని మోడీ పోలింగ్ ప్రారంభమైన తొలి గంటలోనే ఓటు వేశారు. గుజరాత్ రాష్ట్రం గాంధీనగర్ పరిధిలోని అహ్మదాబాద్‌లో ఉన్న నిషాన్ హైస్కూల్‌లో ప్రధాని మోడీ తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదేవిధంగా కేంద్ర హెూం శాఖ మంత్రి, గాంధీనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అమిత్ షా సైతం తన కుటుంబంతో కలిసి అహ్మదాబాద్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. సతీమణి సోనాల్ షా, కుమారుడు, బీసీసీఐ కార్యదర్శి జైషా ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ఓటేశారు.

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ విదిశ లోక్‌సభ అభ్యర్థి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర మంత్రులు మన్‌సుఖ్ మాండవీయ, ప్రహ్లాద్ జోషీ, జ్యోతిరాదిత్య సింధియా, బారామతి ఎంపీ అభ్యర్థులు సుప్రియా సూలే, సునేత్ర పవార్, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్, ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్, కర్నాటక మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప తదితరులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో అదానీ గ్రూపు చైర్మెన్ గౌతమ్ అదానీ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహమ్మద్‌పురా ప్రైమరీ స్కూల్‌లో ఉన్న పోలింగ్ బూత్‌లో ఆయన ఓటేశారు. యాక్టర్స్ రితీశ్ దేశ్‌ముఖ్, జెనీలియా మహారాష్ట్రలోని లాతూర్ లో ఓటు వేశారు.

కర్నాటక బీజేపీ పోస్టును తొలగించండి

ఎక్స్‌కు ఎన్నికల కమిషన్ ఆదేశం



న్యూఢిల్లీ : కర్నాటక బీజేపీ అధికారిక ఖాతాలో పోస్టు చేసిన ఒక వీడియోను వెంటనే తొలగించాలని సోషల్ మీడియా వేదిక ఎక్స్‌ను భారత ఎన్నికల కమిషన్ మంగళవారం ఆదేశించింది. ఈ మేరకు దేశంలోని ఎక్స్ నోడల్ అధికారికి ఒక నోటీసును పంపించింది. ఈ వీడియోపై కాంగ్రెస్ ఫిర్యాదు చేయడంతో ఎన్నికల కమిషన్ ఈ నిర్ణయం తీసుకుంది. ఎక్స్‌కు తాము పంపిన నోటీసును ఎన్నికల కమిషన్ తన అధికారిక వైబ్‌సైట్‌లో ఉంచింది. కాంగ్రెస్ ముస్లింలకు అనుకూలంగా ఉంటుందనే, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు చెందిన నిధులను ముస్లింలకు కాంగ్రెస్ మళ్లిస్తుందని అర్థం వచ్చేలా ఈ వీడియాను బిజెపి తయారుచేసింది. ఈ వీడియోలో కాంగ్రెస్ నాయకులు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ వ్యంగ్య చిత్రాలు కూడా ఉన్నాయి. ఈ వీడియో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించేవిధంగా ఉందని కాంగ్రెస్ ఈ నెల 5న ఫిర్యాదు చేసింది.

దేశద్రోహులుగా పిలుస్తారని గాంధీ, నెహ్రూలు ఊహించలేదు

ప్రియాంక గాంధీ

రాయ్‌బరేలీ : జాతిపిత మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ తమను దేశద్రోహులుగా పిలుస్తారని ఊహించలేదని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ అన్నారు. రాయ్‌బరేలీలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ.. 'గాంధీ, నెహ్రూలిద్దరూ దేశ ప్రజల హక్కులను బలోపేతం చేసేందుకు ఉద్యమాలు చేశారు. అయితే దేశంలో తమను దేశ ద్రోహులుగా పిలిచే ప్రభుత్వం వస్తుందని వారు ఊహించలేదు.' అని ఆమె అన్నారు. ఈ ప్రచారంలో ప్రియాంక రైతుల నిరసనల్ని కూడా ప్రస్తావించారు. బ్రిటీష్ రాజ్ సమయంలో జరిగిన రైతు నిరసనల్లో మోతీలాల్ నెహ్రూ, గాంధీలను మొదటిసారి అరెస్ట్ చేశారని గుర్తు చేశారు. అప్పటి నుంచి రాయ్‌బరేలీలో ఓవైపు ప్రజాస్వామ్యం, మరోవైపు ఉగ్రవాదం తరహా రాజకీయాలు ఉన్నాయి. ఈ పోరాటంలో ఎల్లప్పుడూ సత్యం, ప్రజాస్వామ్య సూత్రాలకు మీరు విజయాన్ని అందించారని కాంగ్రెస్ కార్యకర్తలనుద్దేశించి అన్నారు. కాగా రాయ్‌బరేలీ నుంచి రాహుల్‌గాంధీ పోటీ చేస్తున్నారు. ఇక్కడ మే 20న ఎన్నికలు జరగనున్నాయి.

ఒకేసారి ఓటేసిన 96 మంది కుటుంబసభ్యులు

బెంగళూరు : లోక్‌సభ ఎన్నికల మూడో విడత పోలింగ్ సందర్భంగా కర్నాటకలో మంగళవారం ఒకే కుటుంబానికి చెందిన 96 మంది కలిసి వచ్చి ఓటేశారు. హుబ్బళి-ధార్వాడ్ స్థానానికి జరిగిన ఎన్నికల్లో నూల్వి గ్రామానికి చెందిన కంటెప్ప తోతాడ కుటుంబం ఒకేసారి పోలింగ్ కేంద్రానికి తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం పోలింగ్ కేంద్రం వద్ద సెల్ఫీలు, ఫొటోలు దిగి సందడి చేశారు. మూడు తరాలకు చెందిన ఆ కుటుంబ ఓటర్లు ప్రతి ఎన్నికలోనూ ఇలాగే ఓటు వేస్తుంటారు. కాగా అసోంలోని దిబ్రూఘాట్‌కు చెందిన ఓటర్లు పడవల్లో వచ్చి ఓటేశారు.

ఇదేనా మహిళలకు ఇచ్చే గౌరవం?

• నేరస్తులకు అండగా నిలుస్తున్న బీజేపీ, సంఘ్ సంస్థలు • మోడీ పాలనలో పెరిగిన నేరాలు, హింస

న్యూఢిల్లీ : మహిళాభ్యున్నతికి పెద్దపీట వేస్తానంటూ బీజేపీ ఇచ్చిన హామీలు గాలిలో కలిసిపోయాయి. నిజానికి ప్రధాని మోడీ పాలనలో మహిళలపై హింస మరింతగా పెరిగిపోయింది. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్, నేషనల్ ఎలక్షన్ వాచ్ సంస్థలు ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం మహిళలపై నేరాలకు సంబంధించిన 134 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు కేసులు ఎదుర్కొంటున్నారు. వీరిలో బీజేపీ ప్రజాప్రతినిధుల సంఖ్యే అధికంగా (44) ఉంది. అత్యాచారాలు, వేధింపులు వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి రక్షణ కల్పించడంలో బీజేపీ ఏ మాత్రం వెనుకంజ వేయడం లేదు. బీజేపీ వెబ్‌సైట్ చూస్తే అందులో నారీశక్తి ప్రస్తావన పదేపదే కన్పిస్తుంది. మహిళలపై వివక్షను తొలగించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతుంది. బాలికలపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఉద్బోధిస్తుంది. కానీ ఇవి మాటలకే పరిమితం... బీజేపీ నేతలు తరచుగా తమ మహిళా సహచరులను కించపరిచే వ్యాఖ్యలతో నొప్పిస్తుంటారు. ప్రతిపక్షంలో ఉన్న మహిళా నేతలను కూడా వారు వదిలిపెట్టరు.

ప్రధాని సైతం...

సాక్షాత్తూ ప్రధాని మోడీ 2018లో రాజ్యసభ ఎంపీ సోనియాగాంధీని ఉద్దేశించి 'వితంతువు' అని సంబోధించారు. రాజకీయ నాయకుల కుటుంబాలను కూడా ఆయన వదలలేదు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్‌కు చెందిన త్రివేండ్రం ఎంపీ శశిథరూర్ భార్య సునందా పుష్కర్‌ను 'యాభై కోట్ల రూపాయల గర్ల్ ఫ్రెండ్' అంటూ కించపరిచారు. దేశంలో మహిళలపై నేరాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. 2021లో 60 లక్షల నేరాలు నమోదు కాగా వాటిలో 4,28,278 కేసులు మహిళలపై నేరాలకు సంబంధించినవే. 2016లో ఈ తరహా నేరాలు 3,38,954 నమోదయ్యాయి. అంటే ఆరు సంవత్సరాల వ్యవధిలో మహిళలపై నేరాల కేసులు 26.35 శాతం పెరిగాయి. అదేవిధంగా జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్సీఆర్‌బీ) తెలిపిన వివరాల ప్రకారం 2015-2020 మధ్యకాలంలో దళిత మహిళలపై



లైంగికదాడుల కేసుల సంఖ్య 45 శాతం పెరిగింది. దీనిని బట్టి చూస్తే ప్రతి రోజూ దేశంలో దళిత మహిళలు, బాలికలపై అత్యాచారాలకు సంబంధించి 10 కేసులు నమోదవుతున్నాయి. ఈ అకృత్యాలలో బీజేపీ, దాని మిత్రపక్షాల నాయకుల పాత్ర ఎంత?

తలవంపులు తెచ్చిన హత్రాస్ ఘటన

మహిళలపై అఘాయిత్యాలు, లైంగికదాడులు జరుగుతున్నప్పటికీ బీజేపీ స్పందన అంతంతమాత్రంగానే ఉంటోంది. ఉత్తరప్రదేశ్‌లో ఓ దళిత యువతిపై లైంగికదాడి, హత్యకు సంబంధించిన హత్రాస్ కేసులో ఆ పార్టీ వైఖరి దీనికి అద్దం పడుతోంది. 2020లో దళిత బాలికపై అగ్రకుల ఠాకూర్ వర్గానికి చెందిన నలుగురు కామాంధులు దాడి చేసి చిత్రహింసలు పెట్టారు. ఈ ఘటన వెలుగులోకి వచ్చిన తర్వాత ఆ బాలిక కుటుంబసభ్యులకు బెదిరింపులు అధికమయ్యాయి. చివరికి ఆమె మృతదేహాన్ని దహనం చేసేందుకు కూడా కుటుంబసభ్యులను అనుమతించలేదు. రాత్రికి రాత్రే ఆ మృతదేహాన్ని పోలీసులు బలవంతంగా దహనం చేశారు.

కేసు విచారణ సమయంలో సాక్షులను కూడా బెదిరించారు. భయపెట్టారు. చివరికి కేసులో ఒకే ఒక వ్యక్తికి శిక్ష పడింది. నలుగురు నిర్దోషులుగా బయటపడ్డారు. చనిపోవడానికి ముందు ఆ బాలిక మెజిస్ట్రేట్ ఎదుట నలుగురు కామాంధులకు వ్యతిరేకంగా మరణ వాంగ్మూలం ఇచ్చినప్పటికీ ఫలితం లేకపోయింది. హత్రాస్ ఘటనపై వార్తలు అందించేందుకు ఇద్దరు పాత్రికేయులు, ఒక ట్యాక్సీ డ్రైవర్ సహా ముగ్గురు ముస్లింలు ప్రయ త్నించగా వారిని అరెస్ట్ చేసి మూడు సంవత్సరాల పాటు జైలులో ఉంచారు.

పైగా ఈ ఉదంతాన్ని మసిపూసి మారేడుకాయ చేసేందుకు యోగి ఆదిత్యానాథ్ ప్రభుత్వం ప్రయత్నించింది. అసలు దళిత బాలికపై అత్యాచారమే జరగలేదని విదేశీ మీడియాలో కథనాలు వచ్చేలా ప్రజాసంబంధాల సంస్థలను ఉపయోగించుకుంది. మొత్తంమీద హత్రాస్ ఘటన దేశానికే తలవంపులు తెచ్చింది.

కామాంధులకు అండ దండ

2002లో గుజరాత్‌లో జరిగిన మారణహోమం సందర్భంగా జరిగిన బిల్కిస్ బానో కేసును గుర్తుకు తెచ్చుకుందాం. బిల్కిస్‌పై పైశాచికంగా అత్యాచారం జరిపిన కామాంధులకు న్యాయస్థానం జైలుశిక్ష విధించగా, గుజరాత్‌లోని బీజేపీ ప్రభుత్వం వారికి క్షమాభిక్ష ప్రసాదించి విడుదల చేసింది. అయితే సుప్రీంకోర్టు ఈ నిర్ణయాన్ని కొట్టివేసింది. దీనికి ముందు జైలు నుండి విడుదలైన రేపిస్టులకు వీహెచ్‌పీ పూలదండలు, మిఠాయిలతో స్వాగతం పలికింది. గత సంవత్సరం గుజరాత్‌లో ఈ దుండగులు బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేతో కలిసి ఒకే వేదికను పంచుకున్నారు. గర్భవతిగా ఉన్నప్పుడు బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారం జరిపారు. మూడు సంవత్సరాల కుమార్తె సహా ఆమె కుటుంబంలోని ఏడుగురు సభ్యులను హతమార్చారు. బిల్కిస్ బానో ఉదంతాన్ని పరిశీలిస్తే అత్యాచారాలకు పాల్పడిన వారికి బీజేపీ, సంఘ్ పరివార్ ఏ విధంగా కొమ్ము కాస్తున్నాయో అర్థమవుతుంది.

వీరంతా ఎన్డీఏ నాయకులే

ఇటీవల కర్నాటకలో రాజకీయ ప్రకంపనలు రేపిన ఉదంతాన్ని తీసుకుందాం. ఎన్డీఏ భాగస్వామ్యపక్షమైన జేడీఎస్‌కు చెందిన సిట్టింగ్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలలకు సంబంధించి మూడు వేల వీడియో టేపులు బయటపడ్డాయి. ఈ వ్యవహారంపై పెద్ద ఎత్తున దుమారం రేగడంతో అయన దేశాన్ని విడిచి పారిపోయారు.ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ సహా పలువురు బీజేపీ నేతలపై కూడా లైంగిక వేధింపుల ఆరోపణలు ఉన్నాయి. ఆ పార్టీ నాయకులు కుల్దీప్ సింగ్ సెంగర్, రాందులార్ గోండ్ ప్రస్తుతం కారాగారంలో ఉన్నారు.

నేతల ఒడిలో కూర్చుంటే ప్రజాస్వామ్యం ఉండదు

'గోదీ మీడియా' లక్ష్యంగా కాంగ్రెస్ వీడియో

న్యూఢిల్లీ : రిపబ్లికన్ టీవీ అధినేత అర్నబ్ గోస్వామి తన టీవీ షోలలో ప్రధాని నరేంద్ర మోడీపై అపరిమితమైన స్వామిభక్తిని ప్రదర్శిస్తుంటారు. అదే సమయంలో ప్రతిపక్షాలపై దుమ్మెత్తి పోస్తుంటారు. ఈ నేపథ్యంలో గోస్వామి షోలపై కాంగ్రెస్ పార్టీ ఓ వ్యంగ్య వీడియోను రూపొందించింది. ఇద్దరు రాజకీయ నాయకుల పక్కన కూర్చొని ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించిన రిపబ్లికన్ టీవీ అధినేత అర్నబ్ గోస్వామిని అందులో అనుకరించింది. వాస్తవానికి ప్రసారం చివరలో కెమేరాను జూమ్ అవుట్ చేసినప్పుడు గోస్వామి ఆ రాజకీయ నాయకుల పక్కన కాకుండా వారి ఒడిలో కూర్చున్నట్లు కన్పించింది. రాజకీయ నాయకుల ఒడిలో మీడియా కూర్చుంటే రాజ్యాంగం ఉండదు...ప్రజస్వామ్యమూ ఉండదు అంటూ కాంగ్రెస్ వీడియో ప్రకటన చివరలో ఓ వ్యాఖ్య విన్పిస్తుంది.

'పాపా నే వార్ రుక్వే ది' అనే కాంగ్రెస్ వీడియో ప్రకటన బీజేపీని బాగా ట్రోల్ చేసింది. ఉక్రెయిన్, రష్యా యుద్ధాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ఆపేశారని అందులో ఓ మహిళ తన తండ్రికి చెబుతుంది. ధరల పెరుగుదల వంటి అంశాలకు మీడియా అతిగా ప్రాధాన్యత ఇస్తోందని ఆ ప్రకటనలో విమర్శించారు. ప్రధాని మోడీని ఉద్దేశించి యాంకర్ మాట్లాడుతూ 'ఈ దేశానికి సాహెబ్ ఇచ్చిన దిశ జాతికి తెలుసు' అని వ్యాఖ్యానించారు. డీజిల్, పెట్రోల్ ధరలు బాగా తగ్గిపోయాయని, ప్రజలు నీటికి బదులు వాటినే వాడుతున్నారని కూడా యాంకర్ సెలవిచ్చారు. పాలు, కూరగాయలు కొనుగోలు చేయడానికి కొంచెం డబ్బు ఉంటే చాలునని కూడా ఆయన చెప్పారు.

యాంకర్ అంతటితో ఆగలేదు... విదేశాలకు వెళ్లాలంటే వీసా అవసరం లేదని, భారతీయ పాస్‌పోర్టు ఉంటే సరిపోతుందని, రూపాయి విలువ ఆకాశాన్ని తాకిందని, ఎంతగా అంటే దానిని కిందికి దించాలంటే రాకెట్‌ను ప్రయోగించాల్సిందేనని చెప్పుకొచ్చారు. అతిశయోక్తులతో కూడిన 58 సెకన్ల నిడివి కలిగిన ఈ వీడియో చిత్రీకరణ పూర్తయిన తర్వాత స్టూడియోలో సెట్‌ను తీసివేసే సమయంలో కెమేరా జూమ్ అవుట్ అవుతుంది. ఇద్దరు రాజకీయ నాయకుల ఒడిలో యాంకర్ కూర్చొని ఉన్నట్లు కన్పిస్తుంది. ఆ యాంకర్ వారిని పదేపదే 'నాకు టిప్ ఇవ్వండి' అని అడుగుతారు. వారు అతనికి రెండు లాలీపాప్‌లు ఇస్తారు. 'నాకు డ్రగ్స్ ఇవ్వండి' అనే గోస్వామి కార్యక్రమాన్ని అనుకరిస్తూ ఈ వీడియోను రూపొందించారు.

ఈ సంవత్సరం ఫిబ్రవరి 1, ఏప్రిల్ 12 తేదీల మధ్య అర్నబ్ గోస్వామి రిపబ్లిక్ వరల్డ్ షోలో 137 చర్చా కార్యక్రమాలు నిర్వహించారు. వీటిలో 73 కార్యక్రమాలు ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా రూపొందించినవని, 32 ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నాయని 'న్యూస్‌లాండ్రీ' పోర్టల్ సర్వేలో తేలింది.

కావల్సినంత కరెంటు ఉంది

- విద్యుత్ ఉద్యోగులు భేషుగ్గా పనిచేస్తున్నారు : ఉపముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్క

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కావాల్సినంత కరెంటు అందుబాటులో ఉందని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. డిమాండ్ ఎంత పెరిగినా సరఫరా చేసేందుకు విద్యుత్‌శాఖ ఉద్యోగులు చిత్తశుద్ధితో, క్రమశిక్షణగా పనిచేస్తున్నారని చెప్పారు. ఉష్ణోగ్రతల్లో మార్పు వల్ల విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరుగుతున్నదనీ, గత ఏడాదితో పోల్చినప్పుడు ఇప్పుడు 52.9 శాతం పెరుగుదల నమోదయ్యిందని వివరించారు. ఈ మేరకు మంగళవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత ఏడాది మే నెలలో సరాసరి విద్యుత్ డిమాండ్ 7,062 మెగావాట్లు కాగా, ఈ ఏడాది మే నెలలో 10,799 మెగావాట్లకు పెరిగిందని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే 47.6 శాతం పెరుగుదల నమోదయ్యిందన్నారు. ప్రజల విద్యుత్ అవసరాలు తీర్చేందుకు నిరంతరం పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగుల్ని అభినందించాల్సిన ప్రతిపక్షాలు, కరెంటు కోతలంటూ తప్పుడు ప్రచారంతో రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతులు రోడ్లెక్కి ధర్నాలు చేసిన రోజులు గుర్తుచేసుకోవాలనీ, దీనిపై అప్పటి టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు అప్పటి ప్రభుత్వ తీరును ఆక్షేపించిన విషయం గమనంలో ఉంచుకోవాలని అన్నారు. ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరనీ, 24 గంటల నిరంతర విద్యుత్‌ను వినియోగించుకుంటున్న విషయం వారికి అనుభవంలో ఉన్నదని చెప్పారు.

ఓటర్ల చైతన్యానికి పోస్టల్ సిబ్బంది కృషి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లను చైతన్యవంతం చేస్తూ, ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తూ పోస్టల్‌శాఖ ఉద్యోగులు వివిధ రూపాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం హైదరాబాద్ చార్మినార్ వద్ద పోస్టల్ ఉద్యోగులు ఓటు హక్కు వినియోగ అవసరాన్ని తెలుపుతూ బ్యానర్లు పట్టుకొని, ప్రజల దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేశారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ సహకారంతో రాష్ట్రంలోని 6,266 పోస్టాఫీసుల్లో ఓటుహక్కు ప్రాధాన్యతను వివరిస్తూ బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. 'చునావ్ కా పర్వ్...దేశ్ కా గర్వ్' స్లోగన్‌తో రోజూ 3.8 లక్షల ఉత్తరాలను బట్వాడా చేస్తున్నట్టు తెలంగాణ పోస్టల్ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ ఎస్ రంగారావు తెలిపారు. 2024 ఫిబ్రవరి వరకు 13.82 లక్షల ఓటర్ గుర్తింపు కార్డుల్ని బట్వాడా చేశామన్నారు. వివిధ రూపాల్లో ఓటర్ల అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామనీ, మే 13వ తేదీ జరిగే పోలింగ్‌లో ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ఓటుహక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుంటేనే మనుగడ

- ప్రొఫెసర్ హరగోపాల్



నవతెలంగాణ - బంజారాహిల్స్

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుంటేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం చచ్చిపోయిందని, రాజ్యాంగాన్ని మార్చేందుకు మనువాద బీజేపీ ప్రయత్నాలు ముమ్మరం చేసిందని అన్నారు. అందుకే ఆ పార్టీ నేతలు 400 సీట్ల వేటలో పడి ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు.


తెలంగాణ జర్నలిస్టుల అధ్యయన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'భారత రాజ్యాంగం - హక్కులు-రిజర్వేషన్లు' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. అధ్యయన వేదిక ప్రధాన కార్యదర్శి సాదిక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హరగోపాల్ మాట్లాడారు. రాజ్యాంగాన్ని మార్చితే మధ్యయుగంలోకి వెళ్లే ప్రమాదం ఉందని, మానవ మనుగడే ప్రశ్నార్థకం అవుతుందని అన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే 2024 తర్వాత రాజ్యాంగాన్ని రక్షించుకునే ఉద్యమాలు చేయాల్సి వస్తుందని చెప్పారు. ప్రొఫెసర్ కాశిం మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యం సంక్షోభంలో ఉందన్నారు. గతంలో రాజ్యాంగానికి సవరణలు చేశారు తప్ప మార్చలేదని గుర్తు చేశారు. మోడీ వ్యామోహం చాలా ప్రమాదకరమని, యువత ఆలోచించాలని సూచించారు. రాజ్యాంగాన్ని, రాజ్యాంగ సంస్థలను రక్షించుకోవాలంటే బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు.

రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. ఢిల్లీ ప్రభుత్వం విద్యను పేద పిల్లలకు ఉచితంగా అందించడమే నేరమైందని.. ఏవో కారణాలతో కేజ్రీవాల్‌ను జైలులో పెట్టారని ఆరోపించారు. ప్రపంచ దేశాలు విద్య పైనే ఎక్కువ నిధులు ఖర్చు చేస్తే మన దేశంలో మాత్రం ఏటా నిధుల కోత విధిస్తున్నారని చెప్పారు. హిందూ సమాజాన్ని చీల్చినదే మనువాదులు అని విమర్శించారు. బీసీ నేత జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. మనువాదాన్ని అమలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని, రిజర్వేషన్లు కావాలంటే ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు రామచంద్రమూర్తి, జయసారథిరెడ్డి, కాంగ్రెస్ నేత సంగిశెట్టి దశరథ్, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, జనం సాక్షి ఎడిటర్ రెహమాన్, అధ్యయన వేదిక ఉపాధ్యక్షుడు జంగిటి వెంకటేష్, ట్రెజరర్ వేల్పుల సురేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ కంచె రాజు తదితరులు మాట్లాడారు.

రైతులకు ఊరట

భూముల నుంచి ఖాళీ చేయించొద్దు

- భూసేకరణ ప్రక్రియ చేసుకోవచ్చు
- ఆర్‌ఆర్‌ఆర్ రోడ్డు భూసేకరణపై హైకోర్టు



నవతెలంగాణ-హైదరాబాద్

రీజినల్ రింగ్ రోడ్(ఆర్‌ఆర్‌ఆర్) ఉత్తర భాగం నిర్మాణంలో భూమి కోల్పోతున్న పిటిషనర్లను వాళ్ల భూముల నుంచి ఖాళీ చేయించవద్దని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తాము తదుపరి ఆదేశాలిచ్చే వరకు భూముల నుంచి వారిని వెళ్లగొట్టొద్దని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ)ను ఆదేశించింది. భూసేకరణ ప్రక్రియను కొనసాగించుకోవచ్చని స్పష్టం చేసింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్ 14కు వాయిదా వేసింది. ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణంలో భాగంగా సిద్దిపేట్ జిల్లా గజ్వేల్ మండలం పాములపర్తిలో సర్వే నంబర్‌లో 263లో 14 ఎకరాల భూ యజమాని కట్ట ఆరులప్ప, మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామం సర్వే నంబర్ 375, 377, 336లోని 9.03 ఎకరాల భూమి మొత్తం పోతున్నదని శ్రీరాంరెడ్డి వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వాటిని న్యాయమూర్తి జస్టిస్ కాజా శరత్ విచారించారు. ఎన్‌హెచ్ 44, ఆర్‌ఆర్‌ఆర్ ఇంటర్ జంక్షన్‌ను దాదాపు 60 ఎకరాల్లో నిర్మిస్తున్నారు. దీని కోసం 2022, మే 25న 3ఏ నోటిఫికేషన్ ఇచ్చి 2023 ఆగస్టు 8న 3డీ ఎన్‌హెచ్‌ఏఐ నోటిఫికేషన్ జారీ చేసింది. దాదాపు 4,704.25 ఎకరాల్లో ఎన్‌హెచ్‌ఏఐ ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణం చేపట్టనుంది. ఇందులో దాదాపు 4,315.33 ఎకరాల ప్రయివేటు భూమిని సేకరించనున్నారు. మొత్తం భూ సేకరణలో ప్రయివేటు భూమి వాటా 91.73 శాతం ఉండగా ప్రభుత్వ భూమి ఐదు శాతం, అటవీ భూమి 3.27 శాతమని తెలిపారు. పిటిషనర్ల తరపున న్యాయవాది గౌరారం రాజశేఖర్‌రెడ్డి వాదనలు వినిపించారు. జాతీయ రహదారుల చట్టాన్ని పాటించడంలో పలు వ్యత్యాసాలు ఉన్నందున 3ఏ, 3డీ నోటిఫికేషన్‌ను కొట్టివేయాలని కోరారు. భూమి కోల్పోతున్న వారిని గుర్తించాలనీ, 3డీ నోటిఫికేషన్ కంటే ముందే రిహ్యాబిటేషన్ అండ్ రిసెటిల్‌మెంట్(ఆర్‌ఆర్) ప్యాకేజీ అమలు చేయాలని గుర్తుచేశారు. రోడ్లు, ప్రాజెక్టులకు భూసేకరణ ఉపశమనం, పునరావాస చట్టం 2013 అమలు కాదనీ, ఆర్‌ఆర్ ప్యాకేజీ ముందే అమలు చేయాల్సిన అవసరం లేదని ఎన్‌హెచ్‌ఏఐ న్యాయవాది వాదించారు. వాదనల తర్వాత హైకోర్టు, కేంద్ర రోడ్డు రవాణా శాఖ కార్యదర్శి, ఎన్‌హెచ్‌ఏఐ తదితరులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను వాయిదా వేసింది. ఈలోగా ప్రతివాదులు తమ వాదనలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

హాస్టల్స్‌లో వసతుల్ని కల్పించి చెప్పండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఉత్తర్వులు

ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో మరుగుదొడ్లు, బాత్ రూమ్స్, వంట గదుల్లో వసతులు వంటి ఇతర మౌలిక వసతులపై స్టేటస్ రిపోర్టు ఇవ్వాలని రాష్ట్రానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం పాఠశాలలకు వేసవి సెలవులు ఉన్నందున మౌలిక వసతుల కల్పన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఇందుకు ప్రభుత్వానికి జూన్ 10 వరకు సమయం ఇచ్చింది. అదే తేదీకి విచారణను వాయిదా వేస్తున్నట్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరథే, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటిలతో కూడిన డివిజన్ బెంచ్ ఇటీవల ఆదేశించింది. ప్రభుత్వ హాస్టళ్లలో బాలల హక్కుల పరిరక్షణ కోసం జాతీయ కమిషన్-2018 నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు సౌకర్యాలు అందించడం లేదనీ, 10 మందికి ఒక బాత్రూమ్, ఏడుగురికి ఒక మరుగుదొడ్డి, 50 మందికో వార్డెన్ ఉండాలన్న నిబంధనలు అమలు కావడం లేదంటూ హైదరాబాద్‌కు చెందిన కీర్తినేడి అఖిల్ శ్రీ గురుతేజ ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిని హైకోర్టు విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యాహక్కు, బాలల హక్కుల వంటి పలు చట్టాలతో పాటు రాజ్యాంగ నిబంధనల ప్రకారం విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ ప్రతివాదన చేస్తూ, ఇప్పుడు విద్యార్థులకు వేసవి సెలవులనీ, మౌలిక సమస్యలపై అధికారులు చర్యలు తీసుకుంటారని, గడువు ఇవ్వాలని కోరారు. ఇప్పటి వరకు విద్యార్థులు హాస్టళ్లలో ఉండటంతో నిర్మాణాలు, ఇతర పనులు చేయడానికి ఇబ్బంది అయ్యిందన్నారు. ఇప్పుడు వేసవి సెలవులు రావడంతో విద్యార్థులు హాస్టళ్ల నుంచి వెళ్లిపోయారని, సెలవులు జూన్ 11న ముగియనున్నాయని వివరించారు. దీంతో విచారణను జూన్ 10కి వాయిదా వేసిన హైకోర్టు, అప్పటిలోగా మౌలిక వసతుల కల్పన చర్యలు తీసుకుని వాటిని నివేదించాలంది.

పైగా ల్యాండ్స్ వివాదాన్ని కింది కోర్టు తేల్చాలి

సివిల్ కోర్టుకు హైకోర్టు ఆదేశం

పైగా భూముల వివాదంపై కింది కోర్టు జారీ చేసిన మధ్యంతర దరఖాస్తులను పరిష్కరించాలనీ, ఆ తర్వాతే తుదితీర్పు వెలువరించాలని హైకోర్టు స్పష్టం చేసింది. మధ్యంతర దరఖాస్తులను తొలుత పరిష్కరించాలనీ, ఆ తర్వాత ఇరుపక్షాల ఆధారాలను పరిశీలించి తగిన తుది ఉత్తర్వులు ఇవ్వాలంది. పైగా భూమి దస్తావేజుల రద్దుకు సంబంధించిన వివాదంలో వాదప్రతివాదుల ఆధారాలను, మధ్యంతర పిటిషన్లను పరిష్కరించకుండా కింది కోర్టు తుది తీర్పు చెప్పడానికి వీల్లేదని హైకోర్టు తేల్చి చెప్పింది. దస్తావేజును రద్దు చేస్తూ సివిల్ కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. ఈ వివాదాన్ని సివిల్ కోర్టుకే తిరిగి పంపుతూ ఉత్తర్వులు జారీ చేసిందిమధ్యంతర పిటిషన్లను పరిష్కరించకుండా కింది కోర్టు ఇచ్చిన తీర్పును సైరస్ ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన రెండో అప్పీల్ పిటిషన్లపై విచారణను ముగించింది. పైగా భూముల్లో కొంత భాగం నిజాం పేరుతో 1966 మేలో చేసిన విక్రయ దస్తావేజును రద్దు చేయాలంటూ బుగ్రీద్ జాహి పైగా వారసురాలిగా హమీదున్నీసా బేగం 12వ జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఆశ్రయించారు. 40 ఏండ్ల తరువాత దస్తావేజు రద్దు కోరడం సరికాదంటూ 2017లో వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. దీన్ని సవాల్ చేస్తూ హమీదున్నీసా బేగం సివిల్ కోర్టులోని 11వ అదనపు చీఫ్ సివిల్ జడ్జి వద్ద మొదట అప్పీలు దాఖలు చేశారు. ఆమె చనిపోవడంలో మహమ్మద్ మొయిజుద్దీన్ ఖాన్ వారసుడిగా వివాదాన్ని కొనసాగించారు. దీనిపై విచారించిన 11వ అదనపు చీఫ్ సివిల్ జడ్జి హమీదున్నీసా బేగం నిజాంకు చెందిన దస్తావేజులను రద్దు చేస్తూ, సైరస్ ఇన్వెస్ట్‌మెంట్స్ నిజాం చేసిన దస్తావేజులను రద్దు చేస్తూ గత ఏడాది డిసెంబర్ 7న తీర్పు వెలువరించింది. దీనిని సవాల్ చేస్తూ దాఖలైన రెండో అప్పీల్ పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాదే జస్టిస్ ఎన్.వి శ్రవణ్ కుమార్లతో కూడిన ధర్మాసనం ఇటీవల విచారణ జరిపింది. చట్ట ప్రకారం మూడేండ్లలోపు దస్తావేజులను రద్దు కోరవచ్చుననీ, ఏండ్ల సుదీర్ఘకాలం తర్వాత రద్దు చేయడం చెల్లదని పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది కెజి రాఘవన్ వాదించారు. హమీదున్నీసా నిజాం పేరుతో రిజిస్టర్ చేశారని, అయితే నిజాంను ప్రతివాదిగా చేర్చకుండా నిజాం నుంచి భూమి కొనుగోలు చేసిన సైరస్ ఇన్వెస్ట్మెంట్స్‌ను చేర్చడం సరికాదన్నారు. హమీదున్నీసా నిజాం పేరుతో చేసిన దస్తావేజులను గుర్తిస్తూ 1969లో హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఆ ఉత్తర్వులను రద్దు చేయకుండా దస్తావేజుల రద్దు చెల్లదన్నారు. హమీదున్నీసా వారసుడు మ్యుటేషన్‌ను తిరస్కరణకు గురికావడంతోపాటు ఇతర ఆధారాలను సమర్పించినా కింది కోర్టు పట్టించుకోలేదన్నారు తుది తీర్పులో మధ్యంతర పిటిషన్ల ప్రస్తావనే లేదన్నారు. కంపెనీ తరఫున ఆథరైజేషన్ ఉందని తెలిపారు. హమీదున్నీసా వారసుడి తరపు సీనియర్ న్యాయవాది ఎం. గురుస్వామి వాదనలు వినిపిస్తూ కంపెనీ తరపున అప్పీలు దాఖలు చేయడానికి పిఎస్ ప్రసాద్‌కు ఆథరైజేషన్ లేదని, ఈ కారణం మీదనే అప్పీలు విచారణార్హం కాదన్నారు. ఆథరైజేషన్ పోర్జరీదని అన్నారు. ముంబాయి హైకోర్టులో కంపెనీకి, పి ఎస్ ప్రసాద్‌కు కుదిరిన రాజీ వివరాలను వెల్లడించలేదన్నారు. ఇరుపక్షాలు సమర్పించిన ఆధారాలను పరిశీలించకుండా, మధ్యంతర దరఖాస్తులపై నిర్ణయం తీసుకోకుండా తుది తీర్పు వెలువరించిన కింది కోర్టు చర్యను తప్పుపట్టింది. మధ్యంతర పిటిషన్లను పరిష్కరించకుండా తుది తీర్పు చెప్పడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ వివాదాన్ని తిరిగి సివిల్ కోర్టుకే పంపుతున్నట్లు ప్రకటించింది. అప్పీళ్లపై విచారణను మూసేసింది.

ఎప్‌సెట్ రాతపరీక్షలు ప్రారంభం

- మొదటిరోజు ఉదయం 90.41, మధ్యాహ్నం 91.64 శాతం హాజరు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్) రాతపరీక్షలు ఆన్‌లైన్‌లో మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈనెల 11 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. మంగళవారం మొదటి రోజు అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం అభ్యర్థులకు రాతపరీక్షలను నిర్వహించారు. ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ కె విజయ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళవారం మొదటిరోజు ఉదయం విడతకు 33,500 మంది దరఖాస్తు చేయగా, 30,288 (90.41 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. 3,212 (9.59 శాతం) మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని వివరించారు. మధ్యాహ్నం రెండో విడతకు 33,505 మంది దరఖాస్తు చేస్తే, 30,704 (91.64 శాతం) మంది అభ్యర్థులు పరీక్ష రాశారని పేర్కొన్నారు. 2,801 (8.36 శాతం) మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. మంగళవారం ఉదయం ఎప్‌సెట్ ప్రవేశ పరీక్షకు సంబంధించిన పేపర్ కోడ్‌ను ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, జేఎన్టీయూ హైదరాబాద్ వీసీ కట్టా నర్సింహారెడ్డి, రిజిస్ట్రార్ కె వెంకటేశ్వరరావు విడుదల చేశారని పేర్కొన్నారు. మొదటిరోజు ఎప్‌సెట్ రాతపరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. ఎప్‌సెట్ రాతపరీక్షలు జరుగుతున్న తీరును వారు పర్యవేక్షించారు.

అన్ని పోలింగ్‌బూత్‌లలో వెబ్ కాస్టింగ్

- పోలింగ్ ఏర్పాట్లు పూర్తి
- హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్
- ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలి : హైదరాబాద్ సీపీ శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈనెల 13న పోలింగ్ నిర్వహణకు హైదరాబాద్ జిల్లాలో యంత్రాంగం అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉంది.. అన్ని పోలింగ్ బూత్‌లలో వెబ్ కాస్టింగ్ ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. పోలింగ్ నిర్వహణ ఏర్పాట్లపై మంగళవారం హైదరాబాద్ సీపీ శ్రీనివాస్‌రెడ్డి, హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు అనుదీప్ దురిశెట్టి, హేమంత్ కేశవ్‌పాటిల్‌తో కలిసి మీడియా ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. హైదరాబాద్ నియోజకవర్గానికి 30 మంది అభ్యర్థులు, సికింద్రాబాద్ నియోజకవర్గానికి 45 మంది అభ్యర్థులు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు. జిల్లాలో మొత్తం 45,91,201 మంది ఓటర్లు ఉన్నారని, అందులో 23,38,857 మంది పురుషులు, 22,52,008 మంది మహిళలు, 336 మంది థర్డ్ జెండర్ అని వివరించారు. జిల్లాలో 3986 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. అన్ని పోలింగ్ బూత్‌లలో వెబ్ కాస్టింగ్ చేస్తున్నట్టు చెప్పారు. 1250 మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను మైక్రో అబ్జర్వర్లుగా నియమించి శిక్షణ ఇచ్చామని తెలిపారు. ప్రతి పోలింగ్ బూత్‌లో మహిళా పోలింగ్ అధికారిని కేటాయించామని తెలిపారు. పోలింగ్ శాతం పెరిగేలా పెద్దఎత్తున స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

జిల్లాలో పోస్టల్ బ్యాలెట్‌కు 16,776 మంది దరఖాస్తు చేశారని, ఇప్పటివరకు 9,266 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని చెప్పారు. ఈనెల 8 నాటికి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోలేని వారి కోసం మే 9, 10వ తేదీలలో కూడా ఫెసిలిటేషన్ సెంటర్లు తెరిచే ఉంచుతారని చెప్పారు. ఓటర్ సమాచారం స్లిప్పులను, ఓటర్ గైడ్ సమాచారం బుక్‌లెట్‌ను పంపిణీ చేయడంతోపాటు ఇంటింటికీ స్టిక్కర్ వేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.38,55,72,637, ఇతర విలువైన వస్తువులు, మద్యాన్ని పట్టుకుని సీజ్ చేసామని తెలిపారు. అందులో ఇప్పటివరకు డీజీసీ ద్వారా 4,12,03,655/- నగదు, ఇతర వస్తువులు విడుదల చేసినట్టు చెప్పారు. రూ.1,52,64,160/- నగదు, ఇతర వస్తువులకు ఆదాయపన్ను, కమర్షియల్ టాక్స్ శాఖలకు తదుపరి చర్యలకు పంపినట్టు చెప్పారు.

హైదరాబాద్ సీపీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. డీఆర్‌సీ, స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ సెంటర్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని, మే 11న సాయంత్రం 5:00 గంటల నుంచి ప్రచార కార్యక్రమాలు నిషేధమని తెలిపారు. ఎన్నికలు ముగిసే వరకు జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని, ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం పోలింగ్ తేదీ తెలిపే ఓటరు స్టిక్కర్, ఐ ఓట్ ఫర్ షూర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అదనపు కమిషనర్ అలివేలు మంగతాయారు, హెూం ఓటింగ్ నోడల్ అధికారి డిప్యూటీ కలెక్టర్ అర్చన తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజలతో బలమైన బంధం

- రాష్ట్రంలో బీజేపీకే అధిక సీట్లు : మాజీ గవర్నర్,బీజేపీ నేత తమిళి సై సౌందర రాజన్





నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ప్రజలతో తనకు బలమైన బంధముందని మాజీ గవర్నర్, బీజేపీ నేత తమిళి సై సౌందర రాజన్ అన్నారు. రాష్ట్రంలో బీజేపీకి అధిక ఎంపీ సీట్లు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. దక్షిణ భారతదేశం ముఖద్వారమైన తెలంగాణ అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోడీ కట్టుబడి ఉన్నారనీ, అందుకే ప్రధానిగా 22 సార్లు ఇక్కడ పర్యటించారని తెలిపారు. రాష్ట్రంలో తప్పుడు వాగ్దానాలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. మహిళలకు ఇస్తామన్న రూ.2,500 ఏమైందని ప్రశ్నించారు. ఆగస్టు 15 లోపు రైతులకు రుణమాఫీ చేస్తానంటున్న రేవంత్‌రెడ్డి ఆ ఆదాయం ఎక్కడ నుంచి వస్తుందో చెప్పకపోవడం సరిగాదన్నారు. కేటీఆర్, సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు మహిళలను కించపరిచేలా ఉందని తప్పుబట్టారు. టీఆర్ఎస్‌గా ఉన్నప్పుడు ఆ పార్టీ బలంగా ఉండేదనీ, బీఆర్ఎస్‌గా మారిన తర్వాత వీక్‌గా మారిందని చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ గవర్నర్‌కు ఇవ్వాల్సిన కనీస గౌరవం ఇవ్వలేదనీ, ప్రోటోకాల్ పాటించలేదని విమర్శించారు. అభివృద్ధిపై తనతో కనీసం చర్చించేవారు కాదన్నారు. తెలంగాణలో మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాల ద్వారా కోట్లాది మంది లబ్ధిపొందారని వివరించారు. మైనార్టీల సంక్షేమం కోసం కూడా ఎంతో చేసిందన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం కోసం పోటాపోటీ

- రేసులో కాసం వెంకటేశ్వర్లు యాదవ్, ప్రకాశ్‌రెడ్డి, ప్రేమేందర్‌రెడ్డి
- తేల్చలేక బీజేపీ రాష్ట్ర నాయకత్వం మల్లగుల్లాలు
- జాతీయ నాయకత్వం కోర్టులో బంతి
- నామినేషన్లకు రేపే చివరి తేదీ





నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వరంగల్-నల్లగొండ-ఖమ్మం పట్టభద్రుల ఉప ఎన్నికలో పోటీచేసేందుకు బీజేపీలో పోటీ నెలకొంది. రేసులో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కాసం వెంకటేశ్వర్లు, జి.ప్రేమేందర్‌రెడ్డి, కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి రేసులో ఉన్నారు. పార్టీకి చేస్తున్న సేవలను పరిగణనలోకి తీసుకుని తమకంటే తమకే సీటు కేటాయించాలని అధిష్టానం వద్ద పట్టు బడుతున్నారు. ఆ ముగ్గురూ ఎవరికివారే పైరవీలు చేసుకుంటున్నారు. దీంతో అభ్యర్థిత్వం తేల్చడం ఆ పార్టీ నాయకత్వానికి కత్తిమీద సాములా మారింది. ఎటూ తేల్చలేక రాష్ట్ర నాయకత్వం మూడు పేర్లతో కూడిన లిస్టును జాతీయ నాయకత్వానికి పంపింది. నేడు వారిలో ఒకరిని అభ్యర్థిగా ప్రకటించే అవకాశముంది. హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్‌నగర్ టీచర్ ఎమ్మెల్సీ స్థానాన్ని దక్కించకునే దిశగా వ్యూహ రచన చేస్తూ ఆర్థిక వనరులు పుష్కలంగా ఉన్న వ్యక్తులతో పోటీ చేయించాలనే ఎత్తుగడ వేస్తున్నట్టు తెలిసింది. రెండేండ్ల కిందట జరిగిన ఎన్నికల్లో అక్కడ నుంచి పల్లారాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. తాజాగా ఆయన జనగామ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందటంతో ఆ స్థానం ఖాళీ అయ్యింది. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ తీన్మార్ మల్లన్నను, బీఆర్ఎస్ పార్టీ ఎ.రాకేశ్‌రెడ్డి పేర్లను ప్రకటించాయి. నామినేషన్ల పర్వం ఈ నెల రెండో తేదీ నుంచే ప్రారంభమైంది. నామినేషన్లకు ఇంకా రెండు రోజులే గడువుంది. బీజేపీ మాత్రం ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు. పట్టభద్రుల ఎన్నికల్లో పోటీ చేసేందుకు బీజేపీ నేతలు ఎవరికి వారుగా ప్రయత్నాలు చేసుకుంటు న్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్ రెడ్డి ఒకడుగు ముందుకు వేసి టికెట్ ఆశిస్తున్న విషయాన్ని రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి సైతం ఆయనకు భరోసా ఇచ్చినట్టు ప్రచారం జరుగుతున్నది. కిషన్‌రెడ్డికి సన్నిహితుడు కావడం, పార్టీకి కమిట్ మెంట్‌తో సేవలందించడం ప్రకాశ్‌రెడ్డికి కలిసొచ్చే అవకాశముంది. ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు యాదవ్ సైతం పట్టభద్రుల స్థానాన్ని ఆశిస్తున్నారు. ఆలేరు అసెంబ్లీ, తాజాగా భువనగిరి లోక్‌సభ సీటును ఆశించి ఆయన భంగపడ్డారు. దీంతో పట్టభద్రుల స్థానంపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. ఉన్నత విద్యావంతుడిగా, యువ నాయకుడిగా తనకు అవకాశం కల్పించాలని అధిష్టానాన్ని కోరుతున్నారు. కిషన్‌రెడ్డి రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన తర్వాత కాసం వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పదోన్నతి పొందిన విషయం విదితమే. గత ఎన్నికల్లో ఈ పట్టభద్రుల స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయిన రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి మరోసారి తనకే టికెట్ దక్కుతుందనే ధీమాతో ఉన్నారు. ఈ సారి సానుభూతి కలిసివస్తుందనే ఆశలు పెట్టుకున్నారు. ఈ ముగ్గురిలో టికెట్ ఎవరికి దక్కుతుంది? అధిష్టానం రానివారిని ఎలా బుజ్జగిస్తుంది? అనేది వేచిచూడాల్సిందే.

ఫాసిస్టు బీజేపీని ఓడించడమే లక్ష్యం

- 2014, 2019 ఎన్నికల్లో మోడీ ఇచ్చిన గ్యారంటీలు ఏమయ్యాయి
- మత విద్వేషాలు రెచ్చగొడుతున్న ప్రధాని : మీట్ ద ప్రెస్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో ప్రమాదకరమైన, ఫాసిస్టు బీజేపీని పార్లమెంటు ఎన్నికల్లో ఓడించడమే తమ లక్ష్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఇప్పుడు మోడీ గ్యారంటీల పేరుతో ప్రజల ముందుకొస్తున్నారని చెప్పారు. 2014, 2019 ఎన్నికల్లో మోడీ ఇచ్చిన గ్యారంటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. విదేశాల నుంచి నల్లధనం తీసుకురావడం, జన్‌ధన్ ఖాతాల్లో రూ.15 లక్షలు జమ చేయడం, ఏటా రెండో కోట్ల ఉద్యోగాలివ్వడం, రైతుల ఆదాయం రెట్టింపు చేయడం వంటి హామీల అమలు ఏమైందని నిలదీశారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (టీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో మీట్ ద ప్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి కె విరాహత్‌అలీ అధ్యక్షత వహించగా, సీనియర్ జర్నలిస్టు మల్లయ్య సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ రాజ్యాంగంపై ప్రమాణం చేసి మత విద్వేషాలను రెచ్చగొడుతున్న రాజకీయ పార్టీల నాయకులను ముందు జైలులో పెట్టాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఖైదీలో ఉన్న రాముడు తనను ఎవరు విముక్తి చేస్తారా? అని ఎదురుచూస్తున్నారని చెప్పారు. హిందువుల గురించి మాట్లాడే బీజేపీ వారికి ఏం మేలు చేసిందని ప్రశ్నించారు. వెనుకబాటుతనం ఆధారంగా ముస్లింలకు రిజర్వేషన్లు కల్పిస్తే వాటిని మత కోణంలో చూసి బీజేపీ రద్దు చేస్తామంటోందని అన్నారు. ఎన్నికల ప్రచారంలో మత విద్వేషాలను ప్రధాని మోడీ రెచ్చగొడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆస్తులను ముస్లింలకు ఇస్తారంటూ దిగజారి మాట్లాడుతున్నారని చెప్పారు. మంగళసూత్రాల స్వాధీనం కుదురుతుందా? ఇలా వ్యాఖ్యానించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మతం పేరుతో దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నీతివంతమైన బీజేపీకి ఎలక్టోరల్ బాండ్ల పేరుతో రూ.ఎనిమిది వేల కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. దేశంలో అత్యంత అవినీతి పార్టీ బీజేపీ అని విమర్శించారు. మోడీ విధానాలతో 80 శాతం సంపద కేవలం 20 శాతం మంది చేతిలో ఉందన్నారు. మూడో ఆర్థిక వ్యవస్థగా మారుతుందంటూ బీజేపీ నాయకులు ఊదరగొడుతున్నారని చెప్పారు. ఆకలి సూచిలో 111వ స్థానం, తలసరి ఆదాయంలో 131వ స్థానంలో భారత్ ఎందుకుందని ప్రశ్నించారు. దేశంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. బిల్కిస్‌బానో కేసులో శిక్షపడిన వారికి బెయిల్ వస్తే ఊరేగించారని అన్నారు. మణిపూర్‌లో మహిళను నగ్నంగా ఊరేగించారనీ, బేటీ పడావో, బేటీ బచావో అంటే ఇదేనా అని అడిగారు. మోడీకి కేసీఆర్, చంద్రబాబు, జగన్ లొంగిపోయారని విమర్శించారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డిని బెదిరిస్తున్నారని చెప్పారు. లొంగిపోవడం లేదంటే బీజేపీలో చేరడం ఇదే మోడీ విధానమని అన్నారు. ఎంతటి అవినీతిపరులైనా బీజేపీలో చేరితే నీతివంతులుగా మారిపోతున్నారని చెప్పారు. బీజేపీ వాషింగ్ పౌడర్ నిర్మాలాగా మారిందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించడమే కర్తవ్యంగా పనిచేస్తాని అన్నారు. కాంగ్రెస్‌ను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గౌరవం ఉంటేనే పొత్తు ఉంటుందనీ, లేదంటే పోటీ ఉంటుందని స్పష్టం చేశారు. విలేకర్లు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.

సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగ

నవతెలంగాణ - చైతన్యపురి



సంపూర్ణ ఆరోగ్యానికి యోగ సాధన ఎంతగానో ఉపయోగపడుతుందని, ప్రస్తుత తరుణంలో మానసిక ఒత్తిళ్లతో సతమతమవుతున్నటువంటి మానవాళికి యోగ ఒక గొప్ప వరమని ప్రముఖ యోగా గురువు ఇస్మాయిల్ గురూజీ అన్నారు. లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్లో 10 రోజుల యోగా శిక్షణ తరగతులను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులు కావడంతో మహిళలు ఆరోగ్యాన్ని చక్కదిద్దుకోవడానికి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో దుగ్యాల నరేందర్, దయాదేవి, యోగ ప్రచారక్ పొనగాని ఉపేందర్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

పార్టీ మారిన కార్పొరేటర్..

నవతెలంగాణ - మీర్ పేట్



మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 6వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ మమత ప్రవీణ్ మంగళవారం చేవెళ్ల ఎంపీ బీజేపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వరరెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్, కార్యవర్గ సభ్యులు కొలన్ శంకర్ రెడ్డి, కన్వీనర్ ఎల్మేటి దేవేందర్ రెడ్డి, మీర్‌పేట్ అధ్యక్షులు పెండ్యాల నరసింహ, చెరుకుపల్లి వెంకటరెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు లీలా రవి నాయక్, చెవ్వ శ్రవణ్, నాగరాజు సహా పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎంఐఎం, బీజేపీలవి
మత రాజకీయాలు

- సెక్యులర్ వ్యవస్థను బలపరిచే ఇండియా కూటమిని గెలిపిద్దాం
- సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ నరసింహ




నవతెలంగాణ - సంతోష్ నగర్

ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మత రాజకీయాలు చేస్తున్న ఎంఐఎం, బీజేపీ పార్టీలను ఓడిద్దామని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నరసింహ ప్రజలకు పిలుపునిచ్చారు. ఇండియా కూటమి హైదరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి వలిఉల్లా సమీర్‌ను గెలిపించాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం సింగరేణి కాలనీలో సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని కొన్ని మీడియా సంస్థలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పాలకులపై ప్రశ్నలు సంధించాల్సిన సమయంలో మోడీ ప్రభుత్వానికి బాకాలు ఊదుతూ నిసిగ్గుగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారుఉ. యూట్యూబ్, ఇతర సామాజిక మాధ్యమాలలో మోడీ ప్రభుత్వ విధ్వంస రాజకీయాలను మేధావి వర్గం, సామాజిక ఉద్యమకారులు ప్రశ్నిస్తూ ప్రజల గొంతుగా నిలుస్తున్నారని తెలిపారు.

నరేంద్ర మోడీ ఈ ఎన్నికల్లో బీజేపీ 400 సీట్లు వస్తాయని మొదటి దశ ఎన్నికల్లో ప్రచారం ముమ్మరంగా చేశారు... కానీ అనేక సర్వేల్లో వ్యతిరేకత అర్థమైన తర్వాత రెండో దశలో హిందూ, ముస్లిం మత రాజకీయాలు చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పైన విషం చిమ్ముతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను ముస్లిం లీగ్ అని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సంపదను ముస్లింలకు ఇస్తారనే తప్పుడు ప్రచారం చేస్తూ తన దిగజారుడు రాజకీయాలను బహాటంగా ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ఇది కూడా పనిచేయదని గమనించిన మోడీ.. మూడో పేజీ ముందు ఎన్‌డిఏ గ్యారెంటీ అని ప్రజల ముందు వాగ్దానం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాడని విమర్శించారు. దేశ సంపదను తన దత్తపుత్రులైన 22 కార్పొరేట్ అధిపతులకు 16 లక్షల కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేశారని ఆరోపించారు. బీజేపీ, ఎంఐఎం పార్టీలు ప్రజల మధ్య మతవిద్వేషాలతో రెచ్చగొడుతూ..విభజన రాజకీయాల ద్వారా ఓట్లు దండుకోవాలని కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. ప్రతిపక్ష రాజకీయ పార్టీలపైన సిబిఐ ఈడి, ఐటి, సిబిఐ దాడులు జరిపి బెదిరింపులకు పాల్పడి తమ పార్టీలోకి చేర్చుకుంటున్నారని ఆరోపించారు. ఈసారి నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే భవిష్యత్‌లో ఓటు హక్కు అనేది ఉండదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు శంకర్ నాయక్, జిల్లా సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, స్టాలిన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సక్రి బాయి, ఆరుట్ల రాజకుమార్, సీపీఐ ఐఎస్ సదన్ డివిజన్ కార్యదర్శి మహమూద్, కౌన్సిల్ సభ్యులు జంగయ్య, ఆర్.బాలకృష్ణ, చైతన్య, రూప్ సింగ్ నర్సింగ్ రావు, అంజయ్య సీపీఐ శాఖ కార్యదర్శి, రాజు నాయక్, పాండు నాయక్, దశరథ నాయక్, డివిజన్ సహాయ కార్యదర్శి రూప్సింగ్, రేణుక భారతి కమిలి, తదితరులు పాల్గొన్నారు.

నాగోల్‌లో ఊపందుకున్న
ఎన్నికల ప్రచారం



- మాకే ఓటేయండంటూ అభ్యర్థుల అభ్యర్థన
- వారి వారి పార్టీల గెలుపు కోసం ఆయా కార్యక్రమాలు
- మరి ఓటర్లు ఎవరినీ గెలిపిస్తారో..

నవతెలంగాణ - నాగోల్

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గర పడుతున్నడంతో నాగోలు డివిజన్లో ఒక్కసారిగా ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. మల్కాజిగిరి పార్లమెంటు నియోజక వర్గం నుండి మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచి గెలుపు కోసం ఎవరి ప్రయత్నాలలో వారు నిమగ్నమ య్యారు. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గా పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా ఈటల రాజేందర్, బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిలు ప్రధాన ప్రత్యర్థులుగా ఎన్నికల బరిలో నిలిచారు. వీరి గెలుపు కోసం ఎల్బీనగర్ నియోజకవర్గంలోని ఆయా పార్టీల అగ్ర నేతలు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు నాగోలు డివిజన్లో ఆత్మీయ సమ్మేళనాలు, పాదయాత్రలు, ఇంటింటీ ప్రచారాలు, ర్యాలీలను నిర్వహిస్తూ ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నారు. 20 రోజుల నుండి మండిపోతున్న ఎండలకు ప్రచారాలకు కొంత అడ్డుగానే మిగిలిపోతున్నాయని చెప్పుకోవచ్చు. అయినప్పటికీ ఉదయం ఆరు గంటల నుండి ఆ పార్టీల నాయకులు, కార్యకర్తలు డివిజన్లోని ఆయా కాలనీలలో సందర్శించి ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలుస్తూ తమ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.





ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డి గెలుపు కోసం మాజీ ఎంపీ, రాష్ట్ర టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జెక్కిడి ప్రభాకర్ రెడ్డి ఉప్పల శ్రీనివాస్ గుప్త, మల్ రెడ్డి రామ్ రెడ్డి ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, వజీర్ ప్రకాష్ గౌడ్, నాగోల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మంజులరెడ్డిలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు కలిసి డివిజన్లో విస్తృతంగా పర్యటిస్తూ గడపగడపకూ వెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అమలుపరిచిన 6 గ్యారంటీల పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రజాసంక్షేమం కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ఆదరించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కేంద్రంలో రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని దీంతో రాష్ట్ర అభివృద్ధితో పాటు మన ప్రాంత అభివృద్ధి కూడా మరింత ముందుకు వెళ్తుందని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు. ప్రధానంగా మహిళలకు ప్రత్యేకంగా అమలుపరిచిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ఈ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ఎంత మేర కలిసి వస్తుదోనని పలువురు అంటున్నారు. అదేవిధంగా గృహ జ్యోతి, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలు కూడా పూర్తిస్థాయిలో అమలుకాకుండా కంటి తుడుపు చర్యలుగానే అమలు జరిగాయని దీంతో కొంత వ్యతిరేకతను కాంగ్రెస్ పార్టీ మూట కట్టుకోవాల్సిందేనని అంటున్నారు.





బీజేపీ పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపు కోసం రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి చింతల సురేంద్రనాథ్ యాదవ్ ఎల్బీనగర్ కన్వీనర్ వెంకటేష్ గౌడ్ లతోపాటు నియోజకవర్గంలోని బీజేపీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. తన గెలుపు కోసం నాగోలు డివిజన్లో ఈటల రాజేందర్ ఏదో ఒక ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో కానీ ప్రచార కార్యక్రమంలో గానీ పాల్గొంటూ కేంద్రాల్లో నరేంద్ర మోడీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, దేశ రక్షణను గుర్తించి, మళ్లీ నరేంద్ర మోడీని ప్రధానిగా కోరుకుంటున్నారని దీనితో బీజేపీ పార్టీని ఆశీర్వదించి పార్టీ బలపరిచిన తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కోసం ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవీరెడ్డి సుధీర్ రెడ్డితో పాటు నియోజకవర్గంలోని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగోలు డివిజన్లోని అనంతుల రాజిరెడ్డి, చెరుకు ప్రశాంత్ గౌడ్ డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవిలతోపాటు ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రతినిత్యం డివిజన్లో కాలనీలను తిరుగుతూ ప్రజలను కలుస్తూ కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను, ఎల్బీనగర్ నియోజకవర్గ అభివృద్ధితోపాటు నాగోలు డివిజన్ అభివృద్ధిని వివరిస్తూ కాంగ్రెస్, బీజేపీ మాయమాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచిస్తున్నారు. మన రాష్ట్రం మన ప్రాంతం అభివృద్ధి చెందాలంటే పార్లమెంటులో మన సమస్యలపై మన అభివృద్ధిపై గళాన్ని వినిపించే మన ఎంపీ కావాలని దీంతో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన రాగిడి లక్ష్మారెడ్డిని ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నారు.





తమ తమ అభ్యర్థుల గెలుపు కోసం మూడు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వారి వారి ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ఓటర్ల మదిలో ఏది ఉందో అంత చిక్కడం లేదని కూడా వినిపిస్తుంది. మల్కాజిగిరి పార్లమెంటు ఏర్పడినప్పటి నుండి ఒక్కసారి తప్ప ఈ నియోజకవర్గంలో అధికార పార్టీ కైవసం చేసుకోలేకపోయిందని దీంతో ఈ దఫా ఎన్నికల్లో ప్రజలు ఆరు గ్యారెంటీలు ఇచ్చిన అధికార కాంగ్రెస్ పార్టీనా.. మోడీ పాలన చూసి బీజేపీ పార్టీనా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పదేండ్ల పాటు అధికారంలో ఉండి అనేక ప్రజా సంక్షేమ పథకాలను అన్ని రంగాలలో అభివృద్ధి పరిచిన బీఆర్ఎస్‌ను ఆదరిస్తారో లేక ఎన్నికల బరిలో నిలిచిన మూడు పార్టీల అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి చేవెళ్ల నియోజకవర్గానికి చెందినవారు కాగా.. బీజేపీ పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్ హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం చెందినవారు అయితే.. బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం చెందిన వ్యక్తి స్థానికుడు కావడంతో ప్రజలకు స్థానికంగా ఉంటూ ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించే వారిని కోరుకుంటారో లేక రాష్ట్రంలో అధికారం ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గానీ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అభ్యర్థిని ఆదరిస్తారో వేచి చూడాల్సిందే.

మళ్లీ మోడీ వస్తే..
పెట్రోల్ ధర రూ.170 చేయడం ఖాయం

- టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మెన్ మధుయాష్కీ గౌడ్



నవతెలంగాణ - హయత్‌నగర్

కేంద్రంలో మోడీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే.. పెట్రోల్ ధర రూ.170, వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.2000 చేయడం ఖాయమని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డితో కలిసి నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వస్తే దేశంలోని అన్ని కులాల గణన చేపట్టి.. వారి ఆర్థిక స్థితిగతులకు అనుగుణంగా వనరులలో సమాన వాటా అందిస్తామని, సామాజిక న్యాయం లక్ష్యంగా రాహుల్ గాంధీ ముందుకెళ్తున్నారని పేర్కొన్నారు. మోడీ మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను రద్దు చేస్తారని, వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న మోడీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాలని ఓటర్లను కోరారు. పరోక్షంగా బీజేపీతో జతకట్టిన బీఆర్ఎస్ పార్టీకి ఓటేస్తే అది వృధా అవుతుందని, కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించాలని ప్రజలను కోరారు. సునీతా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆడబిడ్డగా మీ అందరి ముందుకు వచ్చానని, 2006 నుంచి ప్రజలకు సేవ చేస్తూ రాజకీయాలలో ఉన్నానని, తనకు అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముద్దగౌని రామ్ మోహన్ గౌడ్, జక్కిడి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మ సంస్మరణ సభలో ఉప్పల

నవతెలంగాణ - నాగోల్



మహోన్నత వ్యక్తుల జీవన విధానాలను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత మనపై ఉందని తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్, అంతర్జాతీయ ఫెడరేషన్ జాతీయ కార్య నిర్వాహ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. నాగోల్‌లోని కో ఆపరేటివ్ బ్యాంక్ కాలనీలో ప్రముఖ సంస్థ 'ఆకృతి' ఆధ్వర్యంలో 19 దశకపు నిత్యాన్నదాత డొక్కా సీతమ్మ 116 వ వర్ధంతి సందర్భంగా సీతమ్మ సంస్మరణ సభను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల శ్రీనివాస్ గుప్త డొక్క సీతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మట్టిలో మాణిక్యం డొక్క సీతమ్మ..ఆమె నితాన్నదానానికి వేళలు కూడా వుండేవి కావన్నారు. ఆకలితో అర్ధరాత్రి వచ్చినా ఆమె అన్నం పెట్టి పంపేవారని గుర్తుచేశారు. అలాంటి వ్యక్తుల స్పూర్తితో తాను కూడా నిరుపేద యువతీ యువకుల పెళ్లిళ్లకు మంగళ సూత్రాలు, మెట్టెలు, బట్టలు వితరణ చేస్తున్నట్టు వివరించారు. తర్వాత కేంద్ర సమాచార మాజీ కమిషనర్ మాడ భూషి శ్రీధర్ మాట్లాడుతూ సీతమ్మ గొప్పదనం తెలుసుకున్న అప్పటి బ్రిటన్ రాణి.. తన పట్టాభిషేకం సమయంలో ఆమెకు ప్రత్యేక ఆహ్వానం పంపారన్నారు. అనారోగ్యంతో ఆమె రాలేకపోతే తన సింహాసనం పక్కన ఆమె ఫోటో పెట్టుకోవడం భారతీయులందరికీ గర్వ కారణం అన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన సుప్రసిద్ధ రచయిత్రి, ప్రవచన కర్త డాక్టర్ అనంత లక్ష్మి ప్రసంగిస్తూ.. ఆమె జీవిత చరిత్రను ఓ పుస్తక రూపంలో తేవడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఆకృతి సుధాకర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మదర్ థెరీసా ఫౌండేషన్ అధ్యక్షుడు చేపూరు శంకర్, వేద కల్యాణి, పద్మజ మున్నగు పాల్గొన్నారు.

కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి



నవతెలంగాణ - ఎల్బీనగర్

చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని సరూర్ నగర్ బీఆర్ఎస్ పార్టీ మాజీ డివిజన్ అధ్యక్షుడు ఆకుల అరవింద్ కుమార్ కోరారు. సరూర్ నగర్‌లో కాసాని గెలుపు కోసం గడప గడపకూ తిరుగుతూ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో నీళ్ళ ట్యాంకర్లదే రాజ్యమైందని, ప్రజా సంక్షేమం పూర్తిగా విఫలమైందని అన్నారు. మళ్లీ మంచిరోజులు రావాలంటే బీఆర్ఎస్ పార్టీకి ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంటూరి అంకిరెడ్డి, మాజీ కౌన్సిలర్ దర్పల్లి అశోక్ , సీనీయర్ నాయకులు లోకసాని కొండల్ రెడ్డి, మాజీ అధ్యక్షులు పందుల రాజు, పోలే అరవింద్, మహిళా రాష్ట్ర నాయకులు సుశీల రెడ్డి, రిషి, కట్ట ప్రవీణ్, జహీర్, ఇస్మాయిల్, నరేష్, పెరుమాళ్ళ అభిలాష్, గోపాల్, ప్రత్యూష్, శ్రీనివాస్, యువజన, విద్యార్థి, మైనార్టీ, మహిళా విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్కేపురంలో కాంగ్రెస్ ప్రచారం



నవతెలంగాణ - చైతన్యపురి

చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి గెలుపు కోసం రామకృష్ణ పురం డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్ రెడ్డి, గడ్డం రంజిత్ రెడ్డి కుమారుడు ఆర్యన్ రెడ్డిలు గడప గడపకూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు హస్తం గుర్తు పై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో రంజిత్ రెడ్డిని గెలిపించాలని ఓటర్లను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా మైనార్టీ సీనియర్ నాయకులు ఎస్కే మహమ్మద్, జ్ఞానేశ్వర్, రాజు నాయక్, అక్బర్, కల్యాణ్, డక్కర్ నాయక్, షఫీ, పటేల్ సురేష్, అహమద్, శేఖర్, సురేష్ ఇస్మాయిల్, పింటు, శ్రీకాంత్ రెడ్డి సలీం, శ్రీనాథ్, లక్ష్మి, రేణుక, సరస్వతి, మాధవి, లావణ్య, జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్కేపురం కాలనీలో బీఆర్ఎస్ ప్రచారం



నవతెలంగాణ - చైతన్యపురి

చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపు కోసం ఆర్కేపురం డివిజన్‌లోని ఆర్కేపురం కాలనీలో మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ కార్యకర్తలతో కలిసి ఇంటింటీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు నెలల కాలంలోనే కాంగ్రెస్ పార్టీ పనితీరును చూసి ప్రజలు చీదరించుకుంటున్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని జోస్యం చెప్పారు. ఈ ప్రచారంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామ్ నరసింహ గౌడ్, రమేష్ కురుమ, పబ్బు శ్రీనివాస్ గౌడ్, అనురాధ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మీలో ఒక్కడిగా సమస్యలు పరిష్కరిస్తా

- మల్కాజిగిరి స్వతంత్ర అభ్యర్థి వైష్ణవీ ప్రసాద్



నవతెలంగాణ - ఎల్బీనగర్

తనకు ఎలాంటి హై కమాండ్ నాయకులు లేరని, ప్రజలే తనకు హైకమాండ్ అని, తనను మల్కాజిగిరి ఎంపీగా గెలిపిస్తే.. మీలో ఒక్కడిగా ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మల్కాజిగిరి స్వతంత్ర అభ్యర్థి పెండ్యాల శేషసాయి వరప్రసాద్ (వైష్ణవీ ప్రసాద్) అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని కొత్తపేట డివిజన్ మోహనగర్‌లోని శ్రీబాలాజీ నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వైష్ణవీ ప్రసాద్‌కు మంగళవారం ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక కాలనీ వాసుల సహకారంతో పార్లమెంట్ ఎన్నికలో పోటీ చేసే స్థాయికి ఎదిగానని అన్నారు. మన పరిధిలో ప్రజా ప్రతినిధులు గెలిచిన నాయకుల వద్దకు వెళితే సమస్యల చెప్పుకునే సమయం కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం మీకు అందుబాటులో ఉండే తనను ఎంపీగా గెలిపిస్తే నిరంతరం మీలో ఒక్కడిగా ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బ్రహ్మర్షీ సుభాష్ పత్రిజీ ఆశీస్సులతో పిరమిడ్ పార్టీ బలపరచిన తన ఫ్లూట్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. అనంతరం శ్రీ బాలాజీ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహించే వైష్ణవీ ప్రసాద్‌ను గెలిపించుకోవాలని కాలనీవాసులను కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ బాలాజీ కాలనీ వాసులు గోపాల కిషన్ రావు, కుమార స్వామి అరవింద్, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, లక్ష్మణరావు వివిధ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేయడం అందరి బాధ్యత

సీనియర్ సివిల్ జడ్జి పి. శ్రీదేవి

నవతెలంగాణ - చైతన్యపురి



ఓటు వేయడం అందరీ బాధ్యత అని రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి. శ్రీదేవి అన్నారు. సరూర్‌నగర్‌లోని మహిళా శక్తి సమాఖ్యలో స్త్రీ, వికలాంగులు, ట్రాన్స్ జెండర్ శాఖ ఆధ్వర్యంలో ఓటు హక్కు మీద మంగళవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ సమాజంలో వివక్షకు గురవుతూ భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్న చాలా మంది ట్రాన్స్ జెండర్‌లు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్య పరిరక్షణకు మేము సైతం అని ముందుకు రావాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి పద్మజ రమణ, డిస్ట్రిక్ట్ రీహాబిలిటేషన్ నోడల్ ఆఫీసర్ రమేష్ , అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
బుధవారం | మే 08, 2024 | www.navatelangana.com

సీపీఐ(ఎం) ఎన్నికల ప్రణాళిక బుక్‌లెట్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఉప్పల్

18వ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సీపీఐ(ఎం) ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రణాళిక బుక్‌లెట్‌ను సీపీఐ(ఎం) ఉప్పల్ పార్టీ కార్యాలయంలో మేడ్చల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు ఎం. వినోద, జె.వెంకన్న, ఎండీ. గౌస్, భీష్మాచారిలతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినోద మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్దే లక్ష్యంగా సీపీఐ(ఎం) పని చేస్తుందన్నారు. జె. వెంకన్న మాట్లాడుతూ..మతోన్మాద బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఊర్మిళ, ఆంజనేయులు, ఉపేందర్, పాల్గొన్నారు.

'పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించాలి'



నవతెలంగాణ-కాప్రా

పదేండ్లుగా కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వ నిరంకుశ, అప్రజాస్వామిక పాలన, అవినీతిని ప్రశ్నించి, మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతారెడ్డి గెలుపును కాంక్షిస్తూ ఈసీఐఎల్, కుషాయిగూడ ప్రాంతాల్లో విద్యావంతులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్యం, విద్యావంతులు నాగేశ్వరరావు, సుధాకర్, మాలతీ, కృష్ణమౌళి, రవి కుమార్, వేణు, ఏఐవైఎఫ్ నేతలు దుర్గా ప్రసాద్, మహేష్, భరత్, రవి, పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేం ద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతిని నిర్వహించా రు. మంగళవారం మౌలాలి హౌసింగ్ బోర్డు ఏరియాలో ఉన్న అల్లూరి సీతా రామరాజు విగ్రహం దగ్గర శత వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా అల్లూరి విగ్రహానికి కాప్రా కాలనీల సంక్షేమ సంఘాల బాధ్యులు వెంకటాచారి, సామాజిక ఉద్యమ నేత గిరీష్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సామాజిక ఉద్యమ నేత కోమటి రవి మాట్లాడుతూ.. అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర పోరాట యోధుడని పేర్కొన్నారు. గిరిజన, ఆదివాసీల్లో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేసేలా స్ఫూర్తిని నింపారని చెప్పారు. దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు విప్లవాన్ని రగిల్చారని తెలిపారు. మన్యంలో పోరాట దివిటీని వెలిగించి బ్రిటిష్ వారికి నిద్రలేకుండా చేశారని వివరించారు. బ్రిటిషు వారు కులాల మధ్య, మతాల మధ్య చిచ్చు పెట్టినా అల్లూరి అందరినీ కలుపుకుని పోరాటం చేశారని చెప్పా రు. దీనిని సహించలేని బ్రిటిషు వారు అధునాతన యుద్ధ సామాగ్రి కలిగిన బ్రిటిష్ వారు అల్లూరి సీతారామరాజును హత్య చేశారని చెప్పారు. నేటి పాలకు లు మతోన్మాదంతో ప్రజలను మూఢత్వంలోకి నెట్టుతున్నారని, వారికి వ్యతిరే కంగా పోరాడాలని చెప్పారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. కార్యకమంలో యాదగిరిరావు, రాజమల్లు, గిరీష్, వెంకటాచారి, శారద, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి : ముప్పు రాంరెడ్డి



నవతెలంగాణ-కీసర

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ జడ్పీటీసీ ముప్పు రాంరెడ్డి అన్నారు. మంగళవారం నాగారం మున్సిపల్ పరిధిలోని 20వ వార్డు గోపి కృష్ణ కాలనీవాసులు, మాజీ జెడ్పీటీసీ ముప్పు రాంరెడ్డి సమక్షంలో పార్టీ ప్రెసిడెంట్ ముప్పు శ్రీనివాస్ రెడ్డి, 20వ వార్డు కౌన్సిలర్ సుమిత్ర సురేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ముప్పు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో పట్నం సునీతారెడ్డిని గెలిపించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి సునీతారెడ్డిని గెలిపించండి



- ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మెన్ కాలువ సుజాత

నవతెలంగాణ-కాప్రా

మల్కాజిగిరి పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డికి ఓటేసి గెలిపించాలని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మెన్ కాలువ సుజాత, ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ గెలుపుతోనే అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం జరుగుతుందన్నారు. మంగళవారం కాప్రా సర్కిల్ ఏఎస్‌రావు నగర్‌లోని వాసవీ భవన్‌లో నిర్వహించిన ఆర్యవైశ్య సంఘం ఆత్మీయ సమ్మేళనంలో వారు మాట్లాడుతూ.. మహాత్మగాంధీ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చేందుకు తన ప్రాణాన్నే పణంగా పెట్టారని గుర్తు చేశారు. ఆర్యవైశ్యులు మొదటి నుంచీ కాంగ్రెస్‌తోనే ఉంటూ వస్తున్నారని గుర్తు చేశారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా న్యాయం వైపు నిలపడే కాంగ్రెస్‌కు వెన్నుదన్నుగా ఉంటున్నామని తెలిపారు. వచ్చే జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డికి ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ది నాగరాజ్, పెద్ది శ్రీను, ఆర్యవైశులు పాల్గొన్నారు.

ఘనంగా కొత్త అంజిరెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కాప్రా

కాంగ్రెస్ నాయకులు కొత్త అంజిరెడ్డి జన్మదిన వేడుకలను ఆయన నివాసంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొజ్జ రాఘవ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షులు పత్తి కుమార్, కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగ శేషు, తోటకూర శ్రీకాంత్, సింగం కిరణ్, రామలింగం, సందీప్ గౌడ్, సతీష్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, నాగరాజు, మురళీ, కందుకూరి రాజు, శ్రీధర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకే రజకుల మద్దతు

- సునీతా మహేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి
- జేఏసీ రాష్ట్ర చైర్మెన్ ఆంజనేయులు



నవతెలంగాణ-మేడ్చల్

రజకుల సమస్యలను పరిష్కరించిన కాంగ్రెస్ ప్రభుత్వానికే రజకుల మద్దతు ఉంటుందని రాష్ట్ర రజక సంఘాల జేఏసీ చైర్మెన్ పంజాగారి ఆంజనేయు లు అన్నా రు. మంగళవారం మేడ్చల్ పట్టణంలోని దోబీఘాట్ వద్ద ఉన్న కమ్యూనిటీ హాల్లో మేడ్చల్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో రజక సంఘాల జేఏసీ చైర్మెన్ పంజగారు ఆంజనేయులు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డికి ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని రజకులంతా కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. గత ప్రభుత్వం రజకులకు ఇచ్చిన ఉచిత విద్యుత్ హామీ ఒక్క ఏడాది కూడా అమలు కాలేద న్నారు. రేవంత్ ప్రభుత్వం వచ్చిన వెంటనే రజకులకు విద్యుత్ బకాయిలు రూ.79కోట్ల 85లక్షలు నిధులు విడుదల చేశారని చెప్పారు. చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్ బాండ్‌పై ఏర్పాటు చేయడానికి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. రజకులకు కేంద్ర మంత్రి మండలిలో స్థానం కల్పించలేని బీజేపీని ఓడించాల న్నారు. రజకుల సమస్యలపై ఈటల రాజేందర్ ఏనాడు మాట్లాడలేదని విమర్శించారు. బీఆర్ఎస్‌లో ఆర్థిక మంత్రిగా ఉండి రూ.250 కోట్లు కేటాయిస్తు న్నట్లు ప్రకటన చేసి రజక ఫెడరేషన్‌కు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్ర మంలో ఏ బ్లాక్ నాయకులు సింగరేణి పోచ య్య, శామీర్‌పే ట్ మండల అధ్యక్షులు ముత్యంగారి నరహరి, జవహర్ నగర్ అధ్యక్షులు తాడూరి నరసింహ, కీసర మండల అధ్యక్షులు ఓరుగంటి వెంకటేష్, ఘట్కేసర్ మండల అధ్యక్షులు జూపల్లి రవి, మల్కాజిగిరి నియోజకవర్గ అధ్యక్షులు దశరథ్, పాండు, నాయకులు సత్యనారాయణ, నరసింహ, మురళి, పాండు, సాయి పాల్గొన్నారు.

మల్కాజిగిరి ప్రజలకు ఈటల క్షమాపణ చెప్పాలి



- బీఆర్ఎస్ నాయకులు రాము యాదవ్
- సాయినగర్‌లో ఈటల దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి ప్రజలను అసభ్య పదజాలంతో మాట్లాడిన ఈటల రాజేందర్ మల్కా జిగిరి ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నాయకు లు మేకల రాము యాదవ్ డిమాండ్ చేశారు. ఈటల రాజేందర్ ఓ కార్యక్ర మంలో మాట్లా డుతూ మల్కాజిగిరి ప్రజలు డబ్బుకు, మద్యానికి అమ్ముడు పోతారని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఈటల వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం మల్కాజిగిరి సాయి నగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నేత మేకల రాము యాదవ్ ఆధ్వర్యం లో పార్టీ శ్రేణులు నిరసన తెలిపారు. అనంతరం రాము యాదవ్ మాట్లాడు తూ.. ఈటల చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని డిమాండ్ చేశారు. ఓటమి భయంతోనే మల్కాజిగిరి ప్రజలు డబ్బుకు, మద్యానికి అమ్ముడుపోతారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం ఈటల రాజేందర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు సిద్ధిరాములు, సాదు పరమేష్, బైరు అనీల్, భిక్షపతి, మల్లేష్ యాదవ్, నగేష్ గౌడ్, నర్సింగ్, కిట్టు, షేక్, కన్నా, కావాలి శ్రీనివాస్, వీరేశం, శ్రీను, నాయక పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం



నవతెలంగాణ-ఘట్కేసర్

మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం పోచారం మున్సిపల్ పరిధిలోని ఎస్బీఆర్ గార్డెన్‌లో మేడ్చల్ అసెంబ్లీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ పరిశీలకురాలు జ్యోతిమణి ముఖ్యఅతిథిగా హాజరై బూత్ లెవల్ కార్యకర్తలు ఎన్నికల్లో ఎలా పనిచేయాలనే అంశంపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సరిత వెంకటేష్, మేడ్చల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్త సుశాంత్ గౌడ్, ఏ,బీ బ్లాక్ అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, వేముల మహేష్ గౌడ్, మండల, మున్సిపల్, కార్పొరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, మున్సిపల్, మండల, గ్రామ శాఖ, యువజన, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, లీగల్‌సెల్, మహిళా విభాగాల అధ్యక్ష, కార్యదర్శులతో పాటు బూత్ సభ్యులు పాల్గొన్నారు.

అనురాగ్ యూనివర్సిటీలో హ్యాకథాన్ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఘట్కేసర్

మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గల అనురాగ్ యూనివర్సిటీలో 48 గంటల జాతీయ స్థాయి హ్యాకథాన్ నిర్వహించనున్నారు. ఐఈఈఈ, సీఐఎస్ కోడింగ్ క్లబ్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెంట్ విభాగం సహకారంతో స్మార్ట్ హ్యాక్స్ 2కె24 బీ బేటా ఎడిషన్ పేరుతో వచ్చేనెల జూన్ 20 నుంచి 22 వరకు నిర్వహించే ఈ కార్యక్రమం పోస్టర్‌ను ఏయూ ఎస్‌వోఈ డీన్ డాక్టర్ వి. విజయ్ కుమార్, హెచ్‌వోడీ డాక్టర్ ఎ. మల్లికార్జునరెడ్డి, డీన్ డాక్టర్ సుధీర్ రెడ్డి, డాక్టర్ శ్రీదేవి ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో కన్వీనర్లు డాక్టర్ ఎం. తృప్తి, డాక్టర్ ప్రదీప్ కుమార్, స్టూడెంట్ కోఆర్డినేటర్లు కార్తీక్ రావు, వేణుగోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్‌కు బాధితుల ఫిర్యాదు

నవతెలంగాణ-ఘట్కేసర్

తమ స్థలాన్ని కబ్జా చేసి అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బాధితులు హరికిషన్, సజ్జన్ తెలిపిన వివరాల ప్రకారం.. మేకల దాస్, అతడి కుమారుడు మేకల సాయి ఘట్కేసర్ మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలోని సర్వేనెంబర్ 489, 585, 593, 595, 596,597లో గల 540 గజాల తమ స్థలంలో ఎలాంటి పత్రాలు లేకుండా, దౌర్జన్యంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నగరంలో భారీ వర్షం.. ఉక్కపోతనుంచి ఉపశమనం



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని కుషాయిగూడ, ఈసీఐఎల్, ఏఎస్‌రావు నగర్, చర్లపల్లి, హెచ్‌బీ కాలనీ డివిజన్‌లో మండుటెండలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు మంగళవారం వర్షం కురవడంతో నగరవాసులకు ఉడకపోత నుంచి ఉపశమనం లభించింది. సాయంత్రం ఆరు గంటలకు ఒక్కసారిగా ఈదురు గాలులతో భారీ వర్షం రావడంతో నగరవాసులు ఊపిరి పీల్చుకున్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల ఇంటింటి ప్రచారం



నవతెలంగాణ-కాప్రా

లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ కాలనీ, మీర్‌పేట్ లక్ష్మీనగర్‌లో కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డిలు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరారు.

కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్ ఆధ్వర్యంలో..

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల ప్రకారం మల్కాజిగిరి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపునకు నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం గడపగడపకూ ప్రచారం చేశారు. హైదరాబాద్‌లో కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి ఏ ప్రభుత్వంలోనూ జరగలేదని ఓటర్లకు సూచించారు. హైదరాబాదులో ఎమ్మెల్యేలను ఎలా గెలిపించారో అలాగే ఎంపీ అభ్యర్థులు కూడా గెలిపించాలని కోరారు.



కాంగ్రెస్ విజయం ఖాయం: రవీందర్‌గౌడ్



నవతెలంగాణ-మేడ్చల్

మల్కాజిగిరి పార్లమెంట్‌లో కాంగ్రెస్ విజయం ఖాయమని మేడ్చల్ మండల నాయకుడు గౌడవెల్లి రవీందర్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరుగారంటీలు అద్భుతంగా ఉన్నాయని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, దళితులకు మూడెకరాల భూమి, నిరుద్యోగ భృతి, యువతకు ఉద్యోగాలు కల్పించకపోవడంతోనే కేసీఆర్‌ను ఫామ్ హౌస్‌కు పంపించారని విమర్శిం చారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, భూములు ఇచ్చినట్లు గుర్తు చేశారు. రేవంత్ ప్రభుత్వం విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ ముందుకుపోతున్నదని, పార్లమెంటు ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్, బీజేపీలను తరిమికొట్టాలి



- మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

నవతెలంగాణ-కీసర

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలను తరిమి కొట్టాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకురా మల్లారెడ్డి అన్నారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీలో బీఆర్ఎస్ నేతలతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రజలను మభ్యపెడుతూ కాలయాపన చేస్తున్నాయని, అభివృద్ధి పనులు ఏమీ చేయడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపాలిటీ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్, నాయకులు గూడూరు ఆంజనేయులుగౌడ్, గండి అంజయ్య గౌడ్, కౌన్సిలర్లు కౌకుట్ల అనంతరెడ్డి, కృష్ణారెడ్డి, సుధాకర్ రెడ్డి, వరకాల పెంటయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బూత్ లెవల్ కార్యకర్తలతో ఎమ్మెల్యే మర్రి సమావేశం



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్‌లోని 135 డివిజన్ వెంకటాపురంలోని శ్రీ సాయి ఎన్‌క్లేవ్ సామాజిక భవనంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బూత్ లెవల్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంబీసీ మాజీ చైర్మెన్ నంది కంటి శ్రీధర్, కార్పొరేటర్ సబితా అనీల్‌కిషోర్, నాయకులు రావుల అంజయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మిగిలిన నాలుగు రోజులు బేదాభిప్రాయం లేకుండా కలిసికట్టుగా పని చేస్తూ రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సూచించారు. ప్రతీ ఓటర్‌ను కలిసి కేసీఆర్ చేసిన పనులను వివరించాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనీల్ కిషోర్ గౌడ్, సంపత్, ప్రభాకర్, శ్రీనివాస్, సయ్యద్ మోసిన్, దేవయ్య గౌడ్, వీరేశం, శంకర్, సురేష్, లక్ష్మీనారాయణ, ప్రకాష్ గౌడ్, తాజుద్దీన్, ఈశ్వర్‌గౌడ్, రాజు, శివ, సుధాకర్ గౌడ్, రమాదేవి, సంధ్య, అమృత, వసుంధర, సుజాత పాల్గొన్నారు.

బండరాయితో కొట్టి బావను హత్య చేసిన బావమరిది



నవతెలంగాణ-అల్వాల్

బావను బండరాయితో కొట్టి బావమరిది హత్య చేశాడు. ఈ ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్‌లోని భారతీ నగర్‌లో నివసించే యోగేందర్, జానకి దంపతులు పాత నేరస్తులు. జానకికి, యోగేందర్(40) రెండో భర్త. కాగా మొదటి భర్తకు పుట్టిన కూతురుతో కలిసే ఉంటున్నారు. ప్రతీ రోజు మద్యం తాగి భార్య కూతురితో గొడవ పడేవాడు. సోమవారం రాత్రి మద్యం తాగి భార్య, కూతురితో గొడవ పడ్డాడు. దీంతో జానకి బొల్లారంలో ఉండే తన సోదరుడు సుబ్రహ్మణ్యంకు ఫోన్ చేసి విషయం చెప్పడంతో ఆగ్రహంతో వచ్చిన సుబ్రహ్మణ్యం, యోగేందర్‌ను బండరాయితో కొట్టాడు. దీంతో తీవ్ర గాయాలైన యోగేందర్ మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి జానకిని, హంతకుడు సుబ్రహ్మణ్యంను అదుపులోకి తీసుకున్నారు. కాగా జానకి ఆమె భర్త యోగేందర్ ఇటీవల జైలు నుంచి విడుదలైనట్లు తెలిపారు. వీరిపై పలు కేసులు ఉన్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన గోపి చారి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో, చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి తనయుడు, ఆర్యన్ రెడ్డి సమక్షంలో... ఆల్విన్ కాలనీ డివిజన్ తులసి నగర్ కాలనీకి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మానేపల్లి గోపిచారి కాంగ్రెస్ కండువా కప్పుకుని కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, అనిల్ రెడ్డి, గిరి ప్రసాద్ రెడ్డి, నాగరాజ్ గౌడ్, క్రాంతి కుమార్, వాలి నాగేశ్వరరావు, రమేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

- కాంగ్రెస్ నాయకులు జీవీఆర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

మల్కాజిగిరి పార్లమెంట్, కూకట్‌పల్లి నియోజకవర్గంలోని, 121 డివిజన్ కూకట్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ ఇంటింటి ప్రచారంలో భాగంగా గొట్టిముక్కల దేశాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ యువ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం కేంద్ర మాజీ మంత్రి, సర్వే సత్యనారాయణ, హాజరై కూకట్‌పల్లి పార్టీ కార్యాలయంలో ప్రసంగించారు. మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మోలుగు భీంరావు, మేకల రమేష్, సంజీవరావు, నాగార్జున, గోవింద్ గౌడ్, బాబు, కూతురు సురేష్, భాను, బొట్టు రాజా, వెంకటేష్ జ్యోతి, కృష్ణవేణి, పాల్గొన్నారు.

కారు స్పీడ్‌కు కమలం,చేయి పార్టీలు గల్లంతవ్వాల్సిందే



- మల్కాజిగిరి పార్లమెంట్‌లో బీఆర్ఎస్‌కు పెరుగుతున్న ఆదరణ
- ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మల్కాజిగిరి పార్లమెంట్‌లో కారు స్పీడ్‌కు కమలం పువ్వు, చెయ్యి గుర్తులు గల్లంతవ్వాల్సిందేనని ప్రజలు అనూహ్యరీతిలో తీర్పు ఇవ్వనున్నారని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పార్టీ శ్రేణుల్లో భరోసానింపారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం నియోజకవర్గ పరిధిలోని జగద్గిరిగుట్ట, రంగారెడ్డినగర్ చింతల్, గాజుల రామారం డివిజన్‌ల కార్పొరేటర్‌ల అధ్యక్షతన జగద్గిరి గుట్ట కార్పొరేటర్ కార్యాలయ ఆవరణలో, రంగారెడ్డి నగర్ డివిజన్ చంద్రనగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయ ఆవరణలో, చింతల్ డివిజన్ ఎల్.యస్.ఫంక్షన్ హాల్, గాజుల రామారం డివిజన్ యండమూరి లే అవుట్ కమ్యూనిటీ హాల్‌లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపుకు మద్దతుగా నిర్వహించిన నాయకుల, కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదేండ్ల కాలంలో మన ప్రాంతంలో జరిగిన అభివృద్ధిని రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపిస్తే జరిగే అభివృద్ధిని ప్రజలను వివరించి చైతన్యవంతులను చేయాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు స్థానికులు కాదని, మన బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి స్థానికేతరుడనని ప్రజలకు వివరించాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్ చేస్తున్న బస్సు ప్రచార యాత్రలో ఆయా పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలుకుల జగన్, బి.విజయ శేఖర్ గౌడ్, మొహమ్మద్ రషీద రఫీ, జగద్గిరిగుట్ట శ్రీ వెంకటేశ్వర దేవస్థానం చైర్మెన్ వేణు యాదవ్, పలు డివిజన్ అధ్యక్షులు ఏర్వ. శంకరయ్య, రుద్ర అశోక్, డి.విజయరామ్ రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సునీతా మహేందర్ రెడ్డిని గెలిపిద్దాం



- సీపీఐ(ఎం), సీపీఐ, కాంగ్రెస్, టీజేఎస్ నాయకులు

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఇండియా కూటమి అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సీపీఐ, సీపీఐ(ఎం), కాంగ్రెస్, టీజేఎస్ నాయకులు పిలుపునిచ్చారు. సీపీఐ, సీపీఐ(ఎం) పార్టీల ఆధ్వర్యంలో షాపూర్‌నగర్ ఏఐటీ యూసీ కార్యాలయంలో ఉమా మహేష్, కీలుకానీ లక్ష్మణ్ అధ్యక్షతన ఇండియా కూటమి కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ, టీజేఎస్ పార్టీల సమావేశానికి ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వినోద్ రెడ్డి, సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ పి.సత్యం, కుత్బుల్లాపూర్ నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హన్మంత్ రెడ్డి, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, మల్కాజిగిరి పార్లమెంట్ సమన్వయ కర్త గుంజ శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లా డుతూ... గత 10 సంవత్సరాలుగా బీజేపీ ప్రజల హక్కులను కాలరాస్తూ దేవుడు పేరుతో మోసం చేస్తూ అచ్చా దీన్ పేరుతో ప్రతీ పేదవాడికి రూ.15 లక్షలు అకౌంట్లో వేస్తామని చెప్పి, ప్రజలను మోసం చేశారన్నారు. దేశ సంపదను మొత్తం కార్పొరేట్ సంస్థలకు ఆదాని, అంబానీలకు అప్పచెప్పుతూ ప్రజల దృష్టి మళ్లించేందుకు దేవుడి పేరుతో, మతం పేరుతో ఓట్ల నడుగుతూ దేశ సమైక్యత సమగ్రతలకు భంగం కలిగి స్తున్నరని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగా న్ని కూనీ చేయాలని చూస్తుందని రాజ్యాంగ వ్యవస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత దేశంలో ఉన్న ప్రజల మీద ఉందని తెలిపారు. అందుకే మే 13వ తారీకు జరుగు పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ దాని మిత్రపక్షాలను ఓడించాలని.. దేశ సమైక్యత సమగ్రతలను కాపాడే వామపక్ష లౌకిక పార్టీలను గెలిపించాలని మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డిని అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ పి.సత్యం, సీపీఐ రాష్ట్ర నాయకులు ఎండి యూసుఫ్, ఏసురత్నం, టీజేఎస్ నాయకులు ఆంజనే యులు, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి, సీపీఐ(ఎం) మండల కమిటీ నాయకులు పసుల అంజయ్య, కాంగ్రెస్ పార్టీ నాయ కులు పాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్ : కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలానగర్‌లోని చరబండ రాజు కాలనీలో సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో ఇంటిటికీ కరపత్రాలు పంచుతూ ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపీగా పోటీ చేస్తున్న ఇండియా కూటమి అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డిని గెలిపించాలని మంగళవారం ప్రచారం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి ఐలాపురం రాజశేఖర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మే 13న జరిగే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ దాని మిత్రపక్షాలను ఓడించాలన్నారు. పదేండ్ల మోడీ పాలనలో ప్రజల సమస్య లను పరిష్కరిం చడంలో విఫలమైందని, ఎమర్జెన్సీని తలపించిన నియంతృపు పొగడలతో రాజ్యాంగ మౌలిక సూత్రాలైన ప్రజాస్వామ్య లౌకిక విలువల మీద దాడి చేస్తుందని తెలిపారు. మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేసి మతరాజ్యం స్థాపించాలని ప్రయత్నిస్తుందని అన్నారు. గత 50 ఏండ్లలో గరిష్ట స్థాయికి నిరుద్యోగం పెరిగి పెద్ద నోట్ల రద్దుతో లక్షలాది మందికి ఉన్న ఉపాధికి పోయిందన్నారు. అయినప్పటికీ ఉపాధి హామీ పథకాన్ని పట్టణాలకు విస్తరింప చేయకుండా కేంద్ర ప్రభుత్వం దీని మీద మరింత నీరుగార్చిందని, బీజేపిని ఓడించి, దేశాన్ని రక్షించాలని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల న్నారు. ఈ కార్యక్ర మంలో జి.జగన్, పి.శంకర్, పి.రాజు తదితరులు పాల్గొన్నారు.



గడ్డం రంజిత్ రెడ్డిని గెలిపించండి

- కాంగ్రెస్ నాయకుడు జీవీఆర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని, శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని కూకట్‌పల్లి డివిజన్ హనుమాన్ నగర్‌లో, పార్లమెంట్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డికి మద్దతుగా, శేరిలింగంపల్లి నియోజక వర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ ఆదేశాల మేరకు, హనుమాన్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు విఠల్, డివిజన్ నాయకులు మందుల శివ కుమార్ ఆధ్వర్యంలో... ఇంటింటి ప్రచారం, పాదయాత్రలో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వర రావు పాల్గొన్నారు. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని మరోసారి అత్యధిక మెజార్టీ అందించి గెలిపించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు సోపాన్ రావు, పోషాల రాజు, వెంకటేష్ యాదవ్, కృష్ణ శ్రీకాంత్ రెడ్డి, డేవిడ్, మల్లేష్, నర్సింహ చారి, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో వీడ్కోలు సమావేశం



నవతెలంగాణ-దుండిగల్

మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మంగళవారం ఈసిఈ విభాగానికి చెందిన విద్యార్థులకు జూనియర్లు వారి సీనియర్లకు ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి జె.త్రిశూల్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ తమ కళాశాలలో చదివిన విద్యార్థులకు మంచి ప్రాంగణ నియామకాలు వచ్చినందుకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఆర్.లోకనాథం మాట్లాడుతూ తమ కళాశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఈసిఈ విభాగాధిపతి డా. పురుషోత్తమ ప్రసాద్ విద్యార్థులను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ... ప్రతీ ఒక్కరు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, తద్వారా జీవితంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనే ధైర్యం కలవారావుతారని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్లు మాట్లాడుతూ తమకు కళాశాల ఒక తల్లి వంటిదని, ఈ కళాశాల ద్వారా ఎంతో నేర్చుకున్నామని పేర్కొన్నారు. తమకు వారి అధ్యాపకులు ఎప్పుడు అండగా నిలిచారని తెలిపారు. అలాగే జూనియర్లు వారి సీనియర్లను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ ఎప్పుడు మాకు స్ఫూర్తిగా నిలిచే మంచి మిత్రులను దూరం అవుతున్నామని తమ అనుభవాలను ఇరువురు పంచుకొని తమ మధ్య ఎప్పటికి స్నేహబంధం కొనసాగాలని ఘనంగా వీడ్కోలు తెలిపారు. అనంతరం జూనియర్లు సాంస్కృతిక, ఆట, పాటల కార్యక్రమాలు ఎంతో అలరించాయి. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మెన్ జె.నర్సింహారెడ్డి, కార్యదర్శి జె.త్రిశూల్ రెడ్డి, కోశాధికారి త్రిలోక్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా.ఆర్.లోకనాథం కళాశాల పలు విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షపు నీరే జీవనాధారం - కాపాడుకోవడం మన బాధ్యత

- మన హైదరాబాద్ నగరం ఒక బెంగళూరు కావద్దని తపన..
- పర్యావరణ ప్రేమికులు కె.రవీందర్ ముదిరాజ్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

వర్షపు నీరే జీవనాధారం-కాపాడుకోవడం మనందరి బాధ్యత అని పర్యావరణ ప్రేమికులు కె.రవీందర్ ముదిరాజ్ అన్నారు. మేడ్చల్ జిల్లా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సూరారంలో వేసవికాలంలో నీటి కొరత ఉండకూడదు, హైదరాబాదు మరో బెంగుళూరు కాకూడదు అనే సదుద్దేశంతో నీటి పొదుపు పై అవగాహన కల్పిస్తూ, ప్రచార వాహనం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులచే రవీందర్ ముదిరాజ్ ప్రారంభించారు. ఇంకుడు గుంతలు తీయ్యండి, ఉన్న గుంతలను సరిచేయండి.. ఉన్న చెరువులను కాపాడుకుందాం వాటిలో వర్షపు నీరు నిలువకు పూటిక మట్టిని తొలగించి భూగర్భజలాలు పెంచాలి. లేదంటే రాబోయే రోజుల్లో ఇంట్లో నీళ్ళను దోచుకొనే దొంగలు తయారు అవుతారు అని పేర్కొన్నారు. వానమ్మ వానమ్మ ఒక సారి రావమ్మ అంటూ ప్రచారం రథంపై విన్నూత్నంగా ప్రచారం చేస్తున్నారు. రాబోవు తరాలకు నీటి కొరత ఉండకూడదు వర్షపు నీటిని పొదుపు ఎలా చేయాలనే విధంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తూ నగరం నలు మూలల ప్రచారం చేస్తున్నారు.

రోడ్డు ఆక్రమణలు చోద్యం చూస్తున్న అధికారులు



- బస్తీ అధ్యక్షుడు గంగని నగేష్

నవతెలంగాణ-హయత్‌నగర్

రోడ్డు కబ్జా చేస్తున్నారని ఫిర్యాదు చేసినా మామూళ్ల మత్తులో అధికారులు, సిబ్బంది పట్టించుకోకుండా కాలం గడుపుతున్నారని రంగారెడ్డి జిల్లా హయత్ నగర్‌లోని పాత గ్రామం హరిజన బస్తీ వాసులు ఆరోపిస్తున్నారు. బస్తీ అధ్యక్షుడు గంగని నగేష్, పలువురు బస్తీ వాసులు మీడియాతో మాట్లాడుతూ బస్తీలో ఒక వ్యక్తి దర్జాగా రోడ్డు ఆక్రమించి గృహ నిర్మాణం చేపడుతున్నాడని తాము అధికారులకు చెప్పగా ఎలాంటి స్పందన రాలేదన్నారు. ఇంకాస్త ఓపిక చేసుకుని ఈసారి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. అయితే అధికారులు వారికి రావలసిన సొమ్ము తీసుకుని ప్రజలు ఏమైపోతే ఏంటి అన్నట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సదురు ఇంటి యజమాని జీహెచ్ఎంసీలో పనిచేస్తున్నారని, అందుకే చర్యలు తీసుకోబోమని చైన్‌మన్ అంటున్నారని తెలిపారు. ఇకనైనా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బస్తీ ఉపాధ్యక్షులు బోడి యాదయ్య, జెనిగె కుమార్, ప్రధాన కార్యదర్శి గంగని శ్రీను, సంయుక్త కార్యదర్శులు బోడ శ్రీరాములు, దుబ్బాక యాదగిరి, కోశాధికారి జెనిగె శంకర్, కన్వీనర్ జాయ ఈశ్వర్, కార్యవర్గ సభ్యులు జెనిగె పురుషోత్తం, పాడిగిల ప్రభు తదితరులు పాల్గొన్నారు.

బీసీలంతా ఏకమైతేనే రాజ్యాధికారం సాధ్యం



- బీసీ జర్నలిస్టులు సోషల్ మీడియా వారియర్లుగా మారాలి
- ఓబీసీ సెల్ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు .. డాక్టర్ కే.లక్ష్మణ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

రాజ్యాధికారం కోసం మరో ఉద్యమం చేపట్టాలి, బీసీ జర్నలిస్టులు సోషల్ మీడియా వారియర్లుగా మారాలి అని రాజ్యసభ సభ్యులు, ఓబీసీ సెల్ అధ్యక్షులు డాక్టర్ కే లక్ష్మణ్ అన్నారు. మంగళవారం నగరంలోని సెంట్రల్ కోర్టు హోటల్‌లో జరిగిన బీసీ జర్నలిస్టుల సమావేశంలో ముఖ్య అతిథిగా డాక్టర్ లక్ష్మణ్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీల రాజ్యాధికారం కోసం బీసీ జర్నలిస్టులు సోషల్ మీడియా వారియర్లుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. అగ్రకులాల చేతిలో మీడియా సంస్థలు ఉన్నప్పటికీ పనిచేస్తున్నది బీసీ జర్నలిస్ట్ లేనని ఈ సందర్భంగా తెలిపారు. దేశంలో బీసీలకు రిజర్వేషన్లు పెట్టాలని, ఇందులో భాగంగా కాకా కలేకర్ కమిషన్ వేస్తే దానిని కనుమరుగు చేసింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం తర్వాత సూచించిన నేపథ్యంలో, నెహ్రూ మూలంగా బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు రాలేకపోయాయని అన్నారు. బీసీలు కేవలం ఎవరి కులాలకు వారు కాకుండా బీసీ కులాలు అందరూ ఏకమై బీసీలుగా ముందుకు సాగితే బీసీలు రాజ్యాధికార దిశగా అడుగులు వేయవచ్చన్నారు. బీసీ జర్నలిస్టులు ఏకమై ఎక్కడికక్కడ సోషల్ మీడియా ద్వారా సమాజంలో అత్యధిక శాతం ఉన్న బీసీల పక్షాన ముందు వరుసలో ఉండి పోరాటాన్ని కొనసాగించాలన్నారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సీనియర్ జర్నలిస్టు శిల్వేరి శ్రీశైలం మాట్లాడుతూ బుద్ధి జీవులైన జర్నలిస్టులు అందరూ ఏకమై బీసీ రాజ్యాధికార దిశగా కార్యచరణ రూపొందించాలని సూచించారు. బీసీ జర్నలిస్టుల వాదం గ్రామ గ్రామాన ప్రతి ఒక్కరిని ఆలోచించే విధంగా కార్యచరణ రూపొందించి, భవిష్యత్తులో బీసీ జర్నలిస్టులు పెద్దన్న పాత్ర పోషిస్తేనే బీసీల రాజ్యాధికారం సాధ్యమన్నారు. స్వాగత ఉపన్యాసం సీనియర్ జర్నలిస్ట్ విద్య వెంకట్ చేశారు. సీనియర్ జర్నలిస్ట్ ప్రభంజన్ యాదవ్ మాట్లాడుతూ అనాదిగా అగ్రకులాల నేతలు అందరూ ఏకమై ఎదుగుతున్న బీసీ నాయకులను అణగదొక్కే ధోరణి మొదటి నుంచి వస్తుందని అన్నారు. కాళోజి టీవీ సీఈవో దాసరి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత ఎన్నికల్లో ప్రభుత్వం మాత్రమే మారిందని, వెలమ దొర ప్రభుత్వం పోయి, రెడ్డిలు అధికారంలోకి వచ్చారని, తద్వారా బీసీలకు న్యాయం జరిగిందని అన్నారు. బీసీ జర్నలిస్టులు అందరం ఏకమై బిసి రాజ్యాధికార దిశగా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు గోపి యాదవ్, కోట్ల చంద్రకాంత్, సతీష్ ముదిరాజ్, తేళ్ల హరికృష్ణ, కూకట్‌పల్లి బీసీ జర్నలిస్టులు పాల్గొన్నారు.

రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి



- కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి డివిజన్ నుంచి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలిపే లక్ష్యంగా మంగళవారం కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ డివిజన్ పరిధిలోని వసంత్ నగర్, సర్దార్ పటేల్ నగర్, సాయి నగర్ కాలనీలో ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ హయాంలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో కేపీహెచ్ బీ డివిజన్ ను ఆదర్శ డివిజన్ గా తీర్చిదిద్దుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ, హేమ, కృష్ణకుమారి, పద్మా రెడ్డి, పద్మవతి, సుబ్బలక్ష్మి నాయకులు, కార్యకర్తలు, మహిళ నాయకులు, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయం'



నవతెలంగాణ-బాలానగర్

మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ మంగళవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బలపరిచిన రాగిడి లక్ష్మారెడ్డి కారు గుర్తుపై ఓటుతో గెలిపించాలని కోరారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ప్రభాకర్ రెడ్డి నగర్, జింకల వాడ, సమతానగర్ తదితర బస్తీలలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, మహిళా సంఘం నాయకు రాళ్లు పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు.

బాలానగర్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు మల్కాజిగిరి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా కూకట్‌పల్లి నియోజక వర్గం బాలానగర్ డివిజన్ పరిధిలో మంగళవారం బాలా నగర్ డివిజన్‌లోని శ్రీశ్రీ నగర్, రాజీవ్ గాంధీ నగర్, ఎన్టీఆర్ నగర్ ఇంద్రానగర్‌లో స్థానిక బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీల, బస్తీల అసోసియేషన్ సభ్యులు శ్రీ శ్రీ నగర్ కమాన్ వద్దకు చేరుకుని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులతో పాటు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు.



బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకోవాలి



- ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకనంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ 131 డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే కేపీ. వివేకానంద ముఖ్య అతిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ డివిజన్ నందు గల కాలనీలలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ ప్రతి ఒక్క ఓటరును కలిసి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు అవసరాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కే.ఎం.గౌరీష్, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు కిషోర్ చారి, మహిళా నాయకురాలు అరుణ, స్వప్న, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

రాగిడి లక్ష్మారెడ్డి విజయానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలి..

రాగిడి లక్ష్మారెడ్డి విజయానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకనంద్ అన్నారు. 130- సుభాష్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపుకు మద్దతుగా మంగళవారం నిర్వహించిన ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పాల్గొని ప్రచార కార్యక్రమంపై నాయకులు, కార్యకర్తలకు విషయాన్ని దిశానిర్దేశం చేశారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జి. హేమాలతా సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, డివిజన్ సీనియర్ నాయకులు డాక్టర్ హుస్సేన్, బలరాం రెడ్డి, బిజిలి సాంబయ్య, వలి భాయ్, పందిరి యాదగిరి, మహిళా అధ్యక్షురాలు మంగమ్మ, నాయకురాలు పద్మావతి, సత్యవాణి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మల్కాజిగిరి పార్లమెంట్లో గులాబీ జెండా ఎగరాలి : సూరారం 129 డివిజన్ టిఎస్ఐఐసి కాలనీ కమ్యూనిటీ హాల్ నందు మంగళవారం నిర్వహించిన ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ.. ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించే విధంగా విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించేలా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, సీనియర్ నాయకులు దొడ్ల శ్రీను, చెక్క సురేష్, శ్రీనివాస్ రెడ్డి, బషీరుద్దీన్, సాయిబాబా, నేతి రాజా, సాజిద్, ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
బుధవారం | మే 08, 2024 | www.navatelangana.com

నవీన్ యాదవ్‌ను కలిసిన తీన్మార్ మల్లన్న



నవతెలంగాణ - జూబ్లీహిల్స్

త్వరలో జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమకు మద్దతు ఇవ్వాలని కోరుతూ తీన్మార్ మల్లన్న మంగళవారం జూబ్లీహిల్స్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌ను యూసఫ్ గూడా లోని ఆయ న నివాసానికి వెళ్లి కలిశారు. అలాగే సీనియర్ రాజకీయ నాయకుడు బీసీ నాయకులు చిన్నశ్రీశైలం యా దవ్‌ను కలిసి ఎమ్మెల్సీగా గెలిపించేందుకు మీ వంతు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. మీ అండదండలతో రాష్ట్రవ్యాప్తంగా స్పందన వస్తుందన్న ఆశాభావం తీన్మార్ మలన్న వ్యక్తం చేశారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

నవతెలంగాణ - చైతన్యపురి

ద్విచక్ర వాహనాలను దొంగలించి వాటిని విక్రయిస్తున్న వ్యక్తిని చైతన్యపుర పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం కు చెందిన పగడాల గణేష్ అనే కారు డ్రైవర్ నగరంలోని పలు పోలీసు స్టేషన్ల పరిధిలో ఇంటి తాళాలు పగలగొట్టి, కాలనీల్లో ద్విచక్ర వాహనాలను దొంగలించి, ఎంజీబీఎస్ , ఉప్పల్ మెట్రో స్టేషన్, బహిరంగ మార్కెట్లో విక్రయిస్తున్నాడు. వచ్చిన సొమ్ముతో జల్సాలకు, తాగుడికి అలవాటుపడ్డాడు. ఈ క్రమంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగ అతడిపై చైతన్యపురి లో 8, వనస్థలిపురంలో 1, ఎస్ ఆర్ నగర్ లో 1, హయత్ నగర్ లో 3, ఆదిబట్ల లో 2, సరూర్ నగర్‌లో 1, నాచారంలో 1, చౌటుప్పల్ లో 2, నారాయణ పూర్ లో 1, మలక్ పేట్‌లో 1 కేసు నమోదు అయ్యాయని తేలింది. నిందితుడి వద్ద నుంచి 15 ద్విచక్ర వాహనాలను, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ కు తరలించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు 35- 40 సంవత్సరాలున్న ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 5 మెట్రో పిల్లర్ నెంబర్ 1558 వద్ద ఓ వ్యక్తి పడి ఉన్నాడని స్థానికులు 100,108 నెంబర్‌లకు డయల్ చేసి సమాచారం అందించారు. పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ ఏడు కొండలు అక్కడికి వెళ్ళటం జరిగింది. వ్యక్తి ముఖంపై, కాళ్లపై బలమైన ఆయుధాలతో గాయపరిచినట్టు ఉండి తీవ్ర రక్తస్రావం జరిగినట్టు గుర్తించారు. పోలీసులు ఆ వ్యక్తి కాళ్ల ,చేతులు కదలికను గుర్తించి వెంటనే గాంధీ హాస్పి టల్‌కు తరలించారు. అక్కడ వైద్యం చేస్తుండగానే తెల్లవారు జామున పరిస్థితి విషమించి మృతిచెందాడు. బలమైన ఆయుధాలతో చంపాలనే ఉద్దేశంతోనే గాయపరిచారని డాక్టర్లు నిర్ధారించారు. గుర్తుతెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చనిపోయిన వ్యక్తి నలుపు కలర్ ప్యాంటు, బ్రౌన్ కలర్ షర్టు ధరించి ఉన్నాడని, అతని ఎత్తు 5.5 ఉంటుందని, వెంట్రుకలు నల్లగా ఉన్నాయని ఎవరైనా మృతదేహాన్ని గుర్తించిన ఎడలా జూబ్లీహిల్స్ ఇన్స్పెక్టర్ నెంబర్ 8712660460, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నెంబర్ 8712660462, జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ 8712661278 నెంబర్లకు తెలియపరచాలని పోలీసులు కోరారు.



కాంగ్రెస్‌లో చేరిన రాజనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ నాయకులు

నవతెలంగాణ - జూబ్లీహిల్స్

బోరబండ డివిజన్ రాజ్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు బీఆర్‌ఎస్‌కు మంగళవారం రాజీనామా చేశారు. అనంతరం సభ్యులంతా బోరబండ కార్పొరేటర్ మాజీ డిప్యూటీ మేయర్ బాబా పసివుద్దిన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు వారికి కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. పార్టీ మారిన నాయకులు మాట్లాడుతూ ప్రజా పాలన, ఆరు గ్యారెంటీల సంక్షేమ పథకాలు నచ్చి, నగర మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దిన్ నాయకత్వంలో పనిచేయాలని కాంగ్రెస్‌లో చేరినట్టు తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో రాజీవ్ నగర్ అధ్యక్షులు జై భీమ్ యాదగిరి, కమిటీ సభ్యులు శ్రీకాంత్, నందా గౌడ్, చారి, సాయి, ఓంకార్ ఉన్నారు.



తెలంగాణలో దాడులు పెరిగాయి

- అందెల శ్రీరాములు

నవతెలంగాణ - బంజారాహిల్స్

4 నెలల్లో 4 దిక్కుల దాడులు పెరిగాయని,మళ్లీ తెలంగాణలో రజాకార్ల పాలన వస్తోందని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుర్రంగూడకు చెందిన సబావత్ రాజు అనే యువకుడిపై పాతబస్తీ చెందిన అల్లరి మూక దాడి నేపథ్యంలో మంగళవారం నిమ్స్ ఆస్పత్రిలో బాధితుడిని ఆయన పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడిని తీవ్రంగా ఖండించారు. ఓ వర్గం ఆటవిక చర్యలకు పాల్పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం శాంతిభద్రతలను కాపాడటం లేదని ఆరోపించారు. దేశంలో కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో మతోన్మాదులు రెచ్చిపోతున్నారని అందుకు నిదర్శనమే మొన్న కర్ణాటకలో విద్యార్థిని హత్య అన్నారు. రజాకార్ల పాలనను కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. రాజు కుటుంబానికి ఆర్థిక సహాయం ప్రభుత్వం అందించి ఆస్పత్రి ఖర్చులు భరించాలని శ్రీరాములు యాదవ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ బడంగ్ పేట కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకటరెడ్డి, గుర్రంగూడ కార్పొరేటర్ గడ్డం లక్ష్మారెడ్డి సహా బాధితుడి బంధువులు, స్థానికులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

రహమత్ నగర్‌లో ఎమ్మెల్యే గోపీనాథ్ ఆదేశాల మేరకు రహమత్ నగర్ వార్డు మెంబర్ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక మహిళలు సుజాత నాయకత్వంలో ఇంటింటికి తిరిగి బీఆర్‌ఎస్ కండువాలు ఓటర్లకు మెడలో వేసి బొట్టు పెట్టి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ సికింద్రాబాద్ పార్లమెంటు అభ్యర్థి పద్మారావు గౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అరుణ్ కుమార్ మాట్లాడుతూ రహమత్ నగర్ బీఆర్‌ఎస్ పార్టీకి కంచుకోట అని వచ్చే ఎన్నికల్లో ప్రజలు నిరూపిస్తారని అన్నారు.



హబీబా సుల్తానా ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ - జూబ్లీహిల్స్

బోరబండ డివిజన్ లోని మధుర నగర్, భరత్ నగర్‌లలో బోరబండ కార్పొరేటర్, బాబా ఫసియుద్దిన్ సతీమణి హబీబా సుల్తానా మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ కరపత్రాలు పంచుతూ కాంగ్రెస్ అభ్యర్థి దానం నగేందర్‌కు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆమెతో పాటు మహిళలు భారీగా పాల్గొన్నారు.

కుమ్మేసిన వాన

- నగరంలో భారీ వర్షం..
- జలమయమైన రోడ్లు
- చెరువులను తలపించిన కాలనీలు, ప్రధాన రోడ్లు
- ఇండ్లలోకి నీరు చేరడంతో ఇబ్బందులు పడిన జనం







నవతెలంగాణ-సిటీబ్యూరో

భానుడి భగభగతో అల్లాడుతున్న నగరవాసులకు ఒక్కసారిగా కురిసిన భారీ వర్షంతో కాస్త ఉపశమనం లభించింది. దీంతో మంగళవారం సాయంత్రం జంట నగరాలు ఒక్కసారిగా చల్లబడ్డాయి. గ్రేటర్‌లో పలుచోట్ల ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. గంటకు 40 కిలోమీటర్ల వేగంతో కూడిన గాలులతో వర్షం పడడంతో జనం తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా నగరంలో భారీ వర్షం దెబ్బకు ప్రధాన రహదారులు, కాలనీలు చెరువులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నాలాలు, డ్రైయినేజీలు పొంగి పొర్లాయి. పలు బస్తీలు, కాలనీలోని ఇండ్లలోకి వర్షం నీరు చేరడంతో స్థానికులు అవస్థలు ఎదుర్కొన్నారు. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారుల చాలా ఇబ్బంది పడ్డారు. నగరంలోని సికింద్రాబాద్, చిలకలగూడ, మారేడుపల్లి, బోయిన్‌పల్లి, ప్యారడైజ్, ప్యాట్నీ, మలక్‌పేట, ఎర్రగడ్డ, అమీర్‌పేట, యూసఫ్‌గూడ, అల్వాల్, ఎల్బీనగర్, కాప్రా, సుచిత్ర జీడిమెట్ల, ముషీరాబాద్, చిక్కడపల్లి తదితర ప్రాంతాల్లో రోడ్లపైకి వరదనీరు చేరగా.. మియాపూర్, చందానగర్, గచ్చిబౌలి, రాయదుర్గం, కొండాపూర్‌లో రోడ్లపై భారీగా వర్షం నీరు చేరడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. రాయదుర్గం బయోడైవర్సిటీ నుంచి ఐకీయా వరకు, ఖాజాగూడ చౌరస్తా నుంచి డీపీఎస్ వరకు వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఐటీ కారిడార్‌లో వాహనాలు నెమ్మదిగా కదిలాయి. పలు చోట్ల చెట్లు విరిగి పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షం, ఈదురు గాలుల వల్ల పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మరో రెండు రోజుల పాటు తెలికపాటి నుంచి ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. పలుచోట్ల ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం కురిసే అవకాశమున్నట్టు పేర్కొంది. నగరంలో ఆకస్మాత్తుగా కురిసిన వర్షంతో మెట్రో రైలు సేవలకు ఎలాంటి ఆటంకం కలగలేదని, మూడు కారిడార్లలో మెట్రో రైళ్లు నడుస్తున్నాయని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రంగంలోకి దిగిన డీఆర్‌ఎఫ్ బృందాలు

నగరంలో కురిసిన భారీ వర్షం.. వాటి పరిస్థితులపై జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ సమీక్షించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎఫ్ సిబ్బంది, అధికారులను అప్రమత్తం చేశారు. రోడ్లపై నిలిచిపోయిన నీటిని విరిగిపడ్డ చెట్ల కొమ్మలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులందరూ వారి వారి ప్రాంతాల్లోని పరిస్థితిని సమీక్షించాలని, జీహెచ్ఎంసీ కంట్రోల్ రూమ్‌కి వచ్చే సమస్యలను క్షేత్రస్థాయి సిబ్బందికి వెంటనే తెలియజేయాలని కమిషనర్ ఆదేశించారు. నగర ప్రజలు ఏమైనా సమస్యలు ఎదుర్కొంటే జీహెచ్ఎంసీ కాల్‌సెంటర్ 040-21111111 లేదా 90001133667కు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. గ్రేటర్‌లో భారీ వర్షం నేపథ్యంలో సహాయక చర్యల కోసం డీఆర్‌ఎఫ్ టీమ్స్ రంగంలోకి దిగాయి. గ్రేటర్‌వ్యాప్తంగా సుమారు 50 ఫిర్యాదులు అందగా.. ఇందులో చెట్లు విరిగాయని 34 ఫిర్యాదులు రాగా.. రోడ్లపై నీరు నిలిచిందని 16 మంది నుంచి కాల్స్ వచ్చాయి. సమాచారం అందుకున్న డీఆర్‌ఎఫ్ బృందాలు సహాయక చర్యలు అందించాయి. 74 ప్రాంతాల్లో రోడ్లపై వర్షపు నీరు నిలిచినట్టుగా సంబంధిత అధికారులు గుర్తించారు.

ఏరియా	వర్షం సె.మీటర్లలో
మియాపూర్	10.8
కూకట్‌పల్లి	10.7
చందానగర్	9.3
ఖైరతాబాద్	8.6
సికింద్రాబాద్	8.4
బాలాజీనగర్	8.3
ఆర్సీపురం	8.3
లింగంపల్లి	8.3

టీఎస్ సెట్ ఎగ్జామ్ తేదీలను మార్చాలి

- ఏఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు సోంపంగి అఖిల్



నవతెలంగాణ-ఓయూ

టీఎస్ సెట్ ఎగ్జామ్ తేదీలను మార్చాలని ఏఎసయూ రాష్ట్ర అధ్యక్షులు సోంపంగి అఖిల్ కోరారు. ఈ మేరకు మంగళవారం టీఎస్ సెట్ సెక్రెటరీ మెంబెర్ ప్రొ. నరేష్ రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ ఇటీవల విడుదల చేసిన గ్రూప్ 1 ఫిలిమ్స్ జూన్‌లో, గ్రూప్ 2 ఆగస్టులో, గ్రూప్ 3 నవంబర్‌లో, టెట్ ,డీఎస్సీ మే ,జూన్ ,ఆగస్టులో తోపాటు వివిధ ఎగ్జామ్స్ వరుసగా ఉన్న నేపథ్యంలో వివిధ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న వారే సెట్ కూడా ప్రిపేర్ కావడం జరుగుతుందని వారికి సమయం ఇవ్వాలని కోరారు. ఇప్పటికే గత సంవత్సరం పేపర్ లీకేజీలు, వరుస ఎగ్జామ్స్ వాయిదాల వల్ల ఎంతో మనోవేదనకి గురై, ఆర్థికంగా కంగిపోయిన నిరుద్యోగ విద్యార్థులు ఇప్పుడిప్పుడే కుదుటపడి ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అవుతు న్నారని తెలిపారు. మళ్లీ సెట్ ఎగ్జామ్ కూడా ఇప్పుడే పెట్టడం వల్ల విద్యార్థి నిరుద్యోగులు ఆందోళనకు గురవుతున్నా రన్నారు. విద్యార్థుల వినతిని పరిగణలోకి తీసుకోవాలని టీఎస్ సెట్ సెక్రటరీ మెంబెర్‌ను కోరారు. టీఎస్ సెట్ సెక్రటరీ మెంబర్ ప్రో. నరేష్ రెడ్డి సాను కూలంగా స్పందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి వడ్డేపల్లి సందీప్ పాల్గొన్నారు.

అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలి

- జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి ఆదేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలి అధికారులు సమస్యాత్మకమైన రోజూ క్షేత్ర స్థాయిలో పర్యటించాలని ఎండీ సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో ఎండీ సుదర్శన్ రెడ్డి మంగళవారం జలమండలి అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగరంలో తాగునీటి సరఫరా, ట్యాంకర్ మేనేజ్ మెంట్ స్ట్రాటజీ, ఎంసీసీ ఫిర్యాదులు, చలివేంద్రాల నిర్వహణపై వివరాలు ఎండీ అడిగి తెలుసుకున్నారు. ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా ట్రిప్పుల సంఖ్య పెంచాలని చెప్పారు. ఎంసీసీ ఫిర్యాదులపై దృష్టి సారించాలన్నారు. అలాగే వాట్సాప్, ఫేస్ బుక్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఫిర్యాదులపై ఆరా తీశారు. కలుషిత నీటి ఫిర్యాదులు వస్తే.. తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. చలివేంద్రాల సంఖ్య పెంచాలన్నారు. అవసరమైన చోట్ల వాటిని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. నిర్దేశిత సమయంలో ప్రజలకు వాటి ద్వారా తాగు నీరు అందించాలన్నారు. మరోవైపు జలమండలి ఉన్నతాధికారులు సమస్యాత్మకమైన ప్రాంతాల్లో రోజూ క్షేత్ర స్థాయిలో పర్యటించాలని చెప్పారు. అవసరమైతే సంబంధిత ప్రాంతాల్లో ఆకస్మిక పర్యటనలు చేయాలన్నారు. కింది స్థాయి సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకోవాలని పేర్కొన్నారు. క్వాలిటీ వింగ్ అధికారులు నీటి నాణ్యతలో రాజీ పడకూడదన్నారు. తగిన మోతాదులో క్లోరిన్ శాతం ఉండేలా చూడాలని సూచించారు. వర్షాకాల ప్రణాళిక కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్మికులు, సిబ్బందికి ఇచ్చే రక్షణ పరికరాలు సరిపడా ఉన్నాయో లేదో చూసుకోవాలన్నారు. పని జరిగే ప్రాంతంలో రక్షణ చర్యలు చేపట్టేలా చూడాలని ఆదేశించారు. ఎస్పీటీ వాహనాల ద్వారా పర్యవేక్షించాలని తెలిపారు. సీవరేజ్ ఓవర్ ఫ్లో సమస్యలు రాకుండా.. సివర్ జెట్టింగ్ మిషన్లు ఉపయోగించుకోవాలన్నారు. ఈ సమీక్షలో డైరెక్టర్ ఆపరేషన్స్ - 1 అజ్మీరా కృష్ణ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్ - 2 స్వామి, టెక్నికల్ డైరెక్టర్ రవి కుమార్, సీజీఎంలు, జీఎంలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'ఉస్మానియా ఫిల్మ్ క్లబ్' లోగో ఆవిష్కరణ



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ)లో మంగళవారం రాత్రి ఉస్మానియా ఫిల్మ్ క్లబ్ లోగోను ఓయూ వీసీ ప్రో.రవీందర్ ,రిజిస్ట్రార్ ప్రో.లక్ష్మి నారాయణలు ఆవిష్కరించారు. అధికారికంగా ప్రారంభించినట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "ఉస్మానియా ఫిల్మ్ క్లబ్" పతాకం కింద లఘు చిత్రాలను రూపొందించడానికి కళాకారులను ఒకచోట చేర్చడం ద్వారా ఉస్మానియన్ల మధ్య ఐక్యత, సమానత్వాన్ని ప్రదర్శించడం ఈ చొరవ లక్ష్యం అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని వివిధ క్యాంపస్ కళాశాలల విద్యార్థుల సమిష్టి కృషి నుంచి క్లబ్ వెనుక ఉన్న ఆలోచన ఉద్భవించిందన్నారు.

విద్యార్థులు విభిన్న నేపథ్యాలు, విభాగాలకు చెందిన కళాకారులను వారి ప్రతిభను పెంపొందించడానికి, వారిని నైపుణ్యం కలిగిన చిత్రనిర్మాతలుగా మార్చడానికి ఏకం చేయడంలో నాయ కత్వం వహించారు. వారి అంకితభావానికి నిదర్శనంగా, 107వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో భాగంగా ఇటీవల జరిగిన తక్ష కార్యక్రమంలో "ఓకా ఉషస్సు" అనే లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఉస్మానియా ఫిల్మ్ క్లబ్ ను ప్రాతినిధ్యం వహిస్తున్న డాక్టర్ లోకేష్, ప్రణయ్, విజయ, నిఖిల్, సుశోభన్ ను ఓయూ వీసీ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీసీ ప్రొ. డి. రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ. లక్ష్మీనారాయణ, విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొ. రాజేంద్ర నాయక్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మహ్మద్ అక్తర్ అలీ, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ ప్రొ.పి. నవీన్ కుమార్ పాల్గొన్నారు. ఓయూ ఫిల్మ్ క్లబ్ సృజనాత్మకత వృద్ధి చెందడానికి, సరిహద్దులు అస్పష్టంగా ఉండటానికి మరియు కథలు ప్రతిధ్వనించే వేదికగా ఉంటుందని, ఇది ఓయూలో గొప్ప ప్రతిభను ప్రతిబింబిస్తుందన్నారు.

'మహేశ్వరం' నిధులు 'కొడంగల్'కు ఎలా తరలిస్తారు..?

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కోరిక మేరకు ఆనాడు మాజీ సీఎం కేసీఆర్ మహేశ్వరం నియోజకవర్గానికి మెడికల్ కళాశాల అభివృద్ధి కోసం రూ.170 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేస్తే మెడికల్ కళాశాలను సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ కు తరలించి, రూ.170 కోట్ల ప్రత్యేక నిధులు రదు చేయడం ఎంత వరకు సమంజసమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ ప్రశ్నించారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న గాంధీ నగర్ చౌరస్తాలో సోమవారం రాత్రి మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు షోలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలను పరిష్కారించడంలో పూర్తిగా విఫలమైనట్లు తెలిపారు ప్రధాని నరేంద్ర మోడీ సైతం గత ఎన్నికల సమయంలో మహిళల జన్ ధన్ ఖాతాలో నేరుగా రూ.15లక్షల వేస్తామని,సంవత్సరంలో 2కోట్ల ఉద్యోగాలు ఇలా అనేక హామీ ఇచ్చి అమలు చేయడంలో విఫలం అయ్యాడని మండి పడ్డారు. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చిన బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ కు ప్రజలు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ ,కాంగ్రెస్ ప్రభుత్వాలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. రోడ్డు షో విజయవంతం చేసిన మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులకు, నాయకులు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఇదే ఉత్సాహం ఈ నెల 13న జరిగే ఎన్నికల వరకు కొనసాగించి సమిష్టిగా కష్టపడి చేవెళ్ల పార్లమెంట్‌లో కాసాని జ్ఞానేశ్వర్ కు ఓట్లు వేసి హ్యాట్రిక్ విజయం సాధించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, పార్టీ రాష్ట్ర నాయకులు పి.కార్తిక్ రెడ్డి,పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి జలమయమైన రోడ్లు




నవతెలంగాణ- నాగోల్

గ్రేటర్ హైదరాబాద్‌లో మంగళవారం సాయంత్రం విపరీతమైన గాలులు వీస్తూ ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దాంతో అకాల వర్షానికి నాగోలు డివిజన్‌లో రోడ్లన్నీ జలమయంగా మారాయి. ప్రభుత్వ ,ప్రయివేటు ఉద్యోగస్తులు ఇతర పనుల నిమిత్తం వివిధ ప్రాంతాలకు వెళ్ళిన వారు తమ తమ ఇండ్లలోకి చేరుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. గత రెండు మాసాల నుండి మండుతున్న ఎండలకు వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షంతో కొంత చల్లబడి ఉపశమనం కలిగినట్టు అయ్యింది. వర్షానికి రోడ్లపై ఎక్కడపడితే అక్కడ నీరు నిలిచిపోవడంతో ఎక్కడ మ్యాన్‌హోల్ తెరిచి ఉందోనని, ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనాదారులు భయాందోళన చెందుతూ తమ తమ ఇండ్లకు చేరుకోవాల్సి వచ్చింది.



భారీ వర్షానికి నేలకొరిగిన చెట్లు





హైదరాబాద్‌లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో ఈదురు గాలులకు పలు వృక్షాలు నేలకొరిగాయి. ట్రాన్స్‌ఫారాలు పేలిన ఘటనలూ చోటుచేసుకున్నాయి. రహదారులపై ఏర్పాటు చేసిన చిన్నచిన్న హెూర్డింగులు వర్ష బీభత్సానికి కొన్ని చొట్ల విరిగిపడ్డాయి. మ్యాన్ హెూళ్లు పొంగిపోయి ట్రాఫిక్ స్తంభించింది.

నవతెలంగాణ-బంజారాహిల్స్



13
నవతెలంగాణ
హైదరాబాద్
HMDA
బుధవారం | మే 08, 2024 | www.navatelangana.com

బీఆర్ఎస్ పాలనతోనే ప్రజా సంక్షేమం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

బీఆర్ఎస్ పాలనతోనే ప్రజాసంక్షేమం సాధ్యమని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి రింగుబస్తీ ప్రాంతంలో పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన పదేండ్లల్లో ఎంతో గణనీయమైన అభివృద్ధితో పాటు, సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. పథకాల అమలులో దేశంలోనే నెంబర్ వన్ స్థాయికి చేరిందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పాలకులు ఢిల్లీ నేతలకు తలలు ఆడించాల్సిందే తప్ప ఇక్కడ చేసేది ఏమీ ఉండదని ఎద్దేవా చేశారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కరపత్రాలు పంచుతూ ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, కొలుకుల జైహింద్, యూత్ నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కులాల ఓట్లు..నేతల పాట్లు

- పార్లమెంట్ ఎన్నికల్లో ఇవే కీలకం
- వీటిపైనే ప్రధాన పార్టీల దృష్టి
- గంపగుత్తగా వేసుకునేందుకు ప్లాన్
- సామాజిక వర్గాల వారీగా మంతనాలు
- ముందస్తు హామీలు.. నజరానాలు..!



నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్లమెంట్ ఎన్నికల ప్రచారం రోజురోజుకూ ముమ్మరం అవుతోంది. చివరి దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల అభ్యర్థుల ఖరారు, నామినేషన్లు, ఉపసంహరణ ఘట్టం ముగియడంతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రాజకీయ వేడి రగులుకుంది. ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు అనుచరుల్లోని ముఖ్యులను రంగంలోకి దింపి ఓటర్లను ఆకర్షించేందుకు యత్నిస్తున్నారు. ప్రధానంగా సామాజికవర్గాల వారీగా ఓటర్ల మద్దతును కూడగట్టుకునేందుకు కుస్తీ పడుతున్నారు. కుల పెద్దలను రహస్యంగా సంప్రదిస్తున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఉన్న ఓట్లను సామాజికవర్గాల వారీగా గుర్తించి ఆకట్టుకునేందుకు బృందాలను ఏర్పాటు చేసి తీవ్ర కసరత్తు చేస్తున్నారు.

ఎత్తుకు పై ఎత్తులు..

ఎంపీ ఎన్నికల్లో అన్ని సామాజికవర్గాల మద్దతు లభిస్తే విజయం సునాయాసమన్న భావనలో అభ్యర్థులున్నారు. నియోజకవర్గాల వారీగా ఉన్న మొత్తం ఓటర్లలో ఎక్కువ ప్రాబల్యం కలిగిన ఓట్లను పరిగణనలోకి తీసుకుంటూ ఆయా సామాజికవర్గాలను ఆకట్టుకునేందుకు ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నారు. ఇప్పటికే ఓటర్ల తుది జాబితాను ఎన్నికల కమిషన్ విడుదల చేసిన నేపథ్యంలో ఏయే సామాజికవర్గానికి సంబంధించి ఓట్లు ఎక్కువగా ఉన్నాయనే విషయంపై ఆరా తీస్తున్నారు. గెలుపోటములను నిర్ధారించే పోలింగ్ బూత్‌లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గెలుపుబాటలో పయనించాలంటే తీసుకోవాల్సిన చర్యలపై మంతనాలు ముమ్మరం చేశారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎక్కువ ఓట్లు కలిగి ఉన్న సామాజికవర్గాన్ని గుర్తించి వారి మద్దతును తమవైపు తిప్పుకునే పనిలో పడ్డారు. ప్రతి నియోజకవర్గంలో 50 శాతం వరకు ఓటర్ల మద్దతు కూడగట్టుకుంటే విజయం తథ్యమనే భావన అభ్యర్థుల్లో నెలకొంది. దీంతో ఇప్పటికే పలు రాజకీయ పక్షాలకు అనుకూలంగా వ్యవహరించే ఓటర్లను మినహాయించి తటస్థంగా ఉన్నవారిపై దృష్టి సారిస్తున్నారు.

కులపెద్దలతో సంప్రదింపులు

ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు కులాలు, మతాల వారీగా ఓటర్లను గుర్తించి ఆయా వర్గాలకు చెందిన పెద్దలతో అనుచరగణం సహాయంతో సంప్రదింపులు చేస్తున్నారు. జీహెచ్ఎంసీ, కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, మండలాలు, గ్రామీణ ప్రాంతాల్లోని సామాజికవర్గాలకు చెందిన పెద్దల ఫోన్ నెంబర్లను సేకరిస్తున్నారు. రోజూ సమయం దొరికినప్పుడు ఫోన్‌లో వారిని ఆప్యాయంగా పలుకరించి గెలుపునకు సహకరించాలని కోరుతున్నారు. ఇదే సమయంలో స్థానిక సమస్యలు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వారితో ప్రస్తావించి గెలిచిన వెనువెంటనే తొలి ప్రాధాన్యమిచ్చి పరిష్కరిస్తామని హామీలిస్తున్నారు. కాగా, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు భిన్న రూపం దాల్చడంతో ఎన్నికల సమయంలోనే సమస్యల పరిష్కారానికి పునాదిరాయి పడాలనే ముందుచూపుతో అన్ని సామాజికవర్గాలు వ్యవహరిస్తున్నాయి. పెద్దలను ముందు వరుసలో నిలబెట్టి ప్రచారానికి వచ్చే అభ్యర్థులను అది చేయాలి..? ఇది చేయాలి..? తమ ఇబ్బందులను తొలగించే వారికే ఓటేస్తామంటూ తెగేసి చెబుతున్న సందర్భాలు ఉంటున్నాయి. ప్రతి ఎన్నికల్లో కొన్ని సామాజికవర్గాలు అభ్యర్థుల గెలుపోటములను శాసిస్తున్నాయి. అలాంటి వర్గాన్ని జీహెచ్ఎంసీ, కార్పొరేషన్, మున్సిపాల్టీలు, మండలాలు, గ్రామాల వారీగా గుర్తించేందుకు అభ్యర్థులు పక్కా ప్రణాళిక రూపొందించుకుంటున్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రముఖులు కావడంతో గెలుపోటములను ప్రతిష్టాత్మకంగా తీసుకుని మండుతున్న ఎండల్లో సైతం ప్రచార పర్వాన్ని ఉధృతం చేయడంతో జిల్లా అంతటా రాజకీయం వేడెక్కింది.

మనిషి రాణించేందుకు ఏకాగ్రత అవసరం



- జస్టిస్ శేషశయనా రెడ్డి

నవతెలంగాణ-కల్చరల్

ఏ మనిషి అయినా ఏదో రంగం లో రాణించేందుకు ఏకాగ్రత అవసరం అని ఉన్నత న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శేషశయనా రెడ్డి అన్నారు. అక్కినేని నాగేశ్వరరావు ఆచార్య ఆత్రేయలు వారి రంగం లో ఏకాగ్రత తో పాటు కృషితో ఉన్నత స్థాయికి చేరారని చెప్పారు. రవీంద్ర భారతీలోని సమావేశ మందిరంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సారిపల్లి కొండల్‌రావు సారథ్యంలో యువ కళా వాహిని సాంస్కృతిక సంస్థ నిర్వహణలో విఖ్యాత నటుడు అక్కినేని శత జయంతి ప్రఖ్యాత నాటక సినీ రచయిత ఆచార్య ఆత్రేయ 102వ జయంతి పురస్కరించుకొని గీత రచయిత సుద్దాల అశోక్ తేజకు వచన రచయిత దర్శకుడు డాక్టర్ రాజేంద్ర కుమార్‌కు పురస్కార ప్రదాన సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ శేష శయన రెడ్డి పురస్కారాలు బహుకరించి మాట్లాడారు. జీవితం పాటకు సంబధం ఉందని పాటలో వుండే లయలు హై, లో పిచ్ వంటివి కష్ట సుఖాలనీ పోల్చారు. అక్కినేని ఆత్రేయ జీవితంలో ఎన్నో కష్టాల కూర్చుకొని ఎదిగారని వారు ఆదర్శనీయులు అన్నారు. సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికష్ణ మాట్లాడుతూ అక్కినేని ఆత్రేయ గెలాక్సీలని వారు ప్రత్యేక ఒరవడిని సినీ రంగంలో సృష్టించారని వివరించారు. అధ్యక్షత వహించిన కళా పోషకుడు సారిపల్లి కొండలరావు మాట్లాడుతూ అక్కినేని జీవితం ఆదర్శనీయం అని ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆత్రేయ పాటలు మనస్సుకు సూటిగా తాకుతాయని పేర్కొన్నారు. సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ కార్యక్రమం లక్ష్యం తెలిపారు. సినీ జర్నలిస్ట్ ఎస్.వీ.రామారావు ఆసక్తికర వ్యాఖ్యానంలో త్రినాథరావు, రేవతి, సంధ్య వర్షిణి, మహాలక్ష్మి పాడిన పాటలు ఆకట్టుకున్నాయి.


రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయం



నవతెలంగాణ-బడంగ్‌పేట్

చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి విజయం ఖాయమని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురుపారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మామిడిపల్లిలో రంజిత్ రెడ్డికి మద్దతుగా స్థానిక నాయకులు మాజీ ఎంపీటీసీ జంగయ్య, లాల్ సతీష్ గౌడ్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటేసి రంజిత్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నాయకులు చప్పిడి సంతోష్ రెడ్డి, మహిళ అధ్యక్షురాలు అమృత నాయుడు, మాజీ ఎంపీటీసీ జంపయ్య, సతీష్ గౌడ్, భాస్కర్, నయనా చారి, బాబు పాల్గొన్నారు.

నాదర్‌గుల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, టీచర్లు

నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులంతా మంగళవారం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమ ఉన్నతికి బాటలు వేసిన వారి గురువులను పూల మాలలు వేసి శాలువాతో సన్మానించారు. ఇంగ్లీషు, హిందీ, సైన్స్ టీచర్లు అంటే ఎంత భయమో వారి ముందే చెప్పారు. ఈ కార్యక్రమంలో నాదర్‌గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో నాడు పని చేసిన ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపు కోసం ఇంటింటి ప్రచారం



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

మల్కాజిగిరి పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని మంగళవారం 129 సురారం డివిజన్ కృష్ణానగర్, వేమరెడ్డి నగర్‌లలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ , డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో కరువు కష్టాలు మొదలైనాయి, కరంటూ కోతలు, నీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.మే 13న జరిగే ఎన్నికల్లో ఢిల్లీ పార్టీలను నమ్మవద్దని ప్రజా సంక్షేమం కోసం పాటుపడే బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బషీరుద్దీన్ , సంక్షేమ సంఘం అధ్యక్షులు శివ గుప్తా, సుధాకర్ రెడ్డి , మురళీధర్, మహిళా అధ్యక్షురాలు హేమలత రెడ్డి ,కిరణ్ కుమార్,రవి కుమార్, డేవిడ్,మాజీ వార్డు సభ్యులు అరుణ శైనజ్ బేగం, సంధ్య లత రెడ్డి, రాణి, హర్షియా, ధనలక్ష్మి, సుభద్ర, భాగ్యా ,రాణి,లక్ష్మి పాల్గొన్నారు.

గడప గడపకూ కాంగ్రెస్ నాయకుల ప్రచారం



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 23వ డివిజన్‌లోని పలు కాలనీలలో చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డికి మద్దతుగా కార్పొరేటర్ రాళ్లగూడెం సంతోషి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మాజీ మేయర్, ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్ బండారి మనోహర్, నాయకులు నవీన్ గౌడ్, పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



సైదాబాద్ 'కుర్మగూడలో కరెంట్ కోతలతో ఇబ్బందులు'

నవతెలంగాణ-సంతోష్‌నగర్

సైదాబాద్ పరిధి కుర్మగూడ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు పలుమార్లు అంతరాయం కలగడంతో ప్రజలు విద్యుత్ శాఖ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం పలుమార్లు విద్యుత్ కోతలు ఏర్పడ్డాయి. సిబ్బంది సకాలంలో స్పందించకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యామని వాపోయారు. అసలే వేడి గాలులతో ఇబ్బంది పడుతుంటే కరెంట్ కోతల మరింత ఇబ్బంది పెడుతున్నాయని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు

బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భారీ వర్షం కారణంగా బంజారాహిల్స్ ప్రధాన రహదారు లైన పంజాగుట్ట నాగార్జున సర్కిల్ నుండి విరంచి హాస్పిటల్ వరకు రోడ్ నెంబర్ 1/12, మంత్రుల నివాసం, కమాండ్ కంట్రోల్, జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రి బస్టాప్ వరకు, 12/14, పూరి జగన్నాథ్ టెంపుల్ నుండి బసవతారకం క్యాన్సర్, కేబీఆర్ పార్క్ కూడలి, రోడ్ నెంబర్14/2, ఎల్వీ ప్రసాద్ మార్గం, జూబ్లీ చెక్ పోస్ట్ నుండి టీవీ9 మీదుగా ముఖంజ కాలేజ్ నాగార్జున సర్కిల్ 2/3, ప్రధాన రహదారుల్లో భారీగా మురుగునీరు ఆగడంతో వాహన చోదకులు గంటల తరబడి రహదారులపైనే ఉండిపోయే పరిస్థితి నెలకొంది.

నవతెలంగాణ-బంజారాహిల్స్





హైదరాబాద్‌లో భారీ వర్షం



భారీ వర్షం..
హైదరాబాద్ వ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉరుములు, మెరుపులతో ఒక్కసారిగా వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండలు దంచికొట్టగా.. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది.

అద్దంకి దయాకర్‌ను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయాలి

పీసీసీ కార్యదర్శి సంజయ్ కుమార్ యాదవ్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ హైందవ మతాన్ని కించపరుస్తూ మాట్లాడిన మాటల వీడియో వైరల్ కావడం పట్ల అలాంటి మాటలు సరికాదని కాంగ్రెస్ పీసీసీ కార్యదర్శి, బహదూర్ పుర నియోజకవర్గం కో-ఆర్డినేటర్ సంజయ్ కుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం గౌలిగూడ లో ఆయన మాట్లాడుతూ.. అద్దంకి దయాకర్ వెంటనే తన మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు కాంగ్రెస్‌కు ఆయన అన్యాయం చేస్తున్నాడని పార్టీ నుండి సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీని కోరారు. ఇలాంటి వారితో కాంగ్రెస్‌కు నష్టం వాటిల్లుతుందన్నారు. ఎలక్షన్లలో నష్టం జరగకుండా ఉండాలంటే వెంటనే ఆయనను సస్పెండ్ చేయాలని పార్టీ అధి ష్టానం నాయకురాలు సోనియాగాంధీ, యువ నాయకులు రాహుల్ గాంధీ పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ గల పార్టీ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

నేటి పాలకులు దేశ సంపదంతా కార్పోరేట్లకు అప్పనంగా అమ్మేస్తున్నారు

- అల్లూరి సీతరామరాజు వందేండ్ల వర్ధంతి సందర్భంగా పీవైఎల్ - పీడీఎస్‌యు నివాళి



నవతెలంగాణ-ముషీరాబాద్

నాడు దేశ సంపదను దోచుకునే బ్రిటీష్ వాళ్లకి వ్యతిరేఖంగా అల్లూరి దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడితే, నేటి పాలకులు దేశ సంపద అంతా కార్పోరేట్లకి అప్పనంగా అమ్మేస్తున్నారని పీవైఎల్ - పీడీఎస్‌యు నాయకులు అన్నారు. బ్రిటీష్ ముష్కరులపై ఆదివాసులతో కలిసి పోరాడి అసువులు బాసిన మన్యం వీరుడు అల్లూరి సీతరామరాజు వంద వర్ధంతి సందర్భంగా పీవైఎల్ - పీడీఎస్‌యు నాయకులు మంగళవారం మార్క్స్ భవన్‌లో నివాలర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు దేశ సంపదను దోచుకునే బ్రిటీష్ వాళ్ళకి వ్యతిరేఖంగా అల్లూరి దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడితే, నేటి పాలకులు దేశ సంపద అంతా కార్పోరేట్లకి అప్పనంగా అమ్మేస్తున్నారన్నారు. అల్లూరి స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్ ప్రదీప్, యూనివర్సిటీల జాతీయ కో ఆర్డినేటర్ ఎస్. నాగేశ్వర రావు, పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పెద్దింటి రామకృష్ణ నామాల ఆజాద్, పీవైఎల్ గ్రేటర్ హైద్రాబాద్ అధ్యక్ష కార్యదర్శులు ఎం. రవి కుమార్, బి.ఎస్ కృష్ణ, శ్రీహరి, ఆంజనేయులు పాల్గొన్నారు.

'కేసులేమో యువకులకు.. సూట్ కేసులేమో మందకృష్ణకా..'

- తెలంగాణ మాదిగ మేధావుల ఫోరం



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మంద కృష్ణమాదిగ తన స్వార్థం, కుటుంబం బతకడం కోసం గత 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ పేరుతో మాదిగ జాతిని బీజేపీ పార్టీకి తాకట్టు పెట్టి కేసులేమో దళిత యువకులపై, సూట్ కేసులేమో ఆయనకా అని తెలంగాణ మాదిగ మేధావుల ఫోరం ప్రశ్నించింది. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ హెచ్.ఆర్. మోహన్, ఫోరం అధ్యక్షులు ఆరేపల్లి రాజేందర్, ఫోరం జాతీయ ఉపాధ్యక్షులు సి.వి.ప్రసాద్, తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏర్పుల శ్రీహరి తదితరులు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ మాదిగ జాతిని అడ్డం పెట్టుకుని, మతతత్వ బీజేపీకి మద్దతునిస్తూ కోట్ల రూపాయలు దండుకుంటున్నారని వారు ఆరోపించారు. నేడు మంద కృష్ణమాదిగ చెప్పితే మాదిగలు వినే పరిస్థితి లేద న్నారు. అవసరమైతే ఆయనను, మాదిగ జాతి నుంచి బహిష్కరిస్తామని హెచ్చరించారు. మందకృష్ణ మాదిగ మనువాదాన్ని తీసుకొస్తున్నారని ఆయనకు మనుధర్మ శాస్త్రం కావాలా, రాజ్యాంగం కావాలా అనేది తేల్చుకోవాలని వారు డిమాండ్ చేశారు. కేంద్రంలో సెక్యులర్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలని, అప్పుడే దేశ ప్రజలకు సౌకర్యవంతమైన పాలన వస్తుందని, అందుకే మాదిగ జాతి ఇండియా కూటమిని గెలిపించుకోవాలని వారు పిలుపునిచ్చారు.

రోహిత్ వేముల మరణానికి కారకులైన వారిని వెంటనే శిక్షించాలి

- సీపీఐ(ఎం) నగర నాయకులు ఎం.మహేందర్



నవతెలంగాణ-అంబర్‌పేట

వేముల రోహిత్ మరణానికి కారణమైన బీజేపీ నాయకులను వెంటనే శిక్షించాలని సీపీ ఎం నగర నాయకులు మహేందర్ అన్నారు. మంగళవారం కృష్ణానగర్‌లో అంబేద్కర్ విగ్రహ వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటై కేసును తప్పుదోవ పట్టించారని కులాంతరం వివాహం చేసుకొని భర్తతో దూరమై సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం ఆమె ఏ కులం అయితే పుట్టినదో తన పిల్లలను తానే పెంచి పోషించినందువలన కుమారులు కూడా అదే కులం వర్తిస్తుందని గ్రహించాలని కావాలనే కులం ఇష్యు తీసుకొని కేసును బీజేపీ, బీఆర్ఎస్ తప్పుదోవ పట్టించారని ప్రభుత్వం మళ్లీ పున సమీక్ష చేస్తామనడం హర్షవ్యక్తం చేశారు. ఇప్పటికైనా వేముల రోహిత్ మరణానికి కారణమైన అప్పటి వీసీ దాని సంబంధించిన నాయకులను శిక్షించాలన్నారు. ఈ కేసును నిర్లక్ష్యం చేసిన అధికారుల పైన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు.

వైద్య శాఖలో సుధాకర్ చేసిన సేవలు ఎనలేనివి

- సుధాకర్ సన్మాన సభలో వక్తలు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

వైద్య శాఖలో ఇటీవలే పదవి విరమణ పొందిన ఏముల సుధాకర్ ప్రజలకు చేసిన సేవలు ఎనలేనివని తెలంగాణ రాష్ట్ర నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవరకొండ నాగరాజు అన్నారు. తెలంగాణ రాష్ట్ర నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం హనుమాన్ టెక్డిలోని బీసీ సాధికారిత భవన్ రాష్ట్ర సలహాదారులైన ఏముల సుధాకర్ ఏప్రిల్ 30న ఉద్యోగ విరమణ అయిన సందర్భం గా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు ప్రముఖులు పూలమాల శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు మాట్లాడుతూ వైద్యశాఖలో ఉద్యోగిగా ఒక నిబద్ధత గల ఉద్యోగిగా సుధాకర్ ఆదర్శంగా నిలబడ్డారని కొనియా డారు. ఆయన సేవలు నాయి బ్రాహ్మణ సంఘానికి కూడా అందించాలన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు దేవరకొండ నాగరాజు మాట్లాడుతూ.. సంఘం సభ్యత్వం చేర్పించడం కొత్త సొసైటీలో పొదుపు చేయించడం జరుగుతుందన్నారు. నాయి బ్రాహ్మణ వృత్తిలోకి ఇతరులు రాకుండా ప్రభుత్వం జీవో తీసుకోవచ్చేలా ఒత్తిడి తెస్తామన్నారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ రాష్ట్ర నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే .యాదగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.ఈశ్వర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.రామ్ చందర్, కే.హరినాథ్, కే శ్రీనివాస్, ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఎల్ రాంబాబు, ప్రభాకర్, ఎం గోపాలకృష్ణ, ప్రముఖ కవి డాక్టర్ రాబోల్ సుదర్శన్, అడ్వకేట్ లు భూపాల్ రాజ్ ,రమేష్, రిటైర్డ్ పోలీస్ సూపరిడెంట్ అశోక్ కుమార్, రిటైర్డ్ రిజిస్టర్ రామానంద స్వామి, బిజెపి రాష్ట్ర నాయకులు సూర్యంపల్లి శ్రీనివాస్, ఎన్ జె ఎస్ శ్రీధర్, సిహెచ్ రాకేష్, దుర్గాప్రసాద్, పెద్ద ఎత్తున నాయి బ్రాహ్మణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అన్యాయం చేస్తే తిరుగుబాటు తప్పదు

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య



నవతెలంగాణ-ముషీరాబాద్

కేంద్ర ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తే తిరుగు బాటు తప్పదని బీసీ వ్యతిరేక వైఖరి మానుకోవాలని బీసీల కు చట్టసభలలో 50% రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించాలని లేనిపక్షంలో తీవ్ర పరిణామం ఎదురుకోక తప్పదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు గువ్వల భరత్, జాతీయ కన్వీనర్ గూజ్జా కృష్ణ, ఆధ్వర్యంలో బాగ్‌లింగం పల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీ ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి 76 సంవత్సరాలు గడిచిన ఈ దేశంలో పేద బీసీ కులాలకు అన్ని రంగాలలో సమాన వాటా లభించడం లేదు. ఇంకా ఈ దేశంలో ప్రపంచ బ్యాంక్ సర్వే ప్రకారం 49 శాతం జనాభా పేదరికంలో జీవిస్తున్నారని తెలిపారు. కేంద్రంలో అనేక ప్రభుత్వాలు మారుతున్న బీసీల వాటా బీసీలకు లభించడం లేదన్నారు. బీసీలకు అన్యాయం చేస్తే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా బీజేపీ బీసీల అనుకూల వైఖరి అవలంభించి, బీసీలకు చట్టసభల లో 50% రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించాల న్నారు. ఈ సమావేశానికి గుజ్జ కృష్ణ, గవ్వల భరత్ కుమార్, గుజ్జ సత్యం, నీల వెంకటేష్, అనంతయ్య, గొరిగే మల్లేశ్ యాదవ్, బొయ్య గోపి, వేముల రామకృష్ణ, నందగోపాల్, రాం చందర్ యాదవ్, పృథ్వీ గౌడ్, శ్రీనివాస్, లింగయ్య యాదవ్, రాము, శారదా దేవి, రమాదేవి, 22 బి.సి సంఘా లు, 72 కుల సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యునిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

- 24 గంటల్లో అరెస్టు చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా వైద్య సేవలు నిలిపివేస్తాం
- వైద్యుని సస్పెన్షన్ ఎత్తివేయాలి
- ప్రభుత్వ వైద్యుల సంఘం డిమాండ్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

జగిత్యాల జిల్లా కోరుట్లలో ప్రభుత్వ హాస్పిటల్ లో ఈ నెల 5న డాక్టర్ శ్రవణ్ కుమార్ పై దాడి చేసిన రోగి బంధువులను తక్షణమే అరెస్ట్ చేయాలని ప్రభుత్వ వైద్యుల సంఘం డిమాండ్ చేసింది. మం గళవారం కోఠిలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ కార్యాలయం ముందు ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు ఆందోళన చేశారు. అనంతరం ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు డాక్టర్ బొం గు రమేష్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ లాలూ ప్రసాద్, డాక్టర్ సంతోష్ బాబు, డాక్టర్ రావుస్ బృందం వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ ను కలిసి కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రి లో వైద్యునిపై జరిగిన దాడిని ఆయనకు వివరిం చారు. దాడికి కారకులైన వారిని వెంటనే అరెస్టు చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ కోరారు. వైద్యుని సస్పెన్స్‌ను ఎత్తివేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఆయన సస్పెన్షన్ త్వరలోనే ఎత్తివే స్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రజలు డాక్టర్ బొంగు రమేష్ డాక్టర్ పల్లం ప్రవీణ్ లు మాట్లాడుతూ.. కోరుట్లలో వైద్యుడిపై జరిగిన చర్యను ప్రభుత్వ వైద్యుల సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. చనిపోయిన రోగిని హాస్పిటల్ కు తీసుకొచ్చి, డాక్టర్ కారణంగానే చనిపోయాడని బంధువులు ఆరోపించ డం దుర్మార్గమన్నారు. కాల్ డ్యూటీలో సరైన సమయానికి హాస్పిటల్‌కు వచ్చినప్పటికీ డాక్టర్ నిర్లక్ష్యం వల్ల మరణించాడని డాక్టర్ పై దాడికి దిగి వెంబడించి, పెట్రోల్ పోసి తగలబెట్టాలని చూశారని మండిపడ్డారు. డాక్టర్ శ్రవణ్ తప్పిదం లేకపోయినా ఆయనను సస్పెండ్ చేశారన్నారు. దాడికి పాల్పడిన వారిని ఇప్పటువరకు అరెస్ట్ చేయలేదన్నారు. రక్షణ లేకుండా తమ విధులు నిర్వహించలేమన్నారు. డాక్టర్ శ్రవణ్ పై ఉన్న సస్పెన్షన్‌ను రివోక్ చేసి, దాడి కి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కమిషనర్‌ను కోరమన్నారు. 24 గంటల లోపు చర్య లు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా వైద్య సేవలను నిలిపివేసి, సమ్మెకు దిగుతామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలియజేస్తున్నామన్నారు. వెంటనే వైద్యుని పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల జోగులాంబలో ఓ ఎమ్మెల్యే సూపరింటెండెంట్ పట్ల దురుసుగా మాట్లాడడం రాజకీయ నాయకులకు తగదన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించే అందుకే వైద్యులు పనిచేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య సంఘం ప్రతినిధులు డాక్టర్ అజ్మీర రంగ, డాక్టర్ డాక్టర్ భూపేందర్ సింగ్ రాథోడ్, డాక్టర్ నరహరి, డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్, టి వీవీ పి హైదరాబాద్ యూనిటీ అధ్యక్షుడు సంతోష్ బాబు, ప్రధాన కార్యదర్శి రావు, మహిళ వైద్యులు, పెద్ద ఎత్తున వైద్యులు పాల్గొన్నారు.

దేశంలో విద్వేష జ్వాలలను రగిలిస్తున్న బీజేపీ

- సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

సమాజంలోని మెజార్టీ మైనార్టీ వర్గాల మధ్య విభేదాలు సృష్టించి బీజేపీ విద్వేష జ్వాలలను రగిలిస్తుందని, ఇది దేశానికి అత్యంత ప్రమాదకరమని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లో అఖిల భారత తంజీమ్-ఏ-ఇన్సాఫ్ హైదరాబాద్ జిల్లా సర్వసభ్య సమావేశం ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మహమ్మద్ అహ్మద్ ఖాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి సయ్యద్ అజీజ్ పాషా ముఖ్య అతిథిగా సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నరసింహ విశిష్ట అతిథిగా ఇన్సాఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మునీర్ పటేల్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ దేశంలో ఉన్న సమస్యల నుంచి దృష్టి మరల్చేందుకు బీజేపీ విభజన రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. ఈ లోక్ సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించి తరమికొట్టడం ఖాయమని సయ్యద్ అజీజ్ పాషా తెలిపారు. అనంతరం ఈ.టి.నరసింహ మాట్లా డుతూ మోడీ నిరంకుశ విధానాల వల్ల దేశ ప్రజలు అన్ని స్థాయిల్లో వేధింపులను ఎదుర్కొంటున్నారని, మైనార్టీలకు వ్యతిరేకంగా మెజార్టీ ప్రజలను రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేసి ప్రధాని మోడీ తన స్థాయిని దిగజార్చుకున్నారని తెలిపారు. ప్రజల మధ్య విద్వే షాలు సృష్టిస్తున్నారని, శాంతికి భగ్నం కల్పించే బీజేపీ, ఎంఐఎం లకు ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఓడించి తగిన బుద్ధి చెప్పాలని ఆయన ప్రజలకు సూచించారు.

'ఉత్తర భారతీయుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి'



- జన్ సేవా సంఘ్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఉత్తర భారతీయుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని జన్ సేవా సంఘ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జన్ సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.పి.సింగ్, ప్రధాన కార్యదర్శి రాజీవ్ రంజన్ చౌబే, కోశాధి కారి బినీత్ కుమార్ సింగ్ తదితరులు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణ రాష్ట్రానికి వలస వచ్చిన ఉత్తర భారతీయులను ఆదుకోవాలని కోరారు. గత నాలుగు దశాబ్దాలుగా చిన్న, చిన్న వ్యాపారాలతో పాటు కూలీ పనులు చేసుకుంటూ తమ కుటుంబాలతో జీవిస్తున్న ఉత్తర భారతీయులను పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ప్రభు త్వాలు ఉత్తర భారతీయులను గుర్తించి ఆదుకోవాలని కోరారు. అలాగే ప్రజలు ఈ లోక్ సభ ఎన్నికల్లో సరైన అభ్యర్థులను గుర్తించి ఓట్లు వేయాలని, ఇందు కోసం తాము నేడు బుధవారం ప్యారడైజ్ నుంచి మలక్ పేట వరకు ప్రజలకు ఓటుపై అవగాహన కల్పించడం కోసం ర్యాలీ నిర్వహిస్తున్నామని వారు తెలిపారు.ఈ సమావేశంలో సంఘ్ నాయకులు మదన్ లాల్, పరమానంద శర్మ, ఎండి.మునీర్, ఎల్.ఎం.చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్‌లో ఆస్తమా నిర్ధారణ పరికరాలు ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రతి ఒక్కరూ ఆస్తమాను అదుపులో ఉంచుకోవాలని, ప్రపంచ వ్యాప్తంగా 26 కోట్ల మంది ఆస్తమాతో బాధపడుతుంటే, మన దేశంలో 3.4 కోట్ల మంది ఆస్తమాతో బాధపడుతున్నట్టు గణాంకాలు చెప్తున్నాయని కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్స్ సీనియర్ ఫల్మోనాలజిస్టులు డాక్టర్ లక్ష్మణ్‌బాబు, డాక్టర్ రఘునాథ్‌రెడ్డిలు తెలిపారు. వరల్డ్ ఆస్తమా డే సందర్భంగా మంగళవారం బేగంపేట లోని కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్‌లో ఆస్తమా నిర్ధారణ పరికరాలు ఎఫ్ఓటి, ఎఫ్ఈఎన్ఓలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అస్తమాను స్పైరోమెటి పీఎఫ్‌టీ పరీక్ష ద్వారా నిర్ధారిస్తారని తెలిపారు. ఈ పరీక్ష చిన్నపిల్లల్లో, లంగ్ కెపాసిటి తక్కువగా ఉన్నవారిలో చేయడానికి వీలుఅయ్యేది కాదని, ఆధునిక టెక్నాలజీ ఆధారంగా నూతనంగా అందుబాటులోకి వచ్చిన ఎఫ్ఓటీ (ఫోర్స్ ఆసిలేషన్ టెక్నాలజీ) పరికరం సాయంతో సౌండ్ వేవ్స్‌ను నోటి ద్వారా శ్వాస నాళాల్లోకి పంపడం, మరలా సౌండ్ వేవ్స్ రిటర్న్ అయ్యే సమయంలో సమోదయ్యే గ్రాఫ్ సాయంతో అస్తమాను నిర్ధిరిస్తారని చెప్పారు. ఈ పరీక్షను చిన్నపిల్లలు, లంగ్ కెపాసిటి తక్కువ ఉన్నవారిలో కూడా సులభంగా నిర్వహించవచ్చన్నారు. మరొక అధునిక పరికరం ఎఫ్ఈఎన్ఓ (ఫ్రాక్షనల్ ఎక్స్‌ల్డ్ నైట్రిక్ ఆక్సైడ్) ఈ పరికరం ద్వారా ఆస్తమా నియంత్రణ ఎంత ఉందో తెలుసుకోవచ్చు అన్నారు. దీంతో రోగికి అందిస్తున్న చికిత్సలో (ఇన్‌హెల్లర్స్)లో మార్పులు చేర్పులు చేసుకునేందుకు అవకాశముంటుందని తెలిపారు. ఆస్తమాకు ప్రధానంగా వాయు కాలుష్యం, పుప్పొడి, ఇండోర్ పొల్యూషన్, కంపెనీలు, సిమెంట్ ప్యాక్టరీలు కారణమని.. పేయింటర్స్‌గా పనిచేస్తున్న వారిలో ఎక్కువగా వచ్చే అవకాముందన్నారు. ఆస్తమాకు ఒక్కో వ్యక్తిని బట్టి, వారి లక్షణాలను బట్టి చికిత్స మారుతూ ఉంటుందని తెలిపారు.. ఆస్తమా దీర్ఘకాలిక వ్యాధి కాబట్టి పల్మోనాలజిస్ట్‌ను సంప్రదించి సరైన మందులు వాడుతూ కంట్రోల్‌లో ఉంచుకోవడం చాలా ముఖ్యమని డాక్టర్లు తెలియజేయడంతో పాటు రోగులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ పల్మోనాలజిస్టులు డాక్టర్ శిరీష్‌కుమార్, డాక్టర్ శ్రీకాంత్ గౌడ్, డాక్టర్ స్వాతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దానం నాగేందర్ గెలుపు కోసం బంతి మైసమ్మ, నల్ల పోచమ్మ ఆలయంలో ఆలయ చైర్మెన్ మెట్టు రాజేష్ యాదవ్ ఆధ్వర్యంలో హనుమంతు, నాగరాజు, షోయబ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 3లోని ఆలయంలో సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ భారీ మెజారిటీతో గెలవాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్



కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి మేలు



కొబ్బరి నీటిలోని కాల్షియం ఎముకల్ని, పళ్ళను దృఢంగా ఉంచి, కండరాల బలోపేతానికి సహకరిస్తుంది. శరీరంలో సహజ లవణాల్ని కోల్పోయిన ప్పుడు కలిగే అలసట నుంచి కొబ్బరి నీరు కాపాడుతుంది. విరోచనా లతో ఇబ్బంది పడే వారు శరీరం డీహైడ్రేషన్ కాకుండా ఉండేందుకు కొబ్బరి నీరు తాగాలి. మెగ్నిషియం, క్యాల్షియం, పొటాషియం, సోడియం వంటి పోషకాలు ఉన్న కొబ్బరి నీరు తాగడం వల్ల గర్భవతులకు మలబద్ధకం, జీర్ణకోశంలో సమస్యలు తలెత్తవు. పాలిచ్చే తల్లులు ఈ నీళ్ల తాగితే పాల ద్వారా వారి బిడ్డలకు ఈ పోషకాలు అందుతాయి. కొబ్బరి నీరు తల్లి పాలలో చేరి లారిక్ యాసిడ్‌ను పెంచుతుంది. దీనిలో యాంటీఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ లక్షణాలు ఉంటాయి.

ప్రొటీన్ మనకు చాలా అవసరం...



మన శరీరంలో జుట్టు, చర్మం, ఎముకలు, కండరాలు ఏర్పడటానికి, పెరుగుదలకి ప్రొటీన్ అవసరం. శరీరంలో ఎంజైమ్స్, హార్మోన్స్, నరాల పనితీరుకి కూడా ప్రొటీన్స్ అవసరం. ఈ ప్రొటీన్స్ ఒకదానితో ఒకటి అనుసంధానించబడిన చిన్న అమైనో ఆమ్లాల గొలుసులు. ఇది కండరాల పెరుగుదలని మెరుగ్గా చేస్తుంది. మొత్తం 20 అమైనో ఆమ్లాలు ఉన్నాయి. వాటిలో తొమ్మిది ముఖ్యమైన అమైనో ఆమ్లాలు. ఈ తొమ్మిది శరీరంతో ఉత్పత్తి కావు. మనం తినే ఆహార పదార్థాల నుంచి వీటిని పొందొచ్చు. ఈ అమైనో ఆమ్లాలని ప్రధానంగా ప్రోటీన్ల నుంచి పొందొచ్చు. ఈ అమైనో ఆమ్లాలు.. మాంసం, చేపలు, చికెన్, సోయా, క్వినోవా, గోధమ వంటి మాంసాహార ఆహారాల్లో ఉంటుంది.



'స్త్రీలు ఎక్కడ పూజింపడతారో అక్కడ దేవతలు నడయాడుతారు అంటారు. స్త్రీ ఔన్నత్యానికి సమాజంలో వారికి ఉన్న ప్రాధాన్యతకు మన భారతీయ సంస్కృతి ఇచ్చిన గౌరవం అది. కానీ ఈ రోజు జరుగుతున్నది ఏమిటి? మహిళలు అంటే అడుగడుగునా అవమానాలు, లైంగికదాడులు, హత్యలు. అందుకే ప్రతి స్త్రీ మూర్తికి ప్రణమిల్లి చెబుతున్నాం. మీ రక్షణ కోసం, సమాజంలో మీకు సమున్నత గౌరవం కోసం భారతీయ జనతా పార్టీ కృషి చేస్తుంది' ఒకానొక సందర్భంలో బీజేపీ నాయకులు అన్న మాటలు ఇవి. కానీ ఆచరణలో మాత్రం దీనికి పూర్తి విరుద్ధంగా ఉంది. బీజేపీ కాలంలోనే మహిళలపై దాడులు మరింత పెరిగిపోయాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. 'బేటీ బచావో, బేటీ పడావో', 'మహిళా శక్తి' అంటూనే మనువాదాన్ని ప్రవేశపెట్టి మహిళలకు తిరిగి ఇంటికి పరిమితం చేయాలని చూస్తున్నది బీజేపీ ప్రభుత్వం. ఎవరి నోట విన్నా ఇప్పుడు ఇవే వినిపిస్తున్నాయి. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మీకు ఎలాంటి పాలన కావాలని అడిగితే మహిళల స్పందన ఎలా ఉందో చూద్దాం...



మాటల్లోనే మహిళా శక్తి

మహిళా అణచివేత చరిత్ర కలిగిన ఆర్‌ఎస్‌ఎస్ నుంచి బీజేపీ ఆవిర్భవించిన సంగతి తెలిసిందే. వారి సనాతన విశ్వాసాలు, పితృస్వామ్య మనస్తత్వం స్త్రీలను బలహీనులుగా మాత్రమే చూస్తాయి. స్త్రీలు ఎప్పుడూ మగవారికి లోబడి ఉండాలని చెప్తారు. సొంత నిర్ణయాలు తీసుకోలేని వారిగా, గొంతు లేని వారిగా చిత్రీకరిస్తున్నారు. పదేండ్ల బీజేపీ పాలనలో మహిళలపై పెరుగుతున్న నేరాలే దీనికి నిదర్శనం. 2014కు ముందు మహిళల పట్ల ఇంతటి దిగజారుడు తనాన్ని మనం చూడలేదు. ఉన్నావ్, హత్రాస్ కేసులలో బాధితులు, వారి కుటుంబాలపై అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన బీజేపీ నాయకుల గురించి విన్నాం. కాపాడాల్సిన వారే నేరస్థులతో చేతులు కలపడం కండ్లారా చూశాం. అంతేనా మహిళలు పోరాడి సాధించుకున్న హక్కులన్నీ నేటి బీజేపీ పాలనలో హరించివేయబడుతున్నాయి. మహిళలను రక్షిస్తామని చెబుతున్న కేంద్రం ఆచరణలో మాత్రం మనువాద విధానాలతో మరింత దుస్థితిలోకి నెట్టివేస్తోంది.

అభద్రతా భావంలో బతుకుతున్నారు

హింసకు గురైన బాధితులను న్యాయానికి దూరం చేసి దేశంలో మహిళలకు రక్షణ లేకుండా చేశారు. అభద్రతా భావంలో బతికేలా చేస్తున్నారు. దేశానికి పతకాలు తెచ్చిపెట్టిన రెజ్లర్‌లు బ్రిజ్ భూషణ్ తమపై లైంగిక దాడులకు పాల్పడుతున్నాడని నడిరోడ్డుపై నినదించినా వారి ఆర్తనాధాలు వినిపించుకోలేదు. మణిపూర్‌లో మహిళలపై సామూహిక లైంగిక దాడి చేసి, వివస్త్రలను చేసి ఊరేగించినా నోరు మెదమని పాలకుల చేతుల్లో మన దేశం ఉంది. అందుకే మహిళలు భయపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తిరిగి బీజేపీ అధికారంలోకి వస్తే తమ పరిస్థితి మరింత దిగజారి పోతుందనీ, తమ ఉనికే ప్రశ్నార్థమవుతుందని వారు ఆందోళన చెందడం సహజం.

పూర్తి భిన్నంగా ఉన్నాయి

21వ శతాబ్దంలో మహిళలు సమానత్వం, స్వేచ్ఛను కోరుకుంటున్నారు. వారు తమ కార్యాలయంలో, కుటుంబంలో, సామాజిక సమూహాలలో, సమాజంలో సమానత్వాన్ని కోరుకుంటున్నారు. సొంత ఎంపికలు చేసుకునే స్వేచ్ఛను కోరుకుంటున్నారు. కానీ నేడు దేశాన్ని పాలిస్తున్న పాలకుల విధానాలు మహిళల ఆలోచనలకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. భారతదేశంలోని ప్రతి స్త్రీకి సమానత్వాన్ని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి వుంది. అలాంటి ప్రభుత్వం కావాలని మహిళలు కోరుకుంటున్నారు.

సేకరణ : సలీమ



బీజేపీతో దేశానికి నష్టమే



కేంద్రంలో పదేండ్ల నుండి బీజేపీ పాలిస్తుంది. ఇప్పటి వరకు దేశానికి చేసింది ఏమీ లేదు. పైగా ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారు. మహిళల గురించి తక్కువగా మాట్లాడుతున్నారు. మణిపూర్‌లో మహిళలను లైంగిక దాడి చేసి వివస్త్రలుగా చేసినా నోరు విప్పలేదు. ఇలాంటి వారి వల్ల దేశానికి నష్టం తప్ప ఎలాంటి లాభం లేదు. పైగా జీఎస్టీ తెచ్చి పన్నుల భారం మరింత పెంచాడు. నేను ఈ మధ్య నాలుగు చీరలు కొంటే పదిహేను వందలు జీఎస్టీనే కట్టాల్సి వచ్చింది. పెట్రోల్, గ్యాస్ రేట్లు పెంచారు. ఎన్నికలు వస్తున్నాయని మళ్లీ ఏదో రేట్లు తగ్గిస్తున్నట్టు గ్యాస్‌పై కొంత తగ్గించారు. ఇవన్నీ సామాన్యులకు భారాలుగా మారాయి. కాబట్టి ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కాంగ్రెస్ వస్తే దేశానికి కాస్త అయిన మంచిదని అనిపిస్తుంది.

- ఊర్మిళ, ఉప్పల్

బీజేపీని ఓడించాల్సిందే



దేశంలో పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. ప్రజాస్వామ్యం అంటే విలువ లేకుండా పోతోంది. బీజేపీ వాళ్ళు ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారు. అమ్మాయిలు చదువులు మానేసి మళ్ళీ ఇంట్లో ఉండాల్సిన పరిస్థితి వచ్చేలా అనిపిస్తుంది. రెజ్లర్‌లు తమపై దాడులు జరిగాయని అన్ని రోజులు ధర్నాలు చేసినా అస్సలు పట్టించుకోలేదు. మణిపూర్‌లో కూడా అంతే. మనువాదాన్ని ప్రవేశపెట్టి మహిళల జీవితాలను పాతాళంలోకి నెట్టేసేలా ఉన్నారు. మహిళలు పిల్లల్ని కని పెంచితే సరిపోతుందని మాట్లాడుతున్నారు. ఇలాంటి ప్రధాని వల్ల దేశానికి నష్టం తప్ప ప్రయోజనం ఉండదు. కాబట్టి ఈసారి బీజేపీ ఓడిపోయి కాంగ్రెస్ వస్తే కొద్దిగైనా బాగుందనిపిస్తుంది.

- కె.సుమతి,
ఫ్యాషన్ డిజైనర్

మతం పేరుతో విడదీస్తున్నారు



బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశం పరిస్థితి బాగా మారిపోయింది. నోట్లు రద్దు చేసినప్పుడు ఎంతో మంది చాలా ఇబ్బందులు పడ్డారు. జీఎస్టీ తెచ్చి మనపై విపరీతమైన భారాలు మోపారు. ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు కొత్త ఉద్యోగాలు ఇవ్వలేదు. అన్నిటికంటే ముఖ్యంగా కలిసి మెలిసి ఉండే ప్రజలను మతం పేరుతో విడదీయాలని చూస్తున్నారు. ఇక్కడే పుట్టి, పెరిగిన ముస్లింలను ఇక్కడి వారు కాదన్నట్టు ప్రచారం చేస్తున్నారు. పాఠశాల విద్య నుండి రామాయణ, మహాభారతం వంటికి ప్రవేశపెట్టి మతోన్మాదాన్ని పెంచి పోషించాలని చూస్తున్నారు. పైగా రాజ్యాంగాన్ని మార్చేస్తామంటున్నారు. ఇలాంటి వారు దేశాన్ని పాలిస్తే మరింత నష్టం తప్ప ఎలాంటి ఉపయోగం లేదు. కాబట్టి బీజేపీ ఓడిపోవాల్సిందే.

- అమీన, ప్రైవేట్ ఉద్యోగి

పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండానే..

(మొదటిపేజీ తరువాయి)

సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి.జహంగీర్ అన్నారు. ఈ ప్రాంతానికి ఎన్ని నిధులు తెచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి మారిన బూర నర్సయ్యగౌడ్ ఐదు సంవత్సరాలు ఎంపీగా ఉండి ఎన్ని నిధులు తెచ్చి ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. సొంత ఆస్తులు పెంచుకున్నారని విమర్శించారు. వైద్యసంస్థలను పెంచుకోవడమే పనిగా పెట్టుకున్నారు తప్ప ప్రజలకు సేవ చేసింది ఏమీ లేదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ప్రజల కోసం ఎక్కడ ధర్నాలు చేశారు, ఎప్పుడైనా జైళ్లకు పోయారా అని ప్రశ్నించారు. ప్రజల వెన్నంటి ఉండి పనిచేస్తున్న తనను గెలిపిస్తే ఈ ప్రాంతానికి సాగు, తాగునీరు తెస్తానని అన్నారు. గోదావరి జలాలు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. పిలాయిపల్లి కాల్వ సాధన కోసం 130 రోజులు దీక్షలు చేపట్టామన్నారు. సీపీఐ(ఎం) పోరాటాల ఫలితంగానే ధర్మారెడ్డిపల్లి, బునాదిగాని కాల్వలు సాధించామన్నారు. పార్లమెంట్‌కు దద్దమ్మలు ఎన్నికవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాట నాయకులను గెలిపించి ఆయుధం ఇవ్వాలని కోరారు. సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓట్లు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య, నాయకులు ఎమ్‌డి.పాషా, బండారు నర్సింహా, నందిపాటి మనోహర్, అవ్వారు రామేశ్వరి, ఆ పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గోపగోని లక్ష్మణ్, వైస్‌చైర్మెన్ బత్తుల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్ బెయిల్ పై విచారణ

(మొదటిపేజీ తరువాయి)

మంజూరు చేయాలని కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్ ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తలతో కూడిన ధర్మాసనం విచారించింది. తదుపరి విచారణ గురువారం లేదా వచ్చే వారంలో జరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల వేళ ఓ పార్టీ అధినేతగా ఆయన ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని విచారణ సందర్భంగా ధర్మాసనం అభిప్రాయపడింది. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, ఒకవేళ మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేస్తే.. అప్పుడు ఎక్సైజ్ పాలసీ కేసుతో లింకున్న ఫైల్స్‌ను కేజ్రీ చూడరాదని ధర్మాసనం స్పష్టం చేసింది. ముఖ్యమంత్రిగా అధికారిక బాధ్యతలు నిర్వర్తించొద్దని సూచించింది. అయితే, సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని ఈడీ వ్యతిరేకించింది. సీఎం అయినంత మాత్రాన ఈ కేసును ప్రత్యేకంగా పరిగణించకూడదని అభిప్రాయపడింది. కేసుల విషయంలో రాజకీయ నాయకులకు మినహాయింపు ఉండకూడదని స్పష్టం చేసింది. ఇరు పక్షాల వాదనలూ విన్న అత్యున్నత న్యాయస్థానం ప్రస్తుతానికి ఎలాంటి ఆదేశాలూ ఇవ్వలేదు. తన నిర్ణయాన్ని రిజర్వ్‌లో ఉంచింది.

14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ

ఢిల్లీ లిక్కర్ పాలసీ కుంభకోణ కేసులో ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు కస్టడీని మరోసారి రౌస్ అవెన్యూ కోర్టు పొడగించింది. మంగళవారంతో కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీ మంగళవారంతో ముగిసింది. దీంతో అధికారులు ఆయన్ను తీహార్ జైలు నుంచి రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపర్చారు. విచారించిన ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా, కేజ్రీవాల్‌కు 20 వరకు కస్టడీని పొడిగించారు. దీంతో కేజ్రీవాల్ మరో 14 రోజులు జైల్లోనే ఉండాల్సి ఉంటుంది.

రైతు భరోసాకు ఈసీ బ్రేక్

(మొదటిపేజీ తరువాయి)

నగదు జమ చేయాలని ఈసీ స్పష్టం చేసింది. ఈ నెల తొమ్మిదో తేదీలోపు అందరికీ రైతుభరోసా చెల్లింపులు చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ఎస్.వేణు కుమార్ అనే వ్యక్తి ఈసీకి ఫిర్యాదు చేశారు. సీఎం వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ నుంచి కేంద్ర ఎన్నికల సంఘం నివేదిక తెప్పించుకుంది. ఇప్పటికే కొనసాగుతున్న పథకాలకు సంబంధించిన నగదు బదిలీకి ఎలాంటి ప్రచారం లేకుండా గతంలో అనుమతించినట్టు ఈసీ తెలిపింది. గత శాసనసభ ఎన్నికల సమయంలో కూడా అప్పటి ఆర్థిక మంత్రి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు రైతుబంధు చెల్లింపులకు అనుమతి నిలిపివేసినట్టు పేర్కొంది. ఈసీ నిర్ణయంతో రైతు భరోసా నిధుల చెల్లింపులు ఆగిపోయాయి.

మేడిగడ్డకు మరమ్మతులు వృథానే !

(మొదటిపేజీ తరువాయి)

విచారించిన అనంతరం ఎన్డీఎస్ఏ బ్యారేజీల పునరుద్ధరణ సంబంధించిన మధ్యంతర నివేదికను రాష్ట్ర సాగునీటిపారుదల శాఖకు ఈనెల ఒకటిన నివేదిక ఇచ్చింది. వానాకాలంలోపు బ్యారేజీల వైఫల్యంపై జియో ఫిజికల్ ఇన్వెస్టిగేషన్ (జీపీఐ), జియో సాంకేతిక పరీక్షల అనంతరం డిజైన్లు, డ్రాయింగులు సిద్ధం చేసి, మరమ్మతులకు పూనుకోవాలని సూచించింది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాకు జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ) చైర్మెన్ అనిల్ జైన్ మధ్యంతర నివేదిక మంగళవారం లీక్ కావడంతో రాజకీయ సమీకరణాలు మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2019 జూన్‌లో మేడిగడ్డ బ్యారేజీని ప్రారంభించగా మొదటి వరదల అనంతరం 2019 నవంబరులో గేట్లు మూసివేయగా, బ్యారేజీ దిగువ భాగంలో సిమెంట్ కాంక్రీట్ బ్లాకులు (సీసీ బ్లాకులు), ఏప్రాన్ దెబ్బతిన్నట్టు గుర్తించడం జరిగిందని అన్నారు. అయితే మరమ్మతులతోపాటు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓఅండ్ఎం) పనులు చేయకుండా బ్యారేజీని వినియోగించడంతో 2023 అక్టోబరు 21వ తేదీన బ్యారేజీ కుంగిపోయిందని ఎన్డీఎస్ఏ నివేదిక స్పష్టం చేసింది. మేడిగడ్డ బ్యారేజీలోని పిల్లర్ నెం.16 నుంచి 21 దాకా ఆయా స్థాయిల్లో కుంగిపోయి, దెబ్బతిన్నాయని వివరించింది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో కూడా అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్ ఏప్రాన్లు దెబ్బతిన్నాయనీ, సీసీబ్లాకులు చెల్లాచెదురు అయ్యాయని గుర్తు చేసింది. అన్నారం బ్యారేజీతో పాటు గేట్ల వద్ద ఇసుక మేటలు వేస్తుండటంతో నీటి పారుదల శాఖ నిరంతరం వీటిని తొలగించి, వరద సక్రమంగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరింది. వానాకాలంలోపు బ్యారేజీలకు తగిన పరీక్షలు చేసి, మరమ్మత్తులు చేయాల్సిన బాధ్యత డ్యామ్ సేఫ్టీ చట్టం -2023 ప్రకారం డ్యామ్ ఓనర్(రామగుండం చీఫ్ ఇంజనీర్)దేనని పేర్కొన్నది. ఈ సందర్భంగా బ్యారేజీల పునరుద్ధరణకు పలు సూచనలు చేసింది.

మరమ్మతులకు ఎన్‌డీఎస్‌ఏ సూచనలు

1. మేడిగడ్డ బ్యారేజీ మరింత దెబ్బతినకుండా మరమ్మత్తులు చేయాలి. మరమ్మత్తులు యధాతథాస్థితిని కొనసాగించడానికి మాత్రమే ఉపయోగపడతాయి. భవిష్యతులో ఏ పరిణామాలు చోటుచేసుకున్నా బ్యారేజీ దెబ్బతినకుండా ఉంటుందనే గ్యారంటీ లేదు.

2. పగుళ్లను నిరంతరం పరిశీలించాలి. బ్యారేజీ ఎగువ, దిగువ భాగంలో సీసీ బ్లాకులు ద్బెబతిన్నాయి.

3.పిల్లర్లు 16 నుంచి 22 దాకా పగుళ్ల వచ్చాయి. ఆ పిల్లర్లు మరింత దెబ్బతినకుండా వాటికి ఇనుప పట్టీలు వేయాలి.

4. రాఫ్ట్(పునాది)పై భారం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

5. రాఫ్ట్ కింద ఉన్న ప్రెషర్ రిలీవ్ వాల్వ్ మరమ్మతులు చేయడం లేదా మార్చడం చేయాలి.

6. బ్లాకు-7 కుంగుబాటును నిరంతరం పరిశీలించడానికి వీలుగా టోటల్ స్టేషన్‌ను వినియోగించాలి. బ్లాక్-7 రాఫ్ట్ కిందకు ఇసుక చేరింది. దీనికోసం ఇసుక నింపిన బస్తాలతో పాటు సిమెంట్ బస్తాలను వరుస క్రమంలో పెట్టాలి.

7. బ్యారేజీ అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్ సీకెంట్ పైల్‌ను పరిశీలించాలి. ప్లింత్ శ్లాబు కింద ఇన్వర్టర్ ఫిల్టర్లపై ఉన్న కాంక్రీట్ బ్లాకులు దెబ్బతిన్నాయి. ప్లింత్ స్లాబులపై కింద ఉన్న ఫిల్టర్లనుంచి ఇసుక కొట్టుకుపోయిందా...? లేదా పరిశీలించాలి.

8. జియో ఫిజికల్ ఇన్వెస్టిగేషన్ చేసి, సీకెంట్ ఫైల్స్ దెబ్బతిన్న చోట షీట్ ఫైల్లు దించాలి. సీకెంట్ ఫైల్స్ ఎండ్‌సీల్ మధ్య సిమెంట్, ఇసుక మిశ్రమంతో గ్రౌటింగ్ చేయాలి.

9. సీకెంట్ ఫైల్స్ వైఫల్యంతో రాఫ్ట్ (పునాది) కింద భారీ రంధ్రాలు(బొరియలు) పడ్డాయి. వీటిని మూయడానికి రాఫ్ట్ 5 నుంచి 7 సెంటీమీటర్ల మేర రంధ్రాలు వేయాలి. రెండు మీటర్ల కన్నా ఎక్కువ వేయరాదు. సిమెంట్, ఇసుక, నీళ్లతో గ్రౌటింగ్ చేయాలి. వాటిని గుర్తించడానికి బోర్ రంధ్రాల్లోకి కెమెరాలను పంపాలి. గ్రౌటింగ్ చేసే క్రమంలో రాఫ్ట్‌పై ఒత్తిడి, భారం పడకుండా చూసుకోవాలి.

10, వర్షాకాలంలో ఏడో బ్లాకు గేట్లన్నీ ఎత్తి ఉంచాలి. గేట్లు ఎత్తే క్రమంలో అన్ని గేట్లను సమగ్రంగా పరిశీలించాలి. వర్షాకాలంలో బ్యారేజీ గేట్లతో పాటు అన్ని కాంపోనెంట్లను తనిఖీచేయాలి. ప్రధానంగా ఏడో బ్లాకులోని 15 నుంచి 22 గేట్లు ఓపెన్ కావడం లేదు. దీనికోసం క్రేన్లను ఏడో బ్లాకుపై కాకుండా వేరే చోట పెట్టి, గేట్లను ఎత్తాలి. ఈ క్రమంలో పిల్లర్లకు ఇనుప పట్టీలను బిగించాలి.

11. పిల్లర్ నెంబర్ 20-21 మధ్య ఉన్న గేట్లను తొలగించాలి.

12. బ్యారేజీ అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్ సీకెంట్ పైళ్లు, శ్లాబును కలిపే సీసీ బ్లాకులు, ప్లింత్ స్లాబులు దెబ్బతిన్నాయి. వాటి స్థానంలో కొత్తవి కట్టాలి. ఈ క్రమంలో వాటి కింద ఉన్న ఇసుకను సరిచేయాలి.

అన్నారం, సుందిళ్లకు ఒకే తరహా మరమ్మతులు

అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో ఒకే తరహా సమస్యలు ఉండటంతో వాటికి ఒకే తరహా మరమ్మత్తులను ఎన్డీఎస్ఏ సూచించింది.

1. అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్ సీకెంట్ పైళ్లను పరిశీలించాలి.

2. నాలుగు వరుసల ఉన్న బ్లాకులను తొలగించి, వాటి కింద ఉన్న ఇన్వర్టర్ పిల్లర్ల స్థానంలో జియో టెక్స్‌టైల్ పిల్టర్లు పెట్టాలి. రాళ్ల లేకుండా చేసుకోవాలి.

3. నాలుగు వరుసల్లోని సీసీ బ్లాకులను ఇనుప కడ్డీలతో అనుసంధానం చేసి, పరదను దిగువకు వదిలిపెట్టినప్పుడు అవి కొట్టుకుపోకుండా చూసుకోవాలి. ఇక రాఫ్ట్ కింద రంధ్రాలు ఉంటే గుర్తించి, గ్రౌటింగ్ చేయాలి.

ఈ సీజన్‌లో కూడా బ్యారేజీలకు హాలీడే

బ్యారేజీల మరమ్మతుల కోసం జియో ఫిజికల్, జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్ చేసి, మరమ్మతుల కోసం తగిన డిజైన్లు, డ్రాయింగులు సిద్ధం చేయాలని ఎన్డీఎస్ఏ రాష్ట్ర నీటిపారుదల శాఖకు గుర్తు చేసింది. అయితే మరో నాలుగు వారాల్లో గోదావరికి వరదలు వచ్చే అవకాశం ఉందనే సంకేతాలున్నాయి. ఆయా పరీక్షలు చేయడానికే దాదాపు నెలరోజులకు పైగా సమయం పడుతుంది. ఇక డిజైన్లు, డ్రాయింగ్‌లకు కనీసం 15 రోజుల సమయం కావాల్సిందే. అదే జరిగితే ఈ సీజన్లో మరమ్మతులకు అవకాశాల్లేవు. ప్రధానంగా ప్రాణహితకు భారీగా వరదలుంటాయి. మేడిగడ్డకు ప్రతియేటా జూన్ నుంచి ఫిబ్రవరి దాకా ప్రాణహితకు వరదలు వస్తుంటాయి. డిసెంబరులోనే కాస్తా తగ్గుముఖం పట్టినా, రోజుకు 11 వేల క్యూసెక్కుల వరద ఫిబ్రవరి దాకా వస్తుంది. అన్నారం, సుందిళ్లకు నవంబరులో వరదలు తగ్గుముఖం పడతాయి. ఈ బ్యారేజీలను మరమ్మత్తులు చేయడానికి అవకాశం ఉన్నా, మేడిగడ్డకు మరమ్మత్తు అంత సులభం కాదు. మేడిగడ్డ మరమ్మత్తులు కత్తిమీద సాములాంటివే. మేడిగడ్డ లేకుండా ఇతర బ్యారేజీలన్నీ దండగే అని నీటిపారుదల శాఖ అధికారులు పదే పదే విజ్ఞప్తి చేస్తున్నా, తాపీగా వానాకాలానికి నెలరోజుల ముందు ఎన్డీఎస్ఏ నివేదిక ఇవ్వడంతో మరమ్మతులు ఇక ప్రశ్నార్థకం కానున్నాయి.

ఏమిచ్చినవో చెప్పి వరంగల్‌కు రా..

(మొదటిపేజీ తరువాయి)

నిధులిచ్చింద్రో చెప్పాలన్నారు. వేయిస్తంభాల గుడికి ఏం గుర్తింపు ఇచ్చింద్రు ? ఏం ఇవ్వకుండా బీజేపీకి ఎందుకు ఓటు వేయాలి ? అని ప్రశ్నించారు. బిడ్డకు బెయిల్ ఇప్పించుకునేందుకు కార్యకర్తలను ఫణంగా పెట్టి బీజేపీతో కేసీఆర్ చీకటి ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. ఎన్నికలకు ముందే బీఆర్ఎస్ నుంచి ఒక నేతను బయటకు పంపి ఆ నేతకే బీజేపీ టికెట్ ఇచ్చి పోటీ చేయిస్తుందన్నారు. డిసెంబర్‌లో కేసీఆర్‌ను ప్రజలు బండకేసి కొట్టినా ఆయనలో మార్పు రాలేదన్నారు. కారు షెడ్డుకు పోయిందని, దీంతో కేసీఆర్ బస్సులో బయల్దేరిండన్నారు. వరంగల్ నగరాన్ని రెండో రాజధానిలా అభివృద్ధి చేస్తామన్నారు. వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అంచనాలను రివైస్ చేసి పంపించాలని సీఎం రేవంత్‌రెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మామునూరు ఎయిర్‌పోర్టును పునరుద్ధరిస్తామన్నారు. ప్రధాని మోడీ పరిశ్రమలన్నీ గుజరాత్‌కు తరలించుకుపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు విభజన చట్టంలో ఇచ్చిన హామీలను 10 ఏండ్లలో నెరవేర్చలేదని, మాజీ సీఎం కేసీఆర్ కూడా అడగలేదని ఆరోపించారు. అందుకే ఈ ఎన్నికలు తెలంగాణ, గుజరాత్ మధ్య జరుగుతున్న ఎన్నికలని అభివర్ణించారు. మొన్న డిసెంబర్‌లో జరిగిన ఎన్నికలు సెమీఫైనల్ మ్యాచ్ అయితే, పార్లమెంటు ఎన్నికలు ఫైనల్ మ్యాచ్ అన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో గుజరాత్‌ను డకౌట్ చేయాలన్నారు. ఢిల్లీ సుల్తానులను ఎదిరించిన గడ్డ కాకతీయ గడ్డ.. ఇప్పుడు ఒకపక్క మోడీ.. అమిత్ షా, మరోపక్క రాహుల్.. రేవంత్‌రెడ్డి మధ్య పోరాటం జరుగుతోందన్నారు. ఈ పోరాటంలో కాకతీయుల వారసులైన మీరు నా పక్క వుండి గుజరాత్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు.

తులసివనంలో గంజాయి మొక్కలా ఒక పక్క ఎర్రబెల్లి, మరోపక్క 'అరూరి' అనకొండ వున్నారని, భూమి కనిపిస్తే అనకొండలా మింగుడేనని విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీ వేర్వేరు కాదని, రెండూ కలిసి దొంగ దెబ్బతీయడానికి కుట్ర పన్నుతున్నాయని అన్నారు.

నన్ను నమ్మండి..ప్లీజ్

(మొదటిపేజీ తరువాయి)

స్నేహితులమంటూ కపట ప్రేమను ప్రదర్శిస్తారు. కానీ ముస్లిం సమాజం చైతన్యవంతంగా మారింది. త్రిపుల్ తలాక్ రద్దు చేసినప్పుడు వారి ఆందోళనపై నేను నిజాయతీగా ఉన్నానని ముస్లిం సోదరీమణులు భావించారు. ఆయుష్మాన్ కార్డులు ఇచ్చినప్పుడు, కోవిడ్ వ్యాక్సిన్లు అందుబాటులోకి తెచ్చినప్పుడు వారు అలాగే భావించారు. నేను ఎవరిపైనా వివక్ష చూపడం లేదని వారు అర్థం చేసుకున్నారు. విపక్షాల అబద్ధాలు బయటపడ్డాయి. అదే వారి బాధ. అందుకే తప్పుదోవ పట్టించేందుకు రకరకాల అబద్ధాలు చెప్తూనే ఉంటారు" అని మోడీ విపక్షాలపై విరుచుకుపడ్డారు.

కొద్దిరోజుల క్రితం ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ.. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజల సంపద అంతా మైనార్టీలైన ముస్లింలకు పంచుతుందని తీవ్ర స్థాయిలో వ్యాఖ్యానించారు. "ప్రజల వద్ద ఉన్న బంగారంతో సహా సంపద మొత్తం సర్వే చేసి అందరికీ సమానంగా 'పునఃపంపిణీ' చేస్తామని కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో చెప్పింది. ఆమేరకు దేశ సంపదనంతా చొరబాటుదారులకు, ఎక్కువమంది పిల్లలు ఉన్నవారికి పంచుతారు" అని విమర్శలు చేశారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఎన్నికల్లో లబ్ది కోసం ఒక వర్గానికి వ్యతిరేకంగా ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేశారని విపక్షాలు తీవ్రంగా మండిపడ్డాయి. ఈ క్రమంలోనే మోడీ స్పందన వచ్చింది. అలాగే తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఈ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని ముస్లిం వర్గానికి పిలుపునిచ్చారు. ఇప్పటిదాకా జరిగిన మూడు విడతల పోలింగ్‌లో ఫలితాలు తారుమారు అవతాయని సంకేతాలు రావటంతో మోడీకి ముస్లింలపై ప్రేమవచ్చిందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

అధికారంలోకి రాగానే అగ్నివీర్ రద్దు

(మొదటిపేజీ తరువాయి)

భారత సైన్యం ప్రారంభించలేదని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించారని రాహుల్ గాంధీ విమర్శించారు. ఇలాంటి చర్యలతో దేశం కోసం ప్రాణత్యాగం చేసే అమరవీరుల్లో విభజన సరికాదని ఆయన అన్నారు. జార్ఖండ్‌లోని గుమ్లా పట్టణంలో ఎన్నికల ర్యాలీలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. 'ఇండియా వేదిక అధికారంలోకి రాగానే అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తాం. ఈ పథకాన్ని సైన్యం తీసుకుని రాలేదు, ప్రధానమంత్రి మోడీ తీసుకొని వచ్చారు. అలాగే అమరవీరుల మధ్య విభజనలు మాకు ఇష్టం లేదు. దేశం కోసం ప్రాణత్యాగం చేసినవారందరూ అమరవీరులే. వారికి పెన్షను ఇవ్వాలి' అని రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. జీఎస్టీపై ఆయన మాట్లాడుతూ ఐదు ట్యాక్స్ శ్లాబులతో బీజేపీ ప్రభుత్వం తప్పుడు విధానాలు అమల్జేస్తోందన్నారు. దీనిని సవరించి పేదలపై భారాలు పడనిరీతిలో పన్ను శ్లాబ్ విధానం తీసుకొస్తామన్నారు. గిరిజనలకు బీజేపీ అడుగడుగునా ద్రోహం చేస్తోందని రాహుల్ విమర్శించారు. 'వనవాసీ' పేరుతో ఆదివాసీల అటవీ హక్కులను బీజేపీ ప్రభుత్వం హరిస్తోందని, అడవి బిడ్డల మనుగడనే ప్రశ్నార్థకం చేస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అయోధ్యలో రామమందిరం ప్రతిష్టాపనకు, న్యూఢిల్లీలో నూతన పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి గిరిజన మహిళ అయిన రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించకుండా ప్రధాని మోడీ అవమానించారని ఆయన విమర్శించారు. మంగళవారం ముందుగా చైబాసాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో రాహుల్ పాల్గొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, రైల్వేలు మొదలైన వాటిని బడా పారిశ్రామిక వేత్తలకు కాషాయ పార్టీ అప్పగిస్తుందని అన్నారు. అదానీ, అంబానీల కోసమే మోడీ పని చేస్తున్నారని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే కోట్లాది మందిని లక్షాధికారులుగా మారుస్తామని హామీ ఇచ్చారు. పేద మహిళలకు ఏటా రూ. లక్ష సహాయం అందజేస్తామని చెప్పారు.

పోలింగ్ రోజు వేతనంతో కూడిన సెలవు

(మొదటిపేజీ తరువాయి)

కలెక్టర్లు, ఇతర ప్రభుత్వ అధికారులు మే 13న వేతనంతో కూడిన సెలవు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. రాష్ట్రంలోని 17 లోకసభ నియోజక వర్గాలతో పాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసన సభ ఎన్నికలకు ఈ సెలవు వర్తిస్తుందని పేర్కొంది.

నవచిత్రం

బాహుబలి: క్రౌన్ ఆఫ్ బ్లడ్

బాహుబలి చరిత్రలో కొత్త అధ్యాయం



రాజమౌళి

'బాహుబలి ఫ్రాంచైజీకి నా మనసులో ప్రత్యేక స్థానం ఉంది. 'బాహుబలి: క్రౌన్ ఆఫ్ బ్లడ్'తో బాహుబలి చరిత్రలో కొత్త అధ్యాయాన్ని ఆవిష్కరించడం అద్భుతంగా అనిపిస్తుంది' అని దర్శకుడు రాజమౌళి అన్నారు.

డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో రాబోయే బాహుబలి: క్రౌన్ ఆఫ్ బ్లడ్ యానిమేటెడ్ సిరీస్ యూనివర్స్‌ని హైదరాబాద్‌లోని ఏఎంబి సినిమాస్‌లో గ్రాండ్‌గా ఆవిష్కరించారు. గ్రాఫిక్ ఇండియా, ఆర్కా మీడియావర్క్స్ ప్రొడక్షన్ ప్రైవేట్ లిమిటెడ్, విజనరీ ఫిల్మ్ మేకర్ రాజమౌళి, శరద్ దేవరాజన్, శోభు యార్లగడ్డ దీనిని నిర్మించారు. జీవన్ జె. కాంగ్, నవీన్ జాన్ దర్శకత్వం వహించారు. ఈ సిరీస్ ఈనెల 17న డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో ప్రసారం కానుంది.

"బాహుబలి' కోసం క్యారెక్టర్ ఆర్క్స్, ప్రీ స్టోరీ, పోస్ట్ స్టోరీ రాసినప్పుడు బాహుబలి యూనివర్స్‌లో ప్రేక్షకులకు చెప్పడానికి ఇంకా కథ ఉందనిపించింది. వెస్ట్రన్ కంట్రీస్‌లో ఒక సినిమా విజయవంతమైతే ఆ బ్రాండ్ అనేక మీడియమ్స్‌లో ముందుకు వెళ్తుంది. ఇక్కడ మాత్రం అలా జరగడం లేదు. సినిమా విజయవంతమైతే అక్కడితో అయిపోతుంది. అయితే మేము ఈ విజయాన్ని కొనసాగించాలని వీర్ ఫిలిమ్స్, సిరీస్ ఇలా చాలా విధాలుగా ప్రయత్నించాం. ఇలాంటి సమయంలో శరత్ వచ్చారు. యానిమేషన్‌లో ఆయన విజన్ నాకు చాలా నచ్చింది. అలా వారితో అసోసియేట్ అయ్యాం. ఆయనతో చాలా కథా చర్చలు జరిగాయి. బాహుబలి ప్రతి పాత్రలో సోల్, ఎమోషన్ ఉంటుంది. ఆ ఎమోషన్ ప్రేక్షకులను గొప్పగా హత్తుకుంటుంది. ఈ యానిమేషన్ సిరీస్‌ని శరత్ కూడా ఆ సోల్ పట్టుకొని అద్భుతంగా రూపొందించడం ఆనందంగా వుంది. గ్రాఫిక్ ఇండియా, ఆర్కా మీడియావర్క్స్, డిస్నీ హాట్‌స్టార్‌లతో కలిసి పనిచేయడం ఒక అద్భుతమైన అనుభవం' అని ఎస్.ఎస్.రాజమౌళి చెప్పారు.

వైభవంగా నవతిహి ఉత్సవం



తెలుగు చిత్ర సీమ 90 ఏళ్ల ప్రయాణాన్ని నవతిహి ఉత్సవంగా ఘనంగా నిర్వహించేందుకు మలేషియా వేదిక కానుంది. ఈ కార్యక్రమం మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా)ప్రెసిడెంట్ విష్ణు మంచు ఆధ్వర్యంలో ఘనంగా జరగనుంది.

కౌలాలంపూర్‌లోని బుకిట్ జలీల్‌లోని ప్రతిష్టాత్మక నేషనల్ స్టేడియంలో జూలై 20న ఈ వేడుకని అత్యంత వైభవంగా నిర్వహించబోతున్నారు. ఈ వేడుకలో సినిమా రంగానికి చెందిన అతిరథులు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో ఈ వేడుక ప్రాముఖ్యతను వివరించడంతోపాటు దీనికి ప్రోత్సాహకరంగా నిలుస్తున్న భాగస్వాములను అందరినీ పరిచయం చేస్తూ సన్‌వే పిరమిడ్, సన్‌వే రిసార్ట్‌లో ప్రత్యేక సమావేశం జరిగింది.

మూడు దేశాల నుండి వచ్చిన ప్రతిపాదనలను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత ఈ ప్రతిష్టాత్మకమైన ఈవెంట్‌ను మలేషియాలో నిర్వహించడం ఉత్తమమని నిర్ణయం తీసుకున్నారు. మలేషియా టూరిజం, మా, స్థానిక ఈవెంట్ ఆర్గనైజర్ ఎంసి ఎంటర్‌టైన్‌మెంట్ భాగస్వామ్యంతో ఈ గ్లోబల్ వేడుకను ఘనంగా నిర్వహించబోతున్నారు.

నవతిహి ఉత్సవం కేవలం సినిమా విజయాలకు వేడుక మాత్రమే కాదు. మలేషియా ప్రజలు, తెలుగు మాట్లాడే వర్గాల మధ్య పరస్పర అవగాహన, గౌరవాన్ని పెంపొందించే సాంస్కృతిక మార్పిడికి చిహ్నంగా ఈ ఈవెంట్ జరగనుందని 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు తెలిపారు.

రియల్ ఇన్సిడెంట్‌తో 100 క్రోర్స్



2016లో జరిగిన ఓ రియల్ ఇన్సిడెంట్‌ని బేస్ చేసుకుని వినోదభరితంగా '100 క్రోర్స్' చిత్రాన్ని నిర్మించారు. దివిజా కార్తీక్, సాయి కార్తీక్ నిర్మాతలుగా ఎస్.ఎస్.స్టూడియోస్ బ్యానర్ పై నిర్మించిన ఈ చిత్రానికి విరాట్ చక్రవర్తి రచయిత, దర్శకుడు. కళ్యాణ్ చక్రవర్తి.జి సహ నిర్మాతగా, వెంకట్ సుధాకర్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.

తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన ఈ ఈవెంట్‌లో దర్శకులు వీర శంకర్, మల్లిక్ రామ్, నిర్మాత హర్షిత్ రెడ్డి, నిర్మాత దామోదర ప్రసాద్ ముఖ్య అతిథులుగా విచ్చేసి, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు.

సాయి కార్తీక్ మాట్లాడుతూ, '2016లో జరిగిన వాస్తవ కథ. ఈ మూవీ చాలా బాగా వచ్చింది. చూసిన వాళ్లంతా బాగుందని అన్నారు. ఈ మూవీ పెద్ద విజయాన్ని సాధిస్తుందన్న నమ్మకం ఉంది' అని అన్నారు.

హీరో చేతన్ మాట్లాడుతూ, 'తెలుగు పరిశ్రమలోకి హీరోగా వస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్' అని చెప్పారు. "డీమానిటైజేషన్‌లో వంద కోట్ల చుట్టూ తిరిగే కథ అని, ఫస్ట్ టైం సినిమాను నిర్మిస్తున్నానని సాయి కార్తీక్ చెప్పారు. ఆయన సంగీతం అంటే నాకు చాలా ఇష్టం. కన్నడ పరిశ్రమ నుంచి తెలుగులోకి వస్తున్న చేతన్‌కు స్వాగతం' అని హర్షిత్ రెడ్డి తెలిపారు. వీర శంకర్ మాట్లాడుతూ, 'డీమానిటైజేషన్ బ్యాక్ డ్రాప్‌లో ఈ మూవీ అందరినీ ఆకట్టుకుంటుంది. విరాట్ నాకు ఎప్పటి నుంచో పరిచయం. సాయి కార్తీక్ ఈ చిత్రంతో మంచి లాభాలను రాబట్టుకోవాలి' అని అన్నారు.

ఆటలు



అటు ఫ్రేజర్.. ఇటు అభిషేక్

రాజస్తాన్‌పై 20 పరుగుల తేడాతో ఢిల్లీ గెలుపు



న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) సీజన్-17లో ప్లే ఆఫ్స్ అవకాశాలు సజీవంగా ఉంచుకోవాలంటే తప్పక రాణించాల్సిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. అభిషేక్ పొరెల్(65), జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్(50) అర్ధసెంచరీలతో చెలరేగడంతో ఢిల్లీ జట్టు 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 221 పరుగులు చేసింది. ఛేదనలో రాజస్తాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 201పరుగులే చేసింది. దీంతో ఢిల్లీ జట్టు 20 పరుగుల తేడాతో గెలిచి పాయింట్ల పట్టికలో 5వ స్థానానికి ఎగబాకింది. ఛేదనలో భాగంగా రాజస్తాన్ ఓపెనర్లు జైస్వాల్(4), బట్లర్(19) నిరాశపరిచినా.. సంజు(86; 46బంతుల్లో 8ఫోర్లు, 6సిక్సర్లు) ఒంటరి పోరాటం చేసి ముఖేష్ కుమార్ బౌలింగ్‌లో వివాదాస్పద క్యాచ్‌కు ఔటయ్యాడు. రియాన్ పరాగ్(27), దూబే(25), బట్లర్(19) ఫర్వాలేదనిపించినా.. లోయర్ ఆర్డర్ బ్యాటర్లు నిరాశపరిచారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కుల్దీప్‌కు దక్కింది. ఢిల్లీ బౌలర్లు ఖలీల్ అహ్మద్, ముఖేశ్‌కుమార్, కుల్దీప్ యాదవ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. అంతకుముందు తొలి వికెట్‌కు ఫ్రేసర్, అభిషేక్ 4.1ఓవర్లలో 60పరుగులు చేసి గట్టి పునాది వేశారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీకి శుభారంభం దక్కింది. ఆసీస్ యువ ఓపెనర్ జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్(50; 20బంతుల్లో 7ఫోర్లు, 3సిక్సర్లు) క్రీజ్‌లో ఉన్నంత సేపు విధ్వంసం సృష్టించాడు. బౌల్ట్ వేసిన తొలి ఓవర్లో ఒకటే ఫోర్ కొట్టినా.. ఆ తర్వాత సందీప్ శర్మ, అవేశ్ ఖాన్‌లను ఉతికేశాడు. ఆవేశ్ వేసిన నాలుగో ఓవర్లో రెచ్చిపోయిన మెక్‌గుర్క్ వరుసగా.. 4, 4, 4, 6, 4, 6 బాది అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఫ్రెజర్ కేవలం 20 బంతుల్లోనే అర్ధసెంచరీని కొట్టాడు. దీంతో ఈ సీజన్‌లో మరోదఫా ఫ్రెజర్ 20బంతుల్లోనే అర్ధసెంచరీని నమోదు చేశాడు.

ఇక చావోరేవో!



నేడు లక్నోతో హైదరాబాద్ ఢీ

నవతెలంగాణ-హైదరాబాద్

ఐపీఎల్ 17 ప్లే ఆఫ్స్ రేసు రసవత్తరంగా మారింది. రాజస్థాన్, కోల్‌కత దాదాపుగా ప్లే ఆఫ్స్‌లో అడుగు పెట్టగా.. చెన్నై, లక్నో, హైదరాబాద్‌లు టాప్-4లో చోటు కోసం పోటీపడుతున్నాయి. ఈ మూడు జట్లు 11 మ్యాచుల్లో ఆరు విజయాలతో 12 పాయింట్లతో సమవుజ్జీలుగా కొనసాగుతున్నాయి. చివరి మూడు మ్యాచుల్లో మెరిసిన జట్టును ప్లే ఆఫ్స్ బెర్త్ వరించనుంది. నేడు ఉప్పల్ వేదికగా సన్‌రైజర్స్‌తో సూపర్‌జెయింట్స్ ఢీకొట్టనుంది. ఈ మ్యాచ్‌లో నెగ్గిన జట్టు ప్లే ఆఫ్స్ రేసులో ఓ అడుగు ముందుకేయనుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ చివరి మూడు మ్యాచులను సొంతగడ్డపైనే ఆడనుంది. ఇది పాట్ కమిన్స్ సేనకు అతిపెద్ద అనుకూలత. ఈ సీజన్లో ఇక్కడ ఆడిన నాలుగు మ్యాచుల్లో మూడింట సన్‌రైజర్స్ విజయం సాధించింది. సొంతగడ్డపై సన్‌రైజర్స్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. ఈ సీజన్లో సన్‌రైజర్స్ ఐపీఎల్ బ్యాటింగ్ రికార్డులను తిరగరాసింది. బౌలర్లు సైతం అద్భుతంగా రాణిస్తున్నారు. కొత్త బంతితో భువనేశ్వర్ కుమార్, మిడిల్ ఓవర్లలో పాట్ కమిన్స్, డెత్ ఓవర్లలో నటరాజన్ అదరగొడుతున్నారు. స్పిన్నర్లు సైతం మెరిస్తే హైదరాబాద్ బౌలింగ్‌కు ఎదురులేదు. ట్రావిశ్ హెడ్, అభిషేక్ శర్మ నిలకడగా రాణిస్తున్నా.. హెన్రిచ్ క్లాసెన్ ఫామ్ కోల్పోయాడు. చావోరేవో తేల్చుకోవాల్సిన సమయంలో క్లాసెన్ ఫామ్ సన్‌రైజర్స్‌కు అత్యంత కీలకం. నితీశ్ కుమార్ రెడ్డి, షాబాజ్ అహ్మద్, అబ్దుల్ సమద్ మరింత క్రియాశీల పాత్ర పోషించాల్సిన అవసరం ఉంది.



అహిక, సుతీర్థ ఓటమి

సౌదీ స్మాష్ 2024

జెద్దా (సౌదీ అరేబియా): సౌదీ స్మాష్ టోర్నమెంట్‌లో భారత డబుల్స్ జోడీలకు వరుస పరాజయాలు ఎదురయ్యాయి. మహిళల డబుల్స్‌లో అహిక ముఖర్జీ, సుతీర్థ ముఖర్జీ జోడీ ప్రీ క్వార్టర్‌ఫైనల్లో నిరాశపరిచింది. మియు (జపాన్), కిమ్ (దక్షిణ కొరియా) జోడీ చేతిలో ఆసియా క్రీడల కాంస్య పతక విజేతలు 2-3తో ఓటమి చెందారు. 6-11, 11-9, 10-12, 11-6, 11-8తో అహిక, సుతీర్థ పోరాడి ఓడారు. మెన్స్ డబుల్స్ విభాగంలో మనుశ్ షా, మానవ్ ఠాకూర్‌లు స్లోవేకియా, హాంగ్‌కాంగ్ ప్యాడర్ల చేతిలో 18-20, 11-4, 11-6, 9-11, 11-7తో పరాజయం పాలయ్యారు.

గుకేశ్‌పైనే ఫోకస్

నేటి నుంచి గ్రాండ్ చెస్ టూర్



వార్సా (పోలాండ్) : క్యాండిడేట్స్ కింగ్‌గా నిలిచిన తర్వాత డి. గుకేశ్ తొలి పరీక్షకు సిద్ధమవుతున్నాడు. ఐదు అంచెల్లో సాగే గ్రాండ్ చెస్ టూర్ నేటి నుంచి పోలాండ్‌లో షురూ కానుంది. ప్రపంచ మేటీ తొమ్మిది మంది గ్రాండ్‌మాస్టర్లు ఇందులో పోటీపడుతున్నారు. గుకేశ్‌తో పాటు ఆర్. ప్రజ్ఞానంద సైతం ఎత్తులు వేయనున్నాడు. రోమానియా, క్రోయేషియా, యుఎస్‌ఏలో చివరి నాలుగు అంచెల పోటీలు ఉంటాయి. ఐదు అంచెల పోటీల అనంతరం విజేతను ప్రకటిస్తారు. ఫాబియానో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతున్నాడు. పోలాండ్‌లో అర్జున్, క్రోయేషియాలో విదిత్ గుజరాతీలు వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇవ్వనున్నారు. గ్రాండ్ చెస్ టూర్ ఓవరాల్ ప్రైజ్‌మనీ సుమారు రూ.15 కోట్లు.



బాస్కెట్‌బాల్ చాంప్స్ : 54 జట్లు పోటీపడిన బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. అండర్-17 గర్ల్స్, బాయ్స్ విభాగం ఫైనల్లో ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్, పుష్పన్ స్పోర్ట్స్ అకాడమీలు పోటీపడగా.. రెండింట్లోనూ ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ జట్లు విజయం సాధించాయి. భారత బాస్కెట్‌బాల్ జట్టు కోచ్ పిఎస్ సంతోశ్ విజేతలకు బహుమతులు అందజేశారు.



పోల్ వార్-2024

రాష్ట్ర రాజకీయాలు కలుషితం

సీఎం అయినా రేవంత్‌రెడ్డి మాట తీరు మారలేదు

- మల్కాజిగిరిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు పోటీనే కాదు : మీట్ ది ప్రెస్‌లో మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర రాజకీయాలు కలుషితమయ్యాయనీ, 20 ఏండ్లలో ఇలాంటి రాజకీయాలను తానెన్నడూ చూడలేదని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ ది ప్రెస్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులెవ్వరో ప్రజలకు సరిగా తెల్వదనీ, వారు తనకు పోటీనే కాదని చెప్పారు. వారికి డిపాజిట్లు కూడా వస్తాయోరావో అన్న సందేహం కలుగుతోందన్నారు. సర్వేలకు అందని రీతిలో తాను విజయం సాధించబోతున్నాననే ధీమాను వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఏదీ అమలు కావట్లేదని విమర్శించారు. మహిళలకు ఇస్తామన్న రూ.2,500, రూ.4వేల పింఛన్ ఏమయ్యాయని ప్రశ్నించారు. కాళేశ్వరం అవినీతిపై చర్యలుంటాయనుకుంటే కమిటీలతో కాలయాపన చేస్తున్నారనీ, ఫోన్ ట్యాపింగ్ కేసు ఊసెత్తడం లేదని విమర్శించారు. రుణమాఫీ, రైతులకు రూ.15 వేల పంట సహాయం, కౌలురైతుకు రూ.12 వేలు, ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేలు ఎందుకివ్వటం లేదని నిలదీశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాల కోరని నాలుగు నెలల్లోనే తేలిందన్నారు. సీఎం అయినా ఆయన మాట తీరు మారలేదని విమర్శించారు. చిల్లర చేష్టలు చేసేవారు రాజకీయాల్లో ఎక్కువ కాలం మనుగడ సాధించలేరనీ, వారు ఖతం అయిపోతారని చెప్పారు. 20 ఏండ్ల రాజకీయ జీవితంలో తానెన్నడూ సంస్కారహీనంగా ప్రవర్తించలేదన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గాడి తప్పడానికి తానూ కారణమే అని జరుగుతున్న ప్రచారాన్ని కొట్టి పడేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏ బిల్లు చేతికందాలన్నా ఏడు నుంచి 10 శాతం ఇస్తే ముట్టజెప్పితేగానీ విడుదల కావడం లేదని ఆరోపించారు. కులం చూసి ఓట్లు వేస్తే వ్యవస్థ ఆగమైపోతుందని చెప్పారు. కులం పునాది మీదుగా రాజకీయాలు చేసేవారెన్నడూ విజయం సాధించలేరని స్పష్టం చేశారు. దొడ్డిదారి రాజకీయాలు దిగజారుడు తనానికి పరాకాష్ట అన్నారు. ప్రజలు అత్యంత శక్తివంతులనీ, వారే చరిత్ర నిర్మాతలని చెప్పారు. దేశంలో సంకీర్ణ రాజకీయాలకు కాలం చెల్లిందనీ, కేంద్రంలో మళ్లీ మోడీ సర్కారే అధికారంలోకి వస్తుందని అన్నారు. తెలంగాణలో మెజార్టీ ముస్లిములు బీసీ జాబితాలో ఉన్నారనీ, అలాంటప్పుడు మత ఆధారిత రిజర్వేషన్లు ఎందుకని అడిగారు. పఠాన్‌లు, సయ్యద్‌లు ఈడబ్ల్యూఎస్ పరిధిలోకి వస్తారనీ, అలాంటప్పుడు ముస్లిం రిజర్వేషన్లు ఎందుకు అని ప్రశ్నించారు. మల్కాజిగిరి ప్రజలను తాను తాగుబోతులన్నట్టుగా వీడియో మార్ఫింగ్ చేసి అసత్య ప్రచారం చేస్తున్నవారిపై ఈసీకి ఫిర్యాదు చేస్తామన్నారు. కేసీఆర్‌ను ప్రజలు నమ్మట్లేదన్నారు. తానెప్పుడూ పోరాటంలోనే ఉంటాననీ, మంత్రిగా ఉండి కూడా మున్సిపల్, ఆర్టీసీ కార్మికుల సమ్మెలకు మద్దతు తెలిపిన విషయాన్ని ప్రస్తావించారు. మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలపడం, ముక్కుసూటిగా ఉండటం వల్లనే బీఆర్ఎస్ నుంచి తనను బయటకు పంపారన్నారు. ఈ సమావేశంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఎల్. వేణుగోపాల్ నాయుడు, ప్రధాన కార్యదర్శి ఆర్.రవికాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వనజ, సభ్యులు ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీలకు వాటా దక్కనీయకుండా బీజేపీ మహాకుట్ర

అందులో భాగంగానే 400 సీట్లు అడుగుతుంది

- అవకాశం దొరికితే రిజర్వేషన్లు మార్చేందుకు యత్నం
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చడం ఎవరి తరం కాదు
- అబద్ధాల ముసుగులో మాజీ సీఎం కేసీఆర్ : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 90 శాతం వాటా దక్కనీయకుండా బీజేపీ మహాకుట్ర చేస్తున్నదని డిప్యూటీ సీఎం మల్లు విక్రమార్క విమర్శించారు. అందులో భాగంగా రిజర్వేషన్ల రద్దు చేసేందుకు సరైన అవకాశం కోసం ఎదురు చూస్తున్నదని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ 400 సీట్లు అడగడంలో అంతర్యం ఇదేనన్నారు. ఆ పార్టీ అసలు ఎజెండా కులాల రిజర్వేషన్లు రద్దు చేయడమేనన్నారు. ఈ పరిస్థితుల్లో కేసీఆర్ బీజేపీకి వత్తాసు పలకడం సిగ్గు చేటన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలు బండ్ల గణేష్, సామ రామ్మోహన్‌రెడ్డితో కలిసి భట్టి విక్రమార్క విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటివరకు ఉంటదో కూడా తెలియదంటూ ఆ రెండు పార్టీలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చడం ఎవరి తరం కాదని హెచ్చరించారు. మాజీ సీఎం కేసీఆర్ అబద్ధాల ముసుగులో బతుకున్నారని ఎద్దేవా చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో 2/3 మెజార్టీ సాధించి, రాజ్యాంగంలోని సెక్యులర్ పదాన్ని తొలగించాలని కమలనాథులు చూస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో బీఆర్ఎస్, బీజేపీ కలిసిపోయాయని విమర్శించారు. బీఆర్ఎస్ పదేండ్ల ప్రభుత్వ పాలనలో రాష్ట్రం చిన్నాభిన్నమైందన్నారు. అలాంటి రాష్ట్రాన్ని మూడు నెలల్లోనే చక్కదిద్దామని తెలిపారు. వాస్తవాలను ప్రజలకు చెప్తున్నందుకే సీఎం రేవంత్‌ను భయపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. హిట్లర్, ముస్సోలినీలాగా కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టాలని బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. పదేండ్ల బీజేపీ పాలనలో దేశం అల్లకల్లోలంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యత బడుగు, బలహీన వర్గాలు బీజేపీ అధికారంలోకి రాకుండా చూడాలని కోరారు. దేశంలో ఇలాంటి దుస్థితి రావడం ప్రజాస్వామ్యానికి మంచిదికాదన్నారు. తిరిగి ఆ పార్టీ అధికారంలోకి వస్తే దళిత, గిరిజనులు, బలహీన వర్గాలు తమ హక్కులను కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆ పార్టీకి ఓటేస్తే వేస్తే మన గొంతు మనమే కోసుకున్నట్టు ఉంటుందని, ఆయా వర్గాలకు భవిష్యత్తు లేకుండా పోతుందన్నారు. ఆ పార్టీ నిర్వాకం వల్ల భారతదేశం పెను ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ కుట్ర, కుతంత్రాలను పసిగట్టిన ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్ జోడోయాత్ర, న్యాయయాత్ర చేశారని గుర్తు చేశారు. ఓబీసీ కులగణన చేసి జనాభా దామాషా ప్రకారం ఆస్తులను పంచుతామంటూ రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కులగణన చేపడుతున్నదని చెప్పారు. రాహుల్ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో కులగణన ప్రక్రియ మొదలైందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 14 ఎంపీ స్థానాల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ బీజేపీకి మద్దతు ఇవ్వడాన్ని ప్రస్తావించగా... ఆయనకు భావస్వేచ్ఛ ఉందని చెప్పారు.

కుర్‌కురే.. కిరికిరి పార్టీలకి బుద్ధి చెప్పండి

- బీజేపీతో దోస్తీ ఉంటే నా చెల్లి జైల్లో ఎందుకుంటది..: అంబర్‌పేట్‌లో రోడ్‌షో కేటీఆర్

నవతెలంగాణ-అంబర్‌పేట



తెలంగాణ కోసం కొట్లాడే బీఆర్ఎస్ పార్టీ ఒక దిక్కు.. కుర్ కురే బీజేపీ.. కిరికిరి కాంగ్రెస్.. చెరో దిక్కున్నాయని.. ఈ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. జూన్ 2 తర్వాత బీజేపోళ్లు ఖచ్చితంగా హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేస్తారన్నారు. మంగళవారం రాత్రి హైదరాబాద్ తిలక్‌నగర్‌లోని ఫీవర్ ఆస్పత్రి దగ్గర మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంటు అభ్యర్థి పద్మారావుగౌడ్‌తో కలిసి కేటీఆర్ రోడ్డు షో నిర్వహించి మాట్లాడారు. హైదరాబాద్‌పై బీజేపీకి పట్టు దొరుకుతలేదని, అందుకే కేంద్రపాలిత ప్రాంతం చేయాలని కుట్రలు చేస్తోందని అన్నారు. దాన్ని అడ్డుకోవాలంటే పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీలు ఖచ్చితంగా ఉండాలని చెప్పారు. ఐదుగురు ఎంపీలతో కేసీఆర్ తెలంగాణ తెచ్చారని గుర్తు చేశారు. ఐదేండ్లలో కిషన్ రెడ్డి అంబర్‌పేటకు ఒక్క రూపాయి తెచ్చిండా?.. ఒక్క గుడి కట్టిండా, బడి కట్టిండా? ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. బీజేపీతో దోస్తీ ఉంటే నా చెల్లెలు జైల్లో ఉండేదా అని ఆవేదన వ్యక్తం చేశారు.

సీపీఐ(ఎం) పార్లమెంటు ఎన్నికల ప్రసంగం

నేడు దూరదర్శన్, ఆకాశవాణిలో

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా దూరదర్శన్, ఆకాశవాణిలో బుధవారం రాత్రి 8.30 గంటలకు ఐదు నిమిషాల పాటు సీపీఐ(ఎం) ఎన్నికల ప్రసంగం ప్రసారమవుతుంది. దూరదర్శన్‌లో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు, ఆకాశవాణిలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం శ్రీనివాస్ ప్రసంగిస్తారు. ఈ ప్రసంగాలను వీక్షించాలని ప్రజలకు ఆ పార్టీ విజ్ఞప్తి చేసింది.

రైతులపై బీజేపీ, బీఆర్ఎస్‌లది కపట ప్రేమే :మంత్రి పొన్నం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీజేపీ, బీఆర్ఎస్‌లు రైతులపై కపట ప్రేమను ప్రదర్శిస్తున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. రైతులందరికీ రైతు భరోసా డబ్బులను వారి ఖాతాల్లో జమ చేస్తే ఆయా పార్టీలకు చెందిన నేతలు ఓర్వలేకపోయారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు భరోసా నిధులను విడుదల చేసేందుకు తమ ప్రభుత్వం భావిస్తుంటే ఉద్దేశపూర్వకంగానే ప్రతిపక్ష పార్టీలు దాన్ని అడ్డుకున్నాయని విమర్శించారు. రైతు భరోసాను ఆపాలంటూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాయనీ, దీంతో రైతు ఖాతాల్లో డబ్బులు నిలిచిపోయాయని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు..

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

ప్రయివేటు పెట్టుబడులు డీలా

- 2022-23లో 36 శాతానికి పతనం
- కోవిడ్ నాటి కనిష్ట స్థాయికి క్షీణత
- నేషనల్ అకౌంట్స్ స్టాటిస్టిక్స్ గణంకాల వెల్లడి



న్యూఢిల్లీ : మౌలిక వసతుల రంగంలో పెట్టుబడులు దూసుకుపోతున్నాయని.. మరోమారు మోడీ సర్కార్ అధికారంలోకి వస్తే మరింత అభివృద్ధిని చూపెడుతామని ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో బిజెపి చేస్తున్న విస్తృత ప్రచారానికి వాస్తవ పరిస్థితులకు పొంతన లేకుండా పోయింది. మౌలిక వసతుల రంగంలో పెట్టుబడులు కోవిడ్ నాటి స్థాయికి పడిపోవడమే ఇందుకు నిదర్శనం. ఆర్థిక సంవత్సరం 2022-23లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగంలో ప్రయివేటు పెట్టుబడుల వాటా 36.2 శాతానికి క్షీణించిందని నేషనల్ అకౌంట్స్ స్టాటిస్టిక్స్ గణంకాల్లో తేలింది. ఇంతక్రితం ఏడాది 2021-22లోనూ 36.3 శాతంగా ఉంది. ఏడాదికేడాదితో పోల్చితే 2022-23లో ప్రయివేటు ఫైనాన్సీయల్ కార్పొరేషన్స్ పెట్టుబడుల్లోనూ 0.7 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. ప్రభుత్వ ఫైనాన్స్‌యేతర లేదా ప్రభుత్వ రంగ కంపెనీల పెట్టుబడుల వాటా 9.4 శాతానికి తగ్గింది. ఇంతక్రితం 2021-22లో పిఎస్‌యుల పెట్టుబడులు 9.5 శాతంతో పోల్చితే స్వల్ప తగ్గుదల చోటు చేసుకుంది. ఉత్పత్తి రంగంలో పిఎస్‌యుల పెట్టుబడుల్లో పెరుగుదల చోటు చేసుకుంది. ఈ విభాగంలో పిఎస్‌యుల వాటా వరుసగా 2018-19, 2019-20, 2020-21లో వరుసగా 9.7 శాతం, 10.2 శాతం, 11.6 శాతం చొప్పున పెరుగుతూ వచ్చింది. 2022-23లోనూ రియల్ ఎస్టేట్‌లో ప్రభుత్వ వాటా 13 శాతానికి పెరిగింది. ఇంతక్రితం 2021-22లో 12 శాతంగా ఉంది. 2023-24లోనూ ప్రయివేటు రంగ పెట్టుబడులు 15.3 శాతం క్షీణించాయని ఇటీవల ఇన్వెస్ట్‌మెంట్ ట్రాకింగ్ సంస్థ ప్రాజెక్ట్స్ టుడే ఓ రిపోర్ట్‌లో తెలిపింది. విదేశీ పెట్టుబడిదారులు కూడా దాదాపు మూడింట ఒక వంతు కొత్త ఖర్చులను తగ్గించారని తెలిపింది. దీని ఫలితంగా 2022-23లో నమోదైన దాదాపు రూ.37 లక్షల కోట్లతో పోలిస్తే కొత్త పెట్టుబడుల ప్రకటనల విలువ దాదాపు 5 శాతం తగ్గింది. తయారీ రంగంలో ప్రయివేటు రంగ పెట్టుబడి ప్రణాళికలలో భారీ తగ్గుదల చోటు చేసుకుంది. ఇందులో ప్రతిపాదిత వ్యయాలు 2022-23లో రూ.19.85 లక్షల కోట్లతో పోల్చితే.. 2023-24 నాటికి రూ.11.9 లక్షల కోట్లకు పడిపోయాయని 'ది హిందూ' పత్రిక ఓ కథనంలో వెల్లడించింది. 2022-23లో తయారీ రంగంలో కొత్త పెట్టుబడులు దాదాపు 54 శాతం మేర తగ్గాయి. నీటిపారుదల, మైనింగ్‌లో పెట్టుబడులు వరుసగా 48.7 శాతం, 19.25 శాతం చొప్పున క్షీణించాయి. పెట్టుబడుల ద్వారానే కొత్త ఉద్యోగాలు సృష్టించబడుతాయి. దేశంలో ప్రజల ఆదాయాలు తగ్గడంతో సరుకులకు డిమాండ్ పడిపోవడంతో కంపెనీలు తమ విస్తరణ కార్యకలాపాలను తగ్గించుకుంటున్నాయి. దీంతో దేశంలో నిరుద్యోగం పెరుగుతోంది. ఓ వైపు పెట్టుబడుల్లో పతనం, మరోవైపు నిరుద్యోగం ఎగిసిపడుతోన్నప్పటికీ.. దేశం దూసుకుపోతోందని మోడీ సర్కార్ చేస్తున్న ప్రచారం విమర్శలకు దారి తీస్తోంది.

భారత్ పే నుంచి ఆన్ ఇన్ వన్ చెల్లింపు పరికరం



ముంబయి : ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ భారత్‌పే కొత్తగా ఆల్ ఇన్ వన్ చెల్లింపు పరికరాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది. పిఒఎస్, క్యూఆర్ కోడ్, స్పీకర్‌లను ఒకే పరికరంలోకి అనుసంధానించేలా దీన్ని డిజైన్ చేసినట్లు పేర్కొంది. ఈ వినూత్న ఉత్పత్తి వ్యాపారుల కోసం లావాదేవీలను క్రమబద్ధీకరించడానికి రూపొందించబడిందని భారత్ పే సిఇఒ నలిన్ నేగి తెలిపారు.

వెల్‌స్పన్ లివింగ్ బోర్డులోకి నయ్యా సాగ్గి



న్యూఢిల్లీ : హోమ్ టెక్స్‌టైల్స్, ఫ్లోరింగ్ సొల్యూషన్స్ సంస్థ వెల్‌స్పన్ లివింగ్ లిమిటెడ్ తమ ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా నయ్యా సాగ్గిని నియమించినట్లు తెలిపింది. ఆమె ఈ హోదాలో నాలుగేళ్ల పాటు కొనసాగనుందని తెలిపింది. ప్రస్తుతం ఆమె గుడ్ గ్లామ్ గ్రూప్ కో ఫౌండర్, అధ్యక్షురాలుగా ఉన్నారని.. నయ్యా సాగ్గి బోర్డ్‌రూమ్‌కు అపారమైన అనుభవం, నైపుణ్యం తీసుకువస్తుందని వెల్‌స్పన్ ఆశాభావం వ్యక్తం చేసింది.

డాక్టర్ రెడ్డీస్‌కు రూ.1,307 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రముఖ ఔషధ ఉత్పత్తుల కంపెనీ డాక్టర్ రెడ్డీస్ గడిచిన ఆర్థిక సంవత్సరం 2023-24 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో రూ.1,307 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ4లోని రూ.959.2 కోట్ల లాభాలతో పోల్చితే 36 శాతం వృద్ధిని సాధించింది. క్రితం క్యూ4లో డాక్టర్ రెడ్డీస్ రెవెన్యూ 12 శాతం పెరిగి రూ.7,083 కోట్లుగా నమోదయ్యింది. అమెరికా, యూరపియన్ మార్కెట్లలో బలమైన అమ్మకాలు మెరుగైన ఫలితాలకు దోహదం చేశాయని ఆ కంపెనీ తెలిపింది. యూరప్‌లో అమ్మకాలు 5 శాతం, యుఎస్‌లో రికార్డ్ స్థాయిలో 29 శాతం చొప్పున పెరిగాయి. మొత్తం ఆర్థిక సంవత్సరం 2023-24లో డాక్టర్ రెడ్డీస్ నికర లాభాలు 23.6 శాతం పెరిగి రూ.5,568 కోట్లుగా చోటు చేసుకున్నాయి. రెవెన్యూ 13.5 శాతం వృద్ధితో రూ.27,916.4 కోట్లుగా నమోదయ్యింది. 2023-24గాను ప్రతీ రూ.5 ఈక్విటీ షేర్‌పై రూ.40 తుది డివిడెండ్‌ను చెల్లించడానికి కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది.

లక్నో ప్లాంట్‌లో 9 లక్షల యూనిట్ల తయారీ

- టాటా మోటార్స్ వెల్లడి



లక్నో : దేశంలోనే అతిపెద్ద వాణిజ్య వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ తన అత్యాధునిక లక్నో ఫెసిలిటీ నుండి 9లక్షల యూనిట్లను తయారు చేసి.. నూతన మైలురాయిని నమోదు చేసినట్లు తెలిపింది. 600 ఎకరాల విస్తీర్ణంలోని ఈ లక్నో ప్లాంట్‌ను 1992లో ఏర్పాటు చేసింది. ఇక్కడ తేలికపాటి, మధ్యతరహా, మధ్యస్థ, భారీ వాణిజ్య వాహనాలు, అలాగే ఎలక్ట్రిక్, ఫ్యూయల్ సెల్ ఎలక్ట్రిక్ బస్సులతో సహా అనేక రకాల కార్గో, ప్రయాణీకుల వాణిజ్య వాహనాలను ఉత్పత్తి చేస్తోంది.

సెన్సెక్స్ 384 పాయింట్ల పతనం

ముంబయి : అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు ఉన్నప్పటికీ భారత స్టాక్ మార్కెట్లు ప్రతికూలతలో ముగిశాయి. మదుపర్లు అమ్మకాలకు మొగ్గు చూపడంతో బిఎస్ఇ సెన్సెక్స్ 382.69 పాయింట్లు కోల్పోయి 73,511.85 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 600 పాయింట్ల మేర కోల్పోయినప్పటికీ చివరి దశలో కొంత పుంజుకున్నాయి. ఎన్ఎస్ఇ నిఫ్టీ 141 పాయింట్ల నష్టంతో 22,303 వద్ద నమోదయ్యింది. ముఖ్యంగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసిఐసిఐ బ్యాంక్, పవర్ గ్రిడ్, ఇండుస్‌ఇండ్ బ్యాంక్, టాటా మోటార్స్ సూచీలు అమ్మకాల ఒత్తిడికి గురి కావడంతో మార్కెట్లు పతనాన్ని చవి చూశాయి.

టెస్లాలో కొనసాగుతున్న ఉద్వాసనలు

న్యూయార్క్ : ఎలన్ మస్క్‌కు చెందిన టెస్లా కంపెనీల్లో ఉద్యోగుల తొలగింపులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే మూడు సార్లు ఉద్వాసనలు ప్రకటించిన టెస్లా మరోమారు వేటుకు పూనుకోవడంతో ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. గత వారం ఇద్దరు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లను ఇంటికి పంపించారు. రానున్న రోజుల్లో మరింత మంది ఉద్యోగులపై వేటు వేయడానికి కసరత్తు జరుగుతుందని సమాచారం. కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులలో 10 శాతానికంటే ఎక్కువ మందిని తొలగిస్తున్నట్లు ఏప్రిల్ 14న ఎలన్ మస్క్ ప్రకటించారు. ఇందులో రిక్రూట్‌మెంట్, మార్కెటింగ్, సూపర్ చార్జింగ్ టీమ్‌తో సహా వివిధ విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగులు ఉన్నారు

వ్యవసాయ పరిశోధనలో క్షీణిస్తున్న వ్యయం : సర్వే

న్యూఢిల్లీ : 2011-2022 మధ్య కాలంలో వ్యవసాయ పరిశోధనా వ్యయం క్షీణించింది.వాస్తవానికి వ్యవసాయ పరిశోధనలో ఖర్చు చేసిన వ్యయానికి ప్రతి రూపాయికి సుమారు రూ.13.85 పైసలు రాబడి వస్తుందని సర్వేలో వెల్లడైంది. పైగా వ్యవసాయానికి సంబంధించిన అన్ని ఇతర కార్యకలాపాల నుండి వచ్చే రాబడిని ఇది అధిగమించడం గమనార్హం. రాబడి అధికంగా ఉన్నప్పటికీ.. ప్రభుత్వం వ్యసాయ పరిశోధనల్లో వ్యయాన్ని పెంచడం లేదని సర్వే స్పష్టం చేసింది.



ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్) కింద పనిచేస్తున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎకనామిక్స్ అండ్ పాలసీ రీసెర్చ్ (ఎన్ఐఎపి) గత నెలలో ఈ వర్కింగ్ పేపర్‌ను ప్రచురించింది. ఆహారంతో పాటు ఇతర వ్యవసాయ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా తక్కువ వ్యవసాయ విస్తరణ మధ్య వాటి ఉత్పత్తికి భవిష్యత్తులో సవాళ్లను ఎదుర్కొనేందుకు మరింత పెట్టుబడులు అత్యవసరం. ఆర్థిక, సామాజిక, పర్యావరణ ప్రయోజనాలను పెంచడానికి వ్యవసాయంలో పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డి) విభాగాలు, వాటి అనుబంధ విభాగాలు ప్రాధాన్యత ప్రధానమైనది. వ్యవసాయ విస్తరణ కార్యకలాపాలను పెంచిన తర్వాత పెట్టుబడి పెట్టిన ప్రతిరూపాయికి రూ.7.40 రెండవ అత్యుత్తమ రాబడిని ఇస్తుందని పరిశోధనల్లో తేలింది.

సర్వేలో వెల్లడైన కీలక అంశాలు

- విస్తృతమైన వ్యవసాయ, అనుబంధ కార్యకలాపాల్లో, సబ్‌సెక్టార్ స్థాయిలో చెల్లింపుల్లో స్పష్టమైన తేడాలున్నట్లు సర్వే గుర్తించింది. జంతు శాస్త్ర పరిశోధనల్లో వ్యయంపై ఆదాయం ప్రతి రూపాయికి రూ.20.81 గణనీయంగా అధికంగా ఉంది. అదే క్రాప్ సైన్స్ సెక్టార్‌పై రూ.11.69గా ఉంది.
- వ్యవసాయ పరిశోధలపై పెట్టుబడుల్లో ప్రాంతాల వారీగా కూడా గణనీయమైన తేడా ఉంది. 2011-2020 మధ్య ఒడిశా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్‌లలో దేశంలోని నికర విత్తన విస్తీర్ణంలో 43 శాతంగా ఉంది. వాటిలో వ్యవసాయ పరిశోధనపై జిడిపిలో 0.25 శాతం కంటే తక్కువ ఖర్చు చేసింది. మరోవైపు జమ్ముకాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, బీహార్, కేరళ మరియు అస్సాంలలో వ్యవసాయ పరిశోధన, అభివృద్ధికి జీడీపీలో కేవలం 0.80 శాతం మాత్రమే ఖర్చు చేసింది. పశువులు, సహజవనరులపై గణనీయంగా తక్కువ వ్యయం చేస్తున్నట్లు స్పష్టమైంది. కానీ, దక్షిణాది రాష్ట్రాల్లో ఈ వ్యయం మరింత సమతుల్యంగా ఉందని సర్వే తెలిపింది.

2011-2020 మధ్య కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు వరుసగా 33.8 శాతం సహకారం అందించాయి. వ్యవసాయ ఆర్‌అండ్ డిలో మొత్తం పెట్టుబడిలో ప్రభుత్వాల వాటా 58.5 శాతంగా ఉంది. అయితే ప్రయివేట్ రంగం పెట్టుబడులు 8 శాతానికి పెరిగినప్పటికీ... ప్రపంచ సగటు కన్నా తక్కువగానే ఉంది.

2011-2020 వరకు, భారత్ తన వ్యవసాయ జీడీపీలో 0.61 శాతం పరిశోధన కోసం ఖర్చు చేసింది. ప్రపంచ సగటు 0.93 శాతంలో మూడింట రెండు వంతులుగా ఉన్నట్లు సర్వే తేల్చింది. వ్యవసాయ జీడీపీలో విస్తరణ సేవలపై ఖర్చు చేసింది 0.16 శాతం. 2020-21మధ్య భారత్ వ్యవసాయ జీడీపీలో పరిశోధన కోసం 0.54 శాతం ఖర్చు చేయగా, విస్తరణ సేవల కోసం 0.11 శాతం ఖర్చు చేసింది.

పరిశోధన వ్యయంలో వార్షిక వృద్ధి 1981-1990లో 6.4 శాతం నుండి 2011-2020లో 4.4 శాతానికి క్షీణించింది. ప్రధానంగా ప్రభుత్వ వ్యయంలో మందకొడిగా సాగుతున్న వృద్ధి, ప్రయివేట్ వ్యయం వృద్ధిలో గణనీయమైన క్షీణత కారణమని సర్వే తేల్చింది.

రష్యా వ్యూహాత్మక అణు విన్యాసాల వెనుక ...?

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సోమవారం ఉక్రెయిన్ సరిహద్దులో ఉన్న సదరన్ మిలిటరీ డిస్ట్రిక్ట్‌లో వ్యూహాత్మక అణ్వాయుధాల వినియోగంలో స్నాప్ ఎక్సర్‌సైజ్‌ను ఆదేశించారు. ఈ డ్రిల్ ఉక్రెయిన్ సంఘర్షణను మరింత పెంచవద్దని అమెరికా, దాని మిత్రదేశాలకు ఒక హెచ్చరికగా ఉద్దేశించబడిందని మాస్కోలోని విదేశాంగ, రక్షణ మంత్రిత్వ శాఖలు వేర్వేరు బహిరంగ ప్రకటనల్లో నొక్కిచెప్పాయి. రష్యా అనేక సందర్భాల్లో అణు బెదిరింపులకు పాల్పడుతోందని పశ్చిమ దేశాలు ఆరోపించినప్పటికీ, మాస్కో అణు సిద్ధాంతం మారలేదని క్రెమ్లిన్ పదేపదే పేర్కొంది."రష్యా సమగ్రత, సార్వభౌమత్వాన్ని నిర్ధారించడానికి, వ్యూహాత్మక అణ్వాయుధాల తయారీ, విస్తరణలకు సంబంధించిన ఆచరణాత్మక అంశాలను", అలాగే పరికరాలు, సిబ్బంది సంసిద్ధతను బలోపేతం చేయడం తమ అణు కసరత్తుల ఉద్దేశం"అని రష్యన్ రక్షణ మంత్రిత్వ శాఖ సోమవారం తెలిపింది. ఉక్రెయిన్‌కు సరిహద్దుగా ఉన్న సదరన్ మిలిటరీ డిస్ట్రిక్ట్ లో ఈ వ్యాయామాలు జరుగుతాయి. రోస్టోవ్-ఆన్-డాన్‌లో ప్రధాన కార్యాలయం ఉంది. ఇది రష్యా మిలిటరీ జిల్లాలలో అతి చిన్నది. క్రిమియా, కాకసస్, రోస్టోవ్, వోల్గోగ్రాడ్, క్రాస్నోడార్ ప్రాంతాలు, అలాగే ఇటీవలే రష్యాలో కలిసిన డోనెట్స్క్ పీపుల్స్ రిపబ్లిక్, లుగాన్స్క్ పీపుల్స్ రిపబ్లిక్, ఖేర్సన్, జపొరొజ్జియా ప్రాంతాలలో ఈ అణు ఎక్సర్సైజెస్ జరుగుతాయి1945 ఆగస్టులో జపాన్ నగరాలైన హిరోషిమా,



నాగసాకిలపైన అమెరికా ప్రయోగించిన ఆయుధాల వంటివి ఇప్పుడు వ్యూహాత్మక అణ్వాయుధాలుగా పరిగణించబడుతున్నాయి. అవి ఫీల్డ్ ఫార్మేషన్‌లు లేదా గట్టిపడిన పోరాట స్థానాలు అయినా, యుద్ధభూమి లక్ష్యాలకు వ్యతిరేకంగా ఉపయోగిం చడానికి ఉద్దేశించబడ్డాయి. 5-50 కిలోటన్నుల వ్యూహాత్మక అణు వార్‌హెడ్‌లను బాలిస్టిక్ క్షిపణులు లేదా క్రూయిజ్ క్షిపణులపై అమర్చవచ్చు. రెండూ ఇస్కాండర్-ఎమ్ కాంప్లెక్స్ నుంచి ప్రయోగించబడతాయి. ఇలాంటి వార్‌హెడ లను కింజాల్, క్రూయిజ్ క్షిపణులు రష్యా బాంబర్లు మోసుకెళ్లగలవు. అనేక ఫిరంగి వ్యవస్థలు 152ఎమ్ఎమ్ షెల్లు , 240ఎమ్ఎమ్ మోర్టార్ రౌండ్లలో అమర్చబడిన 2-2.5 కిలోటన్ శ్రేణిలో వ్యూహాత్మక అణు వార్‌హెడ్‌లను కూడా అందించగలవు.రష్యాలో దాదాపు 6,000 అణు వార్‌హెడ్‌లు ఉన్నాయని అంచనా వేయబడింది. నాటో సభ్యులు ఉక్రెయిన్‌కు క్షీణించిన యురేనియం ఆయుధాలను పంపిణీ చేసినందుకు ప్రతిస్పందనగా, గత సంవత్సరం బెలారస్‌లో పేర్కొనబడని సంఖ్యలో వ్యూహాత్మక అణు వార్‌హెడ్‌లు ఉంచబడ్డాయి. ఐరోపాలోని ఆరు స్థావరాలలో సుమారు 180 వ్యూహాత్మక అణు బాంబులను అమెరికా మోహరించింది(ఇటలీలో రెండు, బెల్జియం, జర్మనీ, నెదర్లాండ్స్, టర్కియేలలో ఒక్కొక్కటి). ఇటీవల పోలెండ్ ప్రభుత్వం తమ దేశంలో అణ్వాయుధ స్థావరాన్ని ఏర్పాటు చేయడానికి సుముఖత వ్యక్తం చేసింది. పోలాండ్ అటువంటి అణ్వాయుధ స్థావరాన్ని గనుక నెలకొల్పితే అది తమ లక్ష్యంగా ఉంటుందని రష్యా ప్రకటించి ఉక్రెయిన్ వివాదానికి సంబంధించి "పాశ్చాత్య దేశాల నాయకులు చేస్తున్న ప్రకటనలు ఇటీవలి పోరాట ప్రకటనలు , అనేక నాటో దేశాలు తీసుకున్న చర్యలను తీవ్రంగా అస్థిరపరిచే" నేపథ్యంలో ఈ వ్యూహాత్మక అణు కసరత్తులు జరుగుతున్నాయని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ సోమవారం తెలిపింది.

రష్యాకు "వ్యూహాత్మక ఓటమి" కలిగించాలనే విధానాన్ని అమెరికా నేతృత్వంలోని నాటో కూటమి దేశాలు అనుసరిస్తున్నాయని, అది రష్యాతో బహిరంగ సైనిక ఘర్షణ దిశగా నడిపిస్తోందని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఇందుకు ఉదాహరణగా పోలాండ్‌లో అమెరికా అణ్వాయుధాలను ఉంచడం గురించి పోలిష్ ప్రకటనలను, ఇటీవలి ఫ్రెంచ్, ఇతర నాటో దేశాలు తమ తమ దేశాల సైనికులను ఉక్రెయిన్‌కు పంపే అవకాశం గురించి అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, ఇతర నాయకులు చేసిన వ్యాఖ్యలను కూడా రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ఉదహరించింది.

కాల్పుల విరమణ ఒప్పందానికి హమాస్ ఓకే


ఈజిప్టు, ఖతార్ మధ్యవర్తులుగా ముందుకు తెచ్చిన కాల్పుల విరమణ ప్రతిపాదనను హమాస్ అంగీకరించినట్టు గ్రూప్ ప్రతినిధి సోమవారం అల్ జజీరాతో చెప్పారు. ఇజ్రాయెల్ దీర్ఘకాలంగా ప్లాన్ చేసిన దాడికి ముందు రఫా నగరాన్ని ఖాళీ చేయమని ఆదేశించిన కొద్దిసేపటికే ఈ ప్రకటన వచ్చింది. హమాస్ నాయకుడు ఇస్మాయిల్ హనియే ఖతార్ ప్రధాన మంత్రి షేక్ మొహమ్మద్ బిన్ అబ్దుల్ రెహ్మాన్ అల్ థానీ , ఈజిప్టు ఇంటెలిజెన్స్ మంత్రి అబ్బాస్ కమెల్‌తో ఫోన్లో చర్చించారు. కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించి తమ ప్రతిపాదనకు హమాస్ ఉద్యమం ఆమోదం తెలిపిందని గ్రూప్ అల్ జజీరా కు ఒక ప్రకటనలో తెలిపింది ప్రతిపాదన వివరాలు ఇంకా బహిరంగపర్చలేదు. హమాస్ గతంలో ఏదైనా కాల్పుల విరమణ శాశ్వతంగా ఉండాలని , ముట్టడి చేసిన పాలస్తీనా ఎన్‌క్లేవ్ నుంచి ఇజ్రాయెల్ సైనికులందరినీ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ హామీలను ఇవ్వడానికి నిరాకరించారు. గత వారం ఇజ్రాయెల్ హమాస్‌ను గాజాలో అధికారంలో ఉండనివ్వదని , కాల్పుల విరమణ ఒప్పందం లేదా లేకుండా రఫాపై దాడి చేస్తుందని హెచ్చరించింది. అయితే, పాలస్తీనా ఖైదీల కోసం ఇజ్రాయెల్ బందీలను మార్చుకోవడానికి యుద్ధంలో తాత్కాలిక విరామాన్ని ప్రకటించటానికి ఇజ్రాయిల్ సిద్ధంగా ఉందని నెతన్యాహు చెప్పాడు. ప్రస్తుతం గాజాలోని ఇతర ప్రాంతాల నుంచి దాదాపు 14 లక్షలమంది స్థానభ్రంశం చెందిన పాలస్తీనియన్లు నివసిస్తున్న దక్షిణ గాజాలోని రఫా నగరం పై దండయాత్రను ప్రారంభించాలని ఇజ్రాయెల్ ప్రధాని చాలా నెలలుగా బెదిరిస్తున్నారు. అమెరికా, యూరోపియన్ యూనియన్, అనేక ఇతర దేశాలు ఖండించినప్పటికీ, ఇజ్రాయెల్ సైన్యం సోమవారం నాడు పౌరులను రఫాను విడిచి వెళ్ళాలని ఆదేశించింది. ఆ తర్వాత కొద్దిసేపటికే "విపరీతమైన శక్తి"తో నగరంపై దాడి



జరుగుతుందని హెచ్చరించింది. కాల్పుల విరమణ ప్రతిపాదనను ఆమోదించాలనే హమాస్ నిర్ణయాన్ని దాడి ముప్పు ప్రభావితం చేసిందా అనేది స్పష్టంగా తెలియలేదు. నెతన్యాహు రఫాలోకి ప్రవేశించాలని పట్టుబట్టినప్పటికీ, ఇతర ఇజ్రాయెల్ అధికారులు ఇజ్రాయెల్ తాత్కాలిక సంధికి అంగీకరించడం ద్వారా హమాస్ దాడిని నివారించవచ్చని సూచించారు. ఈజిప్ట్ , ఖతార్ ముందుకు తెచ్చిన ఒప్పందానికి ఇజ్రాయెల్ మద్ద తు ఉందా లేదా అనేది కూడా అస్పష్టంగా ఉంది.

చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ వాయిదా

పదివారాల తర్వాత సుప్రీం విచారణ



న్యూఢిల్లీ : స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు బెయిల్ రద్దు కేసు విచారణను సర్వోన్నత న్యాయస్థానం పది వారాలకు వాయిదా వేసింది. 17ఏ అంశంపై ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం నిర్ణయం తరువాత బెయిల్ రద్దు పిటిషన్ పరిశీలిస్తామని జస్టిస్ బేలా త్రివేది అన్నారు. చంద్రబాబుకు హైకోర్టు ఇచ్చిన బెయిల్ ను సవాల్ చేస్తూ ఏపీ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్ ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్ లతో కూడిన ధర్మాసనం విచారించింది. 17ఎ అంశంపై ముగ్గురు న్యాయమూర్తల ధర్మాసనం ఏర్పాటుపై ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ముందు మెన్షన్ చేయాలని అనుకుంటున్నట్టు ధర్మాసనానికి సీఐడీ తరపు సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్ తెలిపారు. దీనికి స్పందించిన జస్టిస్ బేలా త్రివేది అది మీ ఇష్టం అని పేర్కొన్నారు. వేసవి సెలవుల తరువాత సీజేఐ ముందు మెన్షన్ చేయనున్నట్టు సీఐడీ తరపు న్యాయవాది తెలిపారు. అయితే 17ఎ అంశంతో సంబంధం లేకుండానే రాష్ట్ర హైకోర్టు బెయిల్ మంజూరు చేసిందని ధర్మాసనానికి చంద్రబాబు తరపు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే చార్జిషీట్ దాఖలు చేశారని, ట్రయల్ కోర్టు ఇంకా పరిగణనలోకి తీసుకోలేదని పేర్కొన్నారు. 17ఎ కింద అనుమతి తీసుకోలేదన్న కారణంగా చార్జిషీట్ ఇంకా పరిగణనలోకి తీసుకోలేదని చెప్పిందన్నారు. కేసులో మెరిట్స్ ఆధారంగానే హైకోర్టు బెయిల్ మంజూరు చేసిందని, దానికి 17ఎకి ఎందుకు లింక్ పెడుతున్నారని ప్రశ్నించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం కేసును పది వారాల పాటు వాయిదా వేసింది.

కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు

- జమతే-ఏ ఉల్మా అధ్యక్షులు మహ్మద్ ఖలీమోద్దీన్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు జమతే-ఏ ఉల్మా అధ్యక్షులు మహ్మద్ ఖలీమోద్దీన్ వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. హిందు, ముస్లిం, మైనార్టీలందరికీ విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించినట్టే లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీని గెలిపించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇప్పుడు తెలంగాణ ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు.దేశ ప్రజలు సంతోషంగా ఉండాలంటే, రాహుల్‌గాంధీ ప్రధాని కావాలన్నారు. బీజేపీకి ఓటేస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని హెచ్చరించారు.

అడ్డంకులను అధిగమించి అభివృద్ధి సాధిస్తాం

- రష్యా అధ్యక్షులు పుతిన్
- ఐదోసారి దేశాధ్యక్షునిగా ప్రమాణం

మాస్కో : అన్ని అవరోధాలను అధిగమించి, అభివృద్ధి లక్ష్యాలను సాధిస్తామని రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ చెప్పారు. మంగళవారం రష్యా అధ్యక్షునిగా ఆయన ఐదవ సారి ప్రమాణ స్వీకారం చేశారు. మార్చి 15 నుండి 17 వరకు జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో పుతిన్‌కు 87.28 శాతం ఓట్లు లభించిన సంగతి తెలిసిందే. క్రెమ్లిన్‌లో ప్రమాణస్వీకారోత్సవం అనంతరం ఆయన దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. 'రాబోయే దశాబ్దాల కాలంలో దేశాభివృద్ధిలో నమ్మదగిన కొనసాగింపు వుంటుందని హామీ ఇస్తున్నాం. రష్యా శక్తి సామర్ధ్యాలను మరింత బలోపేతం చేసేలా యువతరాలను పెంచాలి, విద్యావంతులను చేయాలి. పరస్పర సామరస్యంతో జీవించగలిగే, రష్యాలో నివసించే ప్రజలందరి సాంప్రదాయాలను పరిరక్షించేలా మన దేశ హోదాను అభివృద్ధి పరుస్తామని హామీ ఇస్తున్నాం' అని పుతిన్ అన్నారు. ఈ మేరకు క్రెమ్లిన్ ఒక ప్రకటన విడుదల చేసింది.1999లో మొదట ప్రధానిగా చేసిన పుతిన్ ఆ తర్వాత తాత్కాలిక అధ్యక్షులయ్యారు. 2000 మార్చి 26న దేశాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 2004లో రెండోసారి అధ్యక్షునిగా పనిచేశారు. 2008 నుండి 2012 వరకు ప్రధానిగా చేశారు. తిరిగి 2012 అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. 2018లో ఆరేళ్ళ పదవీ కాలానికి తిరిగి అధ్యక్షునిగా ఎన్నికయ్యారు.

రఫా క్రాసింగ్‌ను స్వాధీనం చేసుకున్న ఇజ్రాయిల్ బలగాలు

- కీలకమైన సహాయక మార్గం మూసివేతతో ఆందోళనకర పరిస్థితులు
- గత రాత్రి దాడుల్లో 23మంది మృతి
- చర్చలను భగ్నం చేసేందుకే ఈ చర్యలన్న హమాస్



గాజా : అంతర్జాతీయంగా ఎన్ని విజ్ఞప్తులు వచ్చినా వాటిని బేఖాతరు చేసి తను అనుకున్నట్లుగానే రఫా విషయంలో ఇజ్రాయిల్ తన దూకుడు చర్యలతో ముందుకెళుతోంది. గాజాలోని రఫా క్రాసింగ్‌ను మూసివేసి పూర్తిగా తన అదుపులోకి తెచ్చుకుంది. కీలకమైన సహాయ మార్గాన్ని మూసివేయడంతో సహాయం నిలిచిపోయింది. పైగా ఈ మార్గాన్ని తీవ్రవాదుల కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నట్లు తమకు సమాచారం అందిందని ఇజ్రాయిల్ పేర్కొంటోంది. ఇప్పటికే అరకొర సరఫరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే తాజాగా క్రాసింగ్‌ను మూసివేయడంతో మరింత విపత్తుకు దారితీసే ప్రమాదముందని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. రఫా సరిహద్దును మూసివేయడమంటే ప్రజలు చనిపోవాలని ఇజ్రాయిల్ కోరుకుంటోందని అర్ధమవుతోందని పాలస్తీనియన్ నేషనల్ ఇనీషియేటివ్ సెక్రటరీ జనరల్ ముస్తఫా బర్గౌటి వ్యాఖ్యానించారు. పైగా గాయపడిన, అనారోగ్యంతో బాధ పడుతున్న వేలాదిమంది పాలస్తీనియన్లు బయటకు వెళ్లడానికి గల ఏకైక మార్గం కూడా ఇదేనని ఇప్పుడు ఇది మూసివేయడంతో ఇక మరణమే శరణ్యమవుతుందన్నారు. రఫాపై గత రాత్రంతా జరిగిన దాడుల్లో 23మంది మరణించారు. వీరిలో ఆరుగురు మహిళలు, ఐదుగురు పిల్లలు వున్నారు. సెంట్రల్ రఫాలోని బిజీగా వున్న మార్కెట్ ఏరియాలో మసీదుపై క్షిపణిని ప్రయోగించడంతో నిత్యావసరాలు కొనుగోలు చేసేందుకు బయటకు వచ్చినవారందరూ భయాందోళనలతో పరుగులు తీశారు. సెంట్రల్ గాజాలోని నుస్రత్ శిబిరంపై మిలటరీ దాడులు జరపడంతో పిల్లలతో సహా పలువురు గాయపడ్డారు.

తక్షణమే రఫా ఆపరేషన్ ఆపాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) పేర్కొంది. ఇజ్రాయిల్ తీసుకున్న ఈ చర్యతో ఆరు లక్షలమంది పిల్లలతో సహా 15లక్షల మంది ప్రజల ప్రాణాలు తీవ్ర ప్రమాదంలో పడ్డాయని తూర్పు మధ్యధరా ప్రాంత ప్రాంతీయ డైరెక్టర్ హనన్ బాల్కీ హెచ్చరించారు. ఎలాంటి అవరోధాలు లేకుండా సాయమందడానికి కీలకమైన క్రాసింగ్‌ను తక్షణమే తెరవాలని ఎక్స్ పోస్టులో కోరారు. రఫాపై మిలటరీ దాడితో తీవ్ర పర్యవసానాలు వుంటాయని ఐక్యరాజ్య సమితి సంస్థలు, సహాయక గ్రూపులు హెచ్చరించాయి, అయినా ఏ రీతిలోనైనా తాము సాయం అందచేయడానికే కట్టుబడి వున్నామని స్పష్టం చేశాయి.పైగా గాజా కాల్పుల విరమణ ప్రతిపాదనను హమాస్ అంగీకరించినప్పటికీ తాము రఫాపై మిలటరీ ఆపరేషన్‌ను కొనసాగిస్తామని ఇజ్రాయిల్ స్పష్టం చేసింది. ఆ నేపథ్యంలోనే తాజా దాడి ప్రారంభమైంది. కతార్, ఈజిప్ట్ మధ్యవర్తులు చేసిన ప్రతిపాదనకు ఇజ్రాయిల్ డిమాండ్లకు అసలు పొంతన లేదని, అయినా కూడా కైరో చర్చలకు ప్రతినిధి బృందాన్ని పంపిస్తామని నెతన్యాహు కార్యాలయం ప్రకటించింది. ఈ ప్రతిపాదన గురించి అమెరికాకు ముందే తెలుసునని, అయినా హమాస్ అంగీకరించేవరకు తమకు తెలియచేయలేదని ఇజ్రాయిల్ పేర్కొంది. మూడు దశల కాల్పుల విరమణ ప్రతిపాదనను హమాస్ సోమవారం అంగీకరించింది. ప్రస్తుతం కొనసాగుతున్న కాల్పుల విరమణ చర్చలను భగ్నం చేసేందుకే రఫా దాడి ప్రారంభించిందని హమాస్ విమర్శించింది.

రఫా, కరీమ్ షలోమ్ సరిహద్దు క్రాసింగ్‌ను మూసివేయాలని నిర్ణయించడం ద్వారా ఈ ప్రాంతంలో కరువు కాటకాలను సృష్టించాలని, ప్రజలు ఆకలిదప్పులతో చనిపోయేలా చేయాలని ఇజ్రాయిల్ భావిస్తోందని విమర్శించింది. ఇటువంటి పరిస్థితుల్లో కాల్పుల విరమణకు ఇజ్రాయిల్‌ను ఒప్పించేలా అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని పాలస్తీనా గ్రూపు కోరింది. యుద్ధం ఇన్ని మాసాలుగా ఇలానే కొనసాగుతోందంటే అందుకు ప్రధాన బాధ్యత వహించాల్సిందిగా అమెరికా అధ్యక్షుడు బైడెన్, అంతర్జాతీయ సమాజమేనని స్పష్టం చేసింది.రఫా దాడిని ఆపేందుకు ఇజ్రాయిల్ తక్షణమే చర్యలు తీసుకునేలా చూడాలని పాలస్తీనా అథారిటీ (పిఎ) ప్రతినిధి నబిల్ అబూ రుడెనెహ్ అమెరికాను కోరారు. తాజా దాడులతో నిర్వాసితుల ఇబ్బందులు రెట్టింపు అవుతాయని హెచ్చరించారు. ఇజ్రాయిల్‌కు ఆయుధాలు, డబ్బు, రాజకీయ ఆశ్రయం ఇవ్వడం ద్వారా అమెరికా అనూహ్యమైన మానవతా విపత్తును సృష్టించిందని విమర్శించారు.

25 వేల ఉద్యోగాల రద్దుపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్‌లో 25 వేలకు పైగా ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బంది నియామకాలను రద్దు చేస్తూ కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు మంగళవారం స్టే విధించింది. నియామక ప్రక్రియలో అక్రమాలు జరిగాయని పేర్కొంటూ 25,753 ఉద్యోగాలను రద్దు చేస్తూ ఏప్రిల్ 22న కోల్‌కతా హైకోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. హైకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా దాఖలైన పిటీషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ జెబి పర్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించింది. హైకోర్టు తీర్పుపై స్టే విధించింది. అయితే ఈ విచారణలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ప్రభుత్వ ఉద్యోగాలు చాలా విలువైనవి. ప్రజల విశ్వాసం కోల్పోతే ఇక అంతా శూన్యం. మీరు దీనిని ఎలా పరిగణిస్తారు?' అని ధర్మాసనం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ తరుపు న్యాయవాదులను ప్రశ్నించింది. కాగా, ఈ నియామక ప్రక్రియ స్కాంపై సిబిఐ విచారణకు ఆదేశిస్తూ కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే విధించడానికి గత విచారణలోనే సుప్రీంకోర్టు నిరాకరించింది. సిబిఐ విచారించి ఉద్యోగులు దోషులుగా రుజువు అయితే హైకోర్టు తీర్పు వర్తిసుందని, ఉద్యోగులు జీతాలను కూడా తిరిగి ఇవ్వాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టం చేసింది.